# ఏమిటో ఈ మాయ!

కె.వి.యస్.యన్. ప్రకాష్

**కూనిరాగాలు తీస్తూ వచ్చిన గోపాలం కుడిచెయ్యి (కూనిరాగాలు తీస్తున్నది కుడిచెయ్యి కాదు) అప్రయత్నంగా జేబులోంచి తాళం చెవి తీసింది.**

కాని తలుపుకు తాళం లేకపోవటంతో రమేష్ వచ్చాడన్న విషయం మెదడులోకి, తాళం చెవి జేబులోకి పడటం వెంట వెంటనే జరిగాయి. తెరచివున్న తలుపు తోసుకొని,

"వరేయి రమేషం
వచ్చావా సంతోషం."

అని పాడుకుంటూ లోపలికి వెళ్ళాడు గోపాలం. కిటికీలు అన్నీ మూసి వుండటంతో గది చీకటిగా వుంది. తెరిచిన తలుపు యిస్తున్న పరిమితమయిన వెలుగులో గదిలో అలుముకున్న పొగ....సిగరెట్ పొగే....ఒకమూల మరీ దట్టంగా వుండటం కనిపిస్తున్నది. ఒక చేత్తో కిటికీలు తెరుస్తూ, రెండో చేత్తో ఫ్యాన్ స్విచ్ వేసి. రెండు చేతులతో పొగను చీలుస్తూ గది మూలకు చేరుకున్నాడు. గోపాలం చేసిన వ్యాయామం ధర్మమా అని గదిలో వెలుతురు బాగా చోటు చేసుకుంది. ఆ వెలుతురులో గది మూలవున్న దృశ్యాన్ని చూసిన గోపాలం అయోమయంగా. ఆశ్చర్యంగా విస్తుపోయాడు.

రమేష్ చేతిలో సగంఖాళీ అవని గ్లాసు. టేబులుమీద సగంఖాళీ అయిన బాటిల్ - ఈ రెండింటిలో ఏది గోపాలాన్ని ఆ స్థితికి తీసుకువచ్చిందో చెప్పటం కష్టం! అదే టేబులుమీద యాష్ ట్రేకి బదులుగా వుపయోగించబడుతున్న పేపరు మీద వున్న యిరవై సిగరెట్ పీకలు, పక్కన వున్న రెండు సోడా సీసాలు పై రెండింటితో కలిపి గోపాలంని కంగారుపెట్టి వుంటాయి

గోపాలం భుజం మీద నుంచి ఎక్కడికో చూస్తూ "బాగున్నావా?" అన్నాడు రమేష్.

"ఏమిటో లేరా! ఏమిటి కబుర్లు! ఏమిటి విశేషాలు? ఏమిటి అవతారం?" అన్నాడు గోపాలం రమేష్ చూపు తన ముఖం మీద పడేట్లు వంగుతూ!

చూపును ఈ సారి గోపాలం ఎడం భుజం మీదకు మార్చి అన్నాడు "గోపాలం నువ్వే రక్షించాలిరా!"

ఇంకో గ్లాసును, కుర్చీని తెచ్చుకుని రెండో దాంట్లో కూర్చుంటూ మొదటి దానిలోకి బాటిల్ లోంచి పోసుకుంటున్న గోపాలం "పిచ్చివేషాలు కట్టిపెట్టి అసలు సంగతి చెప్పు!" అన్నాడు.

గ్లాసులో బెత్తెడు మేరవున్న విస్కీని ఒక్క గుక్కలో తాగి అన్నాడు రమేష్ "విషాద వాణి. శోక వార్తలు. చదువుతున్నది దుఃఖేషం. ఆర్థిక సంక్షోభం. హానుమంతం నన్ను రేసుకోర్సులో చూడటం. పురుషోత్తమరావు రాక...."

"ఆగు. ఆగాగు. మొదటి రెండు అర్థం అవుతున్నాయి. కాని ఎవరీ పురుషోత్తమరావు? కాస్త వివరంగా చెప్పు?"

"పురుషోత్తమరావు విషయం నేను చెప్పేముందు నువ్వు ఒక వుత్తరం చదివితే బాగుంటుంది - వుత్తరం చొక్కా జేబులో వుంది. ఇస్తాను." గ్లాసు బల్లమీద వుంచి లేచాడు రమేష్.

అప్పుడు చూశాడు గోపాలం రమేష్ కట్టుకున్న లుంగి. "హాయ్? చాలా బావుంది! ఫాంటాస్టిక్! స్పెక్టాకులర్! ఎప్పుడు కొన్నావు ఈ లుంగీ?"

"నీ సెలక్షన్ బాగుంటుంది అని బోడి గొప్పలు చెప్పుకోనక్కర్లేదు. ఇది నీ లుంగీనే.'

"నా లుంగీనా! హౌ డి హెల్...."

చొక్కా జేబులోంచి వుత్తరంతీసి "నీది కాకపోతే ఆ బల్లమీదవున్న చాకలి తీసుకువచ్చిన బట్టల్లో...." అంటూ ఏదో చెప్పసాగాడు రమేష్.

"చంపావు పో! విప్పేయ్! ఇంకా అట్లా చూస్తావేమిటి? విప్పేయ్! నువ్వు విప్పకపోతే నేనే దుశ్శాసనుడులాగా ఆ లుంగీ..కాదు చీర విప్పేయాల్సి వస్తుంది. ఆ చీర మా పక్కింటి జాంబవతిది. ఆ అమ్మాయి జగదేకవీరుడి ప్రేయసిలాగా చీరను దొంగిలించినవాడిని పెళ్ళి చేసుకుంటానని శపథం పట్టినట్లు వినికిడి. నిన్ను ఇట్లా చూసిందంటే "ఓయమ్మా! నా చీర నామది దోచిన చినవాడే" అంటూ అమాంతం.. ఎందుకులే.... ఆ పెట్టెలో లుంగీలు వుంటాయి ఒకటి నువ్వు తీసుకుని, రెండోది నాకు ఇవ్వు. ఆగు ఆగాగు. ఆ చీర అట్లా లుంగచుట్టకు. ముందు మడతపెట్టు. ఇప్పుడు అడ్డంగా సమద్విఖండన అంబురేఖ గియ్యి. నిలువుగా ఇంకో స. ద్వి. ఖం. రేఖ గియ్యి. మళ్ళీ

డిటో! ఇప్పుడు పరుపుకిందపెట్టి దానిమీద కూర్చో! నీ బరువెంత? ....అరవై రెండు కిలోలా? అయితే ఇస్త్రీ అయిపోతుందిలే; ఇక కథ చెప్పు .... సారీ! ఆ ఉత్తరం ఇవ్వు."

రమేష్ ఉత్తరం ఇచ్చాడు.

శ్రీయుత రంగనాథరావు గారికి,

మీ సెక్రటరి....(పేరు సరిగ్గా గుర్తులేదు హనుమంతం అనుకుంటాను.) ద్వారామీరు పంపిన ఆహ్వానం అందింది. కృతజ్ఞుడిని. మీ సెక్రటరితో నయినా ఎక్కువసేపు మాట్లాడలేకపోయాను.


నేను మా అమ్మాయితోసహా ఆరో తేదీ గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి బయలుదేరు తున్నాం. (ఏడున హైదరాబాద్ చేరతాం) ఇక వుంటాను.

భవదీయుడు

పురుషోత్తమరావు.

"ఎవరింతకీ ఈ పురుషోత్తమరావు?" ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుంటూ అడిగాడు గోపాలం 'ఏడంటే రేపే కదూ?"


"రామాయణం మొదటి ఫాస్ట్ ర్



చదివి "అపుడు ఏపడు?" అన్నట్లుంది. నేను చెప్తాను కొన్త ఓపికగా విను. ఆయన ఒక పెద్ద జ్యోతిష్యశాస్త్రవేత్త. హస్తసాముద్రికంలో, జ్యోతిష్యంలోనూ, న్యూమరాలజీలోను మంచి ప్రతిభ కలవాడు. జ్యోతిష్యరత్న, మరో ఆరు జ్యోతిష్యభూషలు పేరు ముందున్నవాడు. పదేళ్ళ క్రితం "ఇలస్ట్రేటెడ్ వీక్లీ" లో "దిస్ వీక్ ఫర్ యూ" రాసేవాడు. అరవై ఆరు నుంచి డెబ్బైఏడు వరకూ ఆయనకు పత్రికా వ్యాసంగానికి జ్యోతిష్యరీత్యానో న్యూమరాలజీ రీత్యానో సరిపడదుట. అందుకని ఇప్పుడు రాయటంలేదు...."

పురుషోత్తమ రావుకి జనం తనచుట్టుచేరి మెచ్చుకోవటం, పబ్లిసిటీ అంటే యిష్టం లేదు. ఆయన శిష్యులు ఆయనకన్నా ఎక్కువ ప్రచారాన్ని పొందారు. ఆయన శిష్యుల్లో ఒకరు రంగనాధరావుకి అంటే రమేష్ నాన్నకి గురువు. రంగనాధరావుకి జ్యోతిష్యం అంటే అమితమయిన గురి. ఎంతోనమ్మకం. ఏ పని చెయ్యాలన్నా తన గురువు గారిని సంప్రదించిగాని చేసేవాడు కాదు. తను అనుకున్నట్లుయాభైరెండవఏట కాకుండా నలభైఏడవ ఏటనే టపాకట్టేస్తానని ఆ గురువుగారికి తెలియకపోవడంతో రంగనాధరావుకి హఠాత్తుగా కొత్త గురువును వెతుక్కునే అవసరం కలిగింది.

"....ఆయన విశాఖపట్నం దగ్గర ఊరు పేరు లేని ఊళ్లో వుంటున్నాడు. మా నాన్నగారి జ్యోతిష్యపు పిచ్చి నీకు తెలుసు కదా? పురుషోత్తమరావుకి ఒక అమ్మాయి వుందని, ఆ అమ్మాయి తెలుగు ఎమ్. ఏ. చదివిందని. అందంగా వుంటుందని విన్న



మా నాన్నగారికి ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని.... సారీ! నాకు యిచ్చి పెళ్ళి చెయ్యాలని వుంది. నా మనసు భానుక యిచ్చాను కదా?? నా దగ్గర వున్నది భాను మనసు కదా?! అందులో ఈ అమ్మాయికి చోటు యివ్వటానికి నాకు హక్కు ఎక్కడ వుంది? ఒకవేళ యిచ్చినా ఏం బావుం టుంది? అన్నట్లు ఈ అమ్మాయి భాను అంత బాగుండదని నా అభిప్రాయం.... కొంచెం గ్లాసుతో మంచి నీళ్ళు నాయినా!"

రమేష్ అన్న చివరి మాటలు వినపడ నట్లే అన్నాడు గోపాలం. "పాతికఏళ్ళు దాటాయి నీకు. మీ నాన్నగారికి ఆమాత్రం చెప్పలేవా? భానుమతిని తప్ప ఇంకా ఎవ రినీ పెళ్ళి చేసుకోలేనని చెప్పలేవా?"

"ఒరేయ్! మా నాన్నగారిని నువ్వు చూడకపోయినా ఆయన తత్త్వం నానుంచి ఎన్నిసార్లు విన్నావు! నేను యింజనీరింగ్ చదువుతాను అంటే మెడిసిన్‌లో చేర్పించారు. చదువు అయిపోయాక ప్రైవేటు ప్రాక్టీసు పెట్టిస్తారని ముందే వూహించి: అది యిష్టంలేక నీ సలహా మీదనేకదా ప్రైవేటు ప్రాక్టీసు పెడతాను అని ఆయనతో చెప్పడం, ఆయన వెంటనే "వద్దు! ఓ అయిదు సంవత్సరాలు గవర్నమెంటు ఉద్యోగం వెలగబెట్టు" అనడం జరిగాయి. నా అంతట నేను నిర్ణయాలు తీసుకోలేనని తెసుకున్నా అవి మంచివి కావని ఆయన అభిప్రాయం. కాబట్టి ఇప్పుడు ఈ పురుషోత్తమరావుగారి కూతురు .... ....పేరు రాధ అనుకుంటాను....నా భార్య అవటం గ్యారంటీ—అఫ్‌కోర్సు నీ సహాయం లేక పోతే అనుకో! నేను భాను గురించి చెపితే మా నాన్నగారు వినను కూడా వినరు. పైగా భాను మెడిసిన్ చదువు తున్నది. ఆయన డాక్టరీ చదివే కోడలు తప్ప ఏదన్నా భరిస్తారు." రమేష్ మంచం మీద నుంచి లేచి వెళ్ళి గ్లాసు నిండా మంచి నీళ్ళు పోసుకుని వచ్చి కూర్చు న్నాడు. మళ్ళీ ఏం అనుమానం వచ్చిందో పరుపు ఎత్తి చీరను పరీక్షగా చూసి మళ్ళీ కూర్చున్నాడు.

"బాగుంది! ఇందులో నేను సహాయం చెయ్యటానికి ఏం వుంది? నీ సెలక్షన్‌మీద నమ్మకం లేని మీ నాన్నగారు నువ్వు సెలక్ట్ చేసుకున్న ఈ స్నేహితుడిని అసలు గౌర వించరు. తరువాతి సంగతులు కూడాచెప్పు. ఆర్థిక సంక్షోభం అన్నావు. రేసెస్‌లో పోయాయా? రేసుకోర్సులో కనబడ్డ హను మంతం వెంటనే మీ నాన్నగారికి చెప్పి సెక్రటరీగా తన ధర్మాన్ని పాటించాడా?"

"ఏదీ? హనుమంతం ఈ రోజేకదా నన్ను రేసుకోర్సులో చూసింది! మా నాన్నగారు రేపటికిగాని వూరినుంచి రారు. కాబట్టి ఇంకా ఆ విషయం చెరవేయబడ లేదు. ఇకపోతే ఈ సీజనులో నా అదృష్టం బాగాలేదు. దాదాపు రెండువేలు పోయాయి. నెల జీతం తీసుకుని ఇవాళ బయలుదేరాను' నాకు బాగా నమ్మకంగా వుంది. "నేనే గెలుస్తా" గెలిచి తీరుతుందని. నా దగ్గర వున్న చివరి పైసా కూడా దాని మీద పెట్టాను. నీకు తెలుసు కదా. రేసెస్ జరుగుతున్నప్పుడు నేను కాంటీనులో ప్రశాంతంగా కూర్చొని బీర్ తాగుతూ వుంటానని. ఆరేసు గెలిచాక నేను ఎట్లాంటి పార్టీ ఇవ్వాలా అని ఆలోచిస్తు న్నాను. ఇంతలో హనుమంతం అటు వెడుతూ నన్ను చూశాడు. "హల్లో! రమేష్ ఒక్కడివే వచ్చావా?" అంటూ పలకరించాడు.

"మరి నువ్వేం చేశావు? 'రేసుల కోసం రాలేదు. జస్ట్ బీర్ తాగటానికి వచ్చాను. అని చెప్పావా?"

"వాడి వంక సీరియస్‌గా చూస్తూ 'Would You please make it in English? I do not know what was it.... Telugu or Kannada?' అన్నాను."

"ఆర్నీ!"

'ఆ దెబ్బతో వాడి మొహం ఎంతగా మాడిపోయిందో నేను చెప్పలేనురాబాబూ!'

"ఇన్ని తెలివితేటలు వుండీ నువ్వు నా దగరకు సలహాకు వచ్చావేమిటి? అమెరికా వాడు అర్జెంటీనాను అప్పు అడిగినట్లు. వాడు నీ ట్రిక్ కనిపెట్టాడంటావా ఇంతకీ?" అన్నాడు గోపాలం రమేష్‌వంక ఆప్యా యంగా చూస్తూ!


"చెప్పానుకదా! చాలా పెద్ద దెబ్బ తగిలి నట్లు కనిపించాడు. నాలాంటి వాడే వాడికి బాగా తెలుసని చెప్పాడు. నా పేరు అడి గాడు నేను బిషన్‌సింగ్ బేడీ అని చెప్పా నులే! దాంతో సారీ చెప్పి వెళ్ళిపోయాడు. అన్నట్లు ఆ హాంగర్‌కు తగిలించి వున్న పాంటు నీదేనా లేకపోతే ఆ జాంబవతిదా?"

"ఏమిటీ పిడకల వేట? అది నాదే! ఎందుకు?"

"బతికించావు! సరే!వాడు వెళ్ళిపోయిన రెండు నిముషాలకు తెలిసింది_ నేనే గెలుస్తా"...."

"ఓడిపోయిందని!" మధ్యలో అందు కున్నాడు గోపాలం.

"నీ మొహం! గెలిచిందని! అంటె నా లాస్ అంతా కవర్ చేసుకుని పైన రెండొందలు లాభం అన్నమాట! ఏమిటీ మొహం అట్లా పెట్టావు?"



రమేష్ చెప్పిన మాటలు విని అర్థంకాని అయోమయంలో వున్న గోపాలం రెండు సార్లు తల విదిలించి అన్నాడు "గెలిచావు మళ్ళీ ఆర్థిక సంక్షోభం అంటావు. నీకు మతి పోయిందా? లేక..."

"పూర్తిగా విను. బిల్ పే చేసి జనంలో నుంచి బయటపడి చూసుకుందునుకదా జేబులో పర్సులేదు-అసలు పాంటుకు జేబే లేదనుకో. పాంటును ఏడంగుళాల మేర కోసి పర్సు కాజేశాడు ఎవడో! ఆ పర్సు లోనే వున్నాయి అన్నీ!"

"నీ పాంటును అంతగా కోసినా నీకు తెలియలేదా? భలే ఫన్నీగావుంది. తరువాత ఏమయింది? చెప్పు." అన్నాడు గోపాలం నవ్వుతూ.

"అందులో ఫన్ ఏముంది? నీ పాంటు నాకు లూజుకదా?"

"అంటే?" అర్థం అయినా కానట్లు అడిగాడు గోపాలం.

"ఆ హేంగర్‌కు వున్న పాంటు...."

"రాస్కెల్! నా రూమ్‌లోకి నా అనుమతి లేకుండా వచ్చి, నా అనుమతి లేకుండా నా పాంటును తొడుక్కుని, నా అనుమతి లేకుండా పాంటు కోయించుకుని...."

"నీ అనుమతి సంగతి అటు వుంచు. నా బట్టలన్నీ లాండ్రీలో వున్నాయి. లాండ్రీకి ముప్పై రూపాయలు ఇవ్వాలి. ఆ ముప్పై 'నేనే గెలుస్తా' మీద పెడితే పెరుగుతుందని సమయానికి పాంటు బాగుండక నీ పాంటు తీసుకు వెళ్ళాను - పైగా నువ్వే చెప్పావు నీ పాంటు లక్కీ పాంటు అని?"

"పాంటు డార్నింగ్ చేయించే బాధ్యత నీదే! అన్నట్లు నీ పైసలన్నీ పోయి వుండాలి కదా? ఈ బుడ్డికి, సిగరెట్లకి పైస లెక్కడివి?" అన్నాడు గోపాలం - తల మీద చేతులు పెట్టుకుంటూ.

చొక్కా జేబులోంచి తాళంచెవి తీసి చూపించాడు రమేష్.

"అవును. అది నా గదిదే! నీ దగ్గర వుండకూడదు. ఇటు ఇవ్వు! ఇంతకీ డబ్బు ఎక్కడిది?"

"మీ వీధిలోని లిక్కరు షాపువాడు డాలర్లు పుచ్చుకుంటాడు తెలుసా?"

"తెలియదు! నీకు బుడ్డి కొనటానికి డబ్బులు ఎక్కడనించి వచ్చాయోకూడా తెలియదు. ముందు అది చెప్పు!"

"నీ రూమ్‌కి చిరిగిన పాంటుతో




"ముగ్ధ దీపిక"
చిత్రం : ఈశ్వర్, కాకినాడ

వచ్చాను. బయట ఆటోవాడు పైసలకోసం వెయిట్ చేస్తున్నాడు. బ్రహ్మాండమైన ఐడియా తట్టింది. ఎందుకు ట్రై చెయ్యకూడదు అని నీ ఫారెన్ కరెన్సీ ఆల్బమ్‌లో రూబుల్సు, ఫ్రాంక్సు అట్లాగే వుంచి ఒక అయిదు డాలర్ల నోటు...."

గోపాలం సెకనుకు లక్షా ఎనభై అరు వేల మైళ్ళ వేగంతో రమేష్‌ని సమీపించాడు. "దుర్మార్గుడా! నిన్ను ఏం చేసినా పాపం లేదు...."

"ఆగరా బాబూ! నీ సోది ఆపు. ఈరోజు పర్సు పోగొట్టుకున్నాను. రేపటికి మా నాన్నగారు తిరిగివస్తారు. హనుమంతం గాడు మా నాన్నగారికి నా గుర్రాల సంగతి చెప్తాడు. నా బీదరికం అది నిజమంటుంది. ఈలోగా రాధ. పురుషోత్తమరావు వస్తారు. మా నాన్నగారు అప్పుడు వుండే మూడ్‌లో భాను సంగతి చెప్పినా లాభం వుండదు. రెండు రోజుల తరువాత చిరంజీవి రమేష్‌కి చిరంజీవి సౌభాగ్యవతి రాధకు ఇచ్చి అన్న శుభలేఖ అందుకుంటావు. ఇన్ని కష్టాలలో నేను వుంటే ఆఫ్టార్‌ల్ ఒక్క తెల్ల పాంటు. అయిదు డాలర్ల కోసం ఏడుస్తావా? నన్ను రక్షించరా అని సాయం కోసం వస్తే నువ్వు చేసే పని ఇదా?"

గోపాలం కోపం చల్లారిపోయింది. రెండు నిమిషాలు ఆలోచించి అన్నాడు. "సరే! ఇందాకటినుంచి మనం తక్షణ కర్తవ్యం మరిచిపోయి తప్పుదోవన తిరుగుతున్నాం! నాకు ఒక ఐడియా తట్టిందని అనుకుంటున్నాను. కాని నాకు నాలుగయిదు సందేహాలు వున్నాయి. అవి తీరితే అంటే నువ్వు తీరిస్తే నా ఐడియా మంచిదో, కాదో చెప్తాను. పురుషోత్తమరావు మీనాన్నగారికి బాగా తెలుసా?"

"లేదు. అసలు ముఖ పరిచయం కూడా లేదు. మా నాన్నగారికి అదివరకు వున్న గురువుగారి గురువు ఈ పురుషోత్తమరావు. మొన్న సీలేరుకి మా నాన్నగారు వెళ్ళేటప్పటికి ఆ క్రితంరోజు పురుషోత్తమరావు అక్కడకి వచ్చాడని, ఆపాటికి విశాఖపట్నం వెళ్ళే బస్సులో వుండివుంటాడని తెలిసిందట. అంతే. హనుమంతాన్ని అక్కడకి తోలారు. తరువాత ఆ ఉత్తరం వచ్చింది."

"అంటే మీ నాన్నగారు పురుషోత్తమరావుని చూడలేదన్నమాట. మరి హనుమంతం రాధను చూశాడా?"


"లేదు రాధ సీలేరు రాలేదు."

"హనుమంతం నన్ను ఎప్పుడూ చూడలేదు కదూ?"

"నేను కరెక్టుగా చెప్పలేను గాని ఎప్పుడూ చూసినట్లు లేదు."

"మంచిది. అది సరేగాని పురుషోత్తమరావు మీ నాన్నగారు కబురు పెట్టగానే కూతురితోసహా ఎందుకు వస్తున్నాడు? పరిచయం లేదు అన్నావుకదా?"

"అది నాకూ కొంత వరకు అర్థంకాని విషయం. కాని ఆయనకు వచ్చేవారం బొంబాయిలో అఖిల భారత జ్యోతిష్య శాస్త్రవేత్తల సమావేశం వుంది. దారే కదా




అని.... పైగా శిష్యుడి శిష్యుడు...."

"చాలా బావుంది. ఛానుమతికి రేపటి నుంచి రెండు వారాలు సెలవులు కాద్యూ."

"అవును. ఎందుకు?"

"అన్నీ సరిపోతున్నాయిరా బావి! నువ్వు యింక మాట్లాడకుండా పడుకో? నిన్ను ఒడ్డున పడవేసినట్లే లెక్క. నా ఋణం తీర్చుకోవాలంటే అది స్మాచ్ పార్టీతోనే సాధ్యం. నేను కొన్ని ఏర్పాట్లు పూర్తిచేసుకుని వస్తాను" అన్నాడు గోపాలం బట్టలు తొడుక్కుని బయటకు వెళ్ళబోతూ.

"ఆగు. ఇదిగో ఈ బిల్లు తీసుకో!" అన్నాడు రమేష్ హడావుడిగా చొక్కా జేబులోంచి ఒక కాగితం తీస్తూ.

"ఏమిటది?"

"ఏముంది లాండ్రీ బిల్లు! నా బట్టలు తీసుకురా! తీసుకురావా? పోన్లే నీ కొత్త బట్టలు వున్నాయికదా అని వాడుతాను. తీసుకొస్తావా? థాంక్స్!"

గోపాలం వెళ్ళిపోయి రెండున్నర సిగరెట్లు అయ్యింది. గోపాలం ఇచ్చిన ధిలాసాతో రమేష్ కులాసాగా సిగరెట్లు కాలుస్తూ పడుకున్నాడు. పడుకుని గోపాలంకి తట్టిన మాస్టర్ ప్లాన్ ఏమిటా అని ఆలోచిస్తున్నాడు. ఇంతలో తలుపు చప్పుడయ్యింది "నాయనా గోపాలం"తోపాటు సిగరెట్ పారేసి లేచాడు రమేష్.

తలుపు తియ్యటానికి ముందుకు కదిలిన రమేష్ ఒక్క నిముషం ఆగి ఆలోచించాడు. గొంతు చూస్తే ముసలి గొంతు. గోపాలం బాబాయి కాదుకదా? బుడి చూస్తే ప్రమాదం. అనుకుని రమేష్ వణుకుతున్న చేతులతో రెండు గ్లాసులు. బాటిల్ పక్కనే వున్న కిచన్‌లో పెట్టి తలుపు దగ్గరగా వేశాడు. ఒళ్ళో, కదలబోయి ఆగిపోయాడు— చొక్కా, బనీను లేని తన ఛాతీని చూసుకుంటూ, తలుపు చొక్కాతో తియ్యటమా (అంటే తలుపు చొక్కాతో తీస్తారని కాదు.) లేక చొక్కా లేకుండా తియటమా అన్న విషయాన్ని ఆలోచించాడు. కాని బయట నుంచి చప్పుళ్ళు. 'నాయనా గోపాలం'లు మూడుసార్లు వినరావటంతో చొక్కాకి, తలుపు తియ్యటానికి ఏమాత్రం సంబంధం లేదని నిశ్చయించుకున్నాడు. నిశ్చయించుకుని తలుపుతీశాడు.

"గోపాలం లేడా? గోపాలం నీకు తెలుసా? నీ పేరేమిటి?" అంటూ ఒక ముసలాయన లోపలికి వచ్చాడు. బట్టతల వల్ల ఫుట్‌బాల్‌కు ముక్కు చెవులు పెట్టినట్టు వుంది ఆయన ముఖం. సన్నగా, పొట్టిగా అమితాబ్ బచన్‌ని అడ్డంగా కోసినట్లు వున్నాడు. రావటం రావటం అదోలా చూస్తూ వచ్చాడు. గోపాలం ఇంటి యజమాని ఆయన.

"నమస్కారం సార్! లోపలకి వచ్చి కూర్చోండి! నాపేరు రమేష్! గోపాలం...."

"నువ్వు చొక్కా ఎందుకు తొడుక్కోలేదు?"

రమేష్‌కి మతి పోయింది. తను చొక్కా వేసుకోకపోతే ఈయన యింత కష్టపడాల్సిన అవసరం ఏమిటి? ఏం చెప్పాలో తెలియక మౌనంగా వుండిపోయాడు. ఇంకోగా ఉంటో తెలి.

"తలుపు తియడానికి యింత ఆలస్యం ఎందుకు అయ్యింది?"

అసలే మాటలు రాక ఏడుస్తున్న రమేష్ ఆ ప్రశ్న హఠాత్తుగా రావటంతో తత్తరపోయాడు "అది ఆ గది.... లేదండి. ఏమి లేదు.." అన్నాడు మాస్టారి బొమ్మ గీస్తూ. దొరికిపోయిన పిల్లవాడిలా తడబడిపోతూ. అసలే రమేష్‌కి ఆయన చూపులు నచ్చలేదు. అవి డైరెక్టుగా కిచన్ వేపు చూస్తున్నాయి. అవి చూడనప్పుడు రమేష్‌ని దొంగని చూసినట్లు చూస్తున్నాయి.

"ఇందాక ఏదో గ్లాజుల శబ్దం అయ్యింది. ఏమిటది?" కిచన్ వేపు చూస్తూ అడిగాడు. బుడ్డి, గ్లాసులు దాచేటప్పుడు అంతగా వణికిన తన చేతులను తిట్టుకున్నాడు రమేష్—అంత చిన్న శబ్దాలనికూడా వినగలిగిన ఆయన చెవులతో కలిపి.

"కొంచెం మంచినీళ్ళు ఇస్తావా?"

బతికించాడు. ఈయన చూపులనించి తప్పించుకోవచ్చు అనుకుంటూ కిచెన్‌లోకి వచ్చాడు రమేష్. చూస్తే ఇంకో గ్లాసు లేదు. విస్కీగ్లాసును కడిగి, బొంగురుపోయిన గొంతును స్వాధీనంలోకి తెచ్చుకుని, ఆయన— ఏమిటి యింత ఆలశ్యం? ఎవరితో నయినా మాట్లాడుతున్నావా అని చెరి రెండు సార్లు ఏమిటిది అని ఒకసారి అనేటప్పటికి (సారీ! ఏమిటిది అని అనటంకాదు, గర్జించటం!) నీళ్ళు పట్టి హాలులోకి వచ్చాడు.

రమేష్ చిన్నప్పుడు బాంబు ఒకటి ఎంతకీ పేలటం లేదని దానికి దగ్గరగా మొహంపెట్టి పరీక్షిస్తుండంగా పేలింది అది. కళ్ళముందు మెరుపులు. చెవులలో ఉరుములు. మెదడులో పిడుగులు వచ్చి పెట్లయి తల దిమ్ము ఎక్కింది. అప్పుడు అట్లాగే అయ్యింది రమేష్ పరిస్థితి ఇప్పుడు.

ముసలాయన పరుపుకింద వున్న చీరను తీసి చేతులతో పట్టుకుని దాన్ని వూపుతూ, ఈ కింది పేరాను ఒప్పచెప్పి, ఆ చీరను వుండచుట్టి అది రమేష్‌కి తగిలేలా విసిరాడు.

"ఇన్నాళ్ళు గోపాలం ఎంతో మంచి

వాడు అనుకున్నాను. అతను నీ లాంటి వాళ్ళకు గది వాడుకోవటానికి ఇస్తాడా? నువ్వు నా గదిలోకి ఎవర్తినో తెచ్చు కుంటావా? ఇదిగో చెప్తున్నాను.. ఆ పిల్లకి ఆ చీర కట్టి పంపించెయ్యి. ఇంకో అరగంటలో.."

రమేష్‌కి అర్థం అయ్యింది ఆయన చూపుల అర్థం. తనకు చొక్కా లేక పోవటం, తలుపు తియటానికి ఆలస్యం అవటం. బాటిల్ గ్లాసుల శబ్దాన్ని ఇంకోలా అర్థం చేసుకోవటం, పరుపుకింద చీర దొర కటం. మొదలైనవన్నీ కలిపిచూసి ముసలాయన తనను అపార్థం చేసుకున్నా డని తెలిసింది. కాని యిప్పుడు ఆయనకు నచ్చచెబుదామంటె ఆయన వినే మూడ్‌లో వున్నట్టు కనబడటం లేదు. ఇంతలో బ్రహ్మాండమయిన ఐడియా వచ్చింది రమేష్‌కి.

"చూడండి సార్! మీరు నన్నుపూర్తిగా అపార్థం చేసుకున్నారు. పైగా మీరంత.. ఆవేశపడకండి. పెదవారు. బ్లడ్‌ప్రషర్ వున్నట్లుంది. ఒంటికి మంచిదికాదు కోపం చల్లారాక మీకే తెలుస్తుంది నా నిర్దోషిత్వం కోపం చల్లారేందుకు ఒక మంచి జోకు చెప్తాను వినండి. ఆయన మాట్లాడటా నికి వీలులేకుండా చెప్పసాగాడు రమేష్.

"ఒక విదేశీయుడు వచ్చి హైదరాబాద్ హోటల్లో దిగాడు. రెండు రోజులు అయ్యాక బిల్లు చూశాడు. మతి పోయింది. పరుగున గుమాస్తా దగ్గరకి వెళ్ళి "ఏమి టయ్యా ఈ ఘోరం! రెండు రోజులకు యింత చార్జ్ చేస్తావా? ఫలానా ఊళ్ళోనయితే రాజ భోజనం ఫ్రీకే చెయ్యవచ్చు. ఆ తరువాత పడుకోవటానికి హంస తూలికా తల్పం - అది కూడా ఫ్రీకే ఇస్తారు. తెల్లారి లేచి చూసుకుంటే దిండు కింద వంద రూపాయల నోటు వుంటుందని చెబితే ఇక్కడికి వచ్చాను తెలుసా? అన్నాడు. ఆ గుమాస్తాకి మతి పోయింది. "ఎవరు చెప్పారు సార్ ఈ విషయాలు" అని అడిగాడు. దానికి ఆ విదేశీయుడు అంటాడు కదా "మా ఆవిడ చెప్పింది" అని హహ! హహ! ఎట్లావుంది సార్? ఈ జోకు?"

ముసలాయనకి పూనకం వచ్చింది. "అదుగో! నువ్వు ఎటువంటి వాడివో నీ జోకులే చెబుతున్నాయి. ఆ చీరను ఆ పిల్లకి తగిలించి పంపు. నేను రెండు గంటల తరువాత వస్తాను. అప్పటికి ఇల్లు ఖాళీకాక పోతే మీ యిద్దరి మీద కబాడీ ఆడ తాను" అంటూ వెళ్ళిపోయాడు.

రమేష్ పిచ్చినవ్వు నవ్వుతున్నాడు. గోపాలం తన కష్టాలు తీర్చటానికి ప్రయ త్నిస్తుంటే తను గోపాలంకి కష్టాలు కలుపు తున్నాడు. తల దిమ్మ ఎక్కువ అయినట్లు తోచింది. సిగరెట్ కోసం చూస్తే అయి పోయాయి, ముసలాయన వచ్చినప్పుడు ఆపిన సిగరెట్ పీక తీసి ముట్టించ బోయాడు. మళ్ళీ తలుపు చప్పుడయింది- ఈ సారి 'ఏమండీ' అన్న ఆడ గొంతుతో!

రమేష్‌కి చిన్న అనుమానం వచ్చింది- ఆ వచ్చింది జాంబవతి అని. వెంటనే



నేలమీదవున్న చీరెను మంచం కిందకు తోసి. పరుపుమీది ఉన్న దుప్పటి కిందుగా లాగాడు. చెదరిన జుట్టు సర్దుకొని తలుపు తియబోయి. ఆగి, చొక్కా తొడుక్కుని తలుపు తీశాడు.

రమేష్ అనుకున్నవి జరగటం కాని, వూహించినది జరగటం కానిచాలా అరుదు. కాని ఈ సారిరమేష్ వూహ పొల్లుపోలేదు. వచ్చింది జాంబవతే....పాంటు, షర్టు వేసుకుని వుంది.

"గోపాలంగారు లేరా? ఏమీలేదు మా చాకలి బట్టలు ఇక్కడ పెట్టాడుట...." సగంలో ఆగింది ఆ అమ్మాయి.

రమేష్ దారికి అడ్డు తప్పుకున్నాడు. వచ్చింది జాంబవతా, కాదా అన్న అనుమానం పట్టుకుంది. ఈ అమ్మాయి చీర కట్టుకునే రకంగా లేకపోయినా, తను ఆ చీరని పాంట్ల మధ్య కనుక్కున్నాడు. కాబట్టి జాంబవతి అయివుండాలి అనుకుని ఏదో మాట్లాడాలి అన్నట్లు "మిరుజాం...." అని ఏదో అనబోయాడు. ఒకవేళ జాంబవతి ఆ అమ్మాయి మారు పేరు అయితే కొంప మునుగుతుందని అనుమానం వచ్చింది. దాంతో అసలే మొద్దు బారిన మెదడు నోటికి ఏమి అజ్ఞలు యివ్వకపోవడంతో ఆ నోరు "జాం....జాం ....జాం...." అంటూనే వుంది.

వస్తున్న నవ్వును ఆపుకుంటూ అంది ఆ అమ్మాయి. "అదుగోనండి అవే మా బట్టలు. తీసుకు వెడతాను." రమేష్ అనుమతికోసం అని ఒక్కక్షణం ఆగింది. అప్పటికి....జాం జపం ఆపి తలవూపాడు.

బట్టలు తీసుకోబోయి కెవ్వున కేక వేసింది జాంబవతి. రమేష్ అదిరి పడ్డాడు.

నిరసంగా కుర్చీలో కూలబడింది ఆ అమ్మాయి. రమేష్ ఏమిటి అని అడగకుండానే చెప్పింది. "నా చీరండీ! ఎంతో ముచ్చటపడి కొనుక్కున్నాను. కమల తెలుసా మీక్కు తెలీద్కా మా కొలీగ్ లెండి! తను బాగా అసూయపడింది....నేను అంత మంచి చీర కొనుక్కున్నందుకు. తీరా టైలర్‌కి ఫాలు కుట్టమని యిస్తే వాడు ఆయిల్ మరకలు చేశాడు. కొత్తచీర కట్టకుండా డ్రైవాష్‌కి యిస్తే వీడు యిప్పుడు తేసుకురాలేదు. ఇంకా పది రోజులకిగాని దొరకదు.ప్చ!" అని రమేషవంక చూసింది సానుభూతి ఆశిస్తున్నట్లు.



"దీప సుందరి"

చిత్రం : ఇ. గోపాలరావు, పొన్నెకల్లు

అవును. చాలా మంచి చీర అనబోయి నాలుక కరుచుకున్నాడు రమేష్.

"చూడండి! గోపాలంగారి దగ్గరనించి నేను అప్పుడప్పుడు పుస్తకాలు తీసుకు వెడుతూ వుంటాను. యిప్పుడు తీసుకు వెడితే మీకేమన్నా అభ్యంతరమా?"

"దానికేముంది! అయినా పుస్తకాలు ఏం వున్నట్లు లేవు" అన్నాడు రమేష పక్కనేవున్న అల్మారా వెతుకుతూ.

"ఆహా! అక్కడ వుండవండీ. సాధారణంగా ఆయన మంచం కింద పడేస్తారు. నేను చూస్తాను లేండి!" అంటూ మంచం వేపు కదలబోయింది.

రమేష్ ఊపిరి ఆగిపోయింది. గుండెలో ఫుట్‌బాల్ ఆడుతున్నట్లు ఫీల్ అయ్యాడు. ఒక్క గెంతులో అల్మారా నించి. ఆ అమ్మాయి పక్కగా దూసుకుని మంచం చేరుకున్నాడు. రమేష్ ప్రదర్శించిన 'హాప్ స్టెప్ అండ్ జంప్'ని చూసి ఆ అమ్మాయి నిర్ఘాంతపోయింది.

"ఎందుకండీ! నేను చూస్తాను!" అంటూ ఒక నవ్వు పారేసి. ఆ అమ్మాయికి చీర కనబడకుండా దుప్పటి ఎత్తి రెండు పుస్తకాలు తీసి యిచ్చాడు.

"రెండు తీసుకుంటాను!" అంది ఆ అమ్మాయి.

తల వూపాడు రమేష్. ఆ అమ్మాయి కన్నా ముందుగా చేరుకోవటానికి అంత గెంతు గెంతిన తనని తానే మెచ్చుకున్నాడు కాలు బెణికిందని బాధపడుతూ కూడా!

"చాలా థాంక్సండీ!" అంటూ వెళ్ళింది పుస్తకాలు, ప్లస్ బట్టలతో ఆ అమ్మాయి.

జాంబవతికి చీర కనబడలేదన్న తృప్తితో సిగరెట్ పీకకోసం వెతికాడు. కిందవున్న నీళ్ళలో నాని వుంది పీక. తన దురదృష్టాన్ని తిట్టుకుంటూ వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు.

విసురుగా తలుపు తోసుకుని వచ్చాడు గోపాలం. "ఇంకా ఏమిటి అట్లావున్నావు? రా ద్వారకాకి వెళ్ళి భోజనం చేద్దాం! అదిగో ద్వారకా! ఇవిగో నీ బట్టలు! తొందరగా తయారవ్వు!"

"ముందు ఒక సిగరెట్ పారెయ్యి! బుర్ర వేడెక్కి చస్తున్నాను" అన్నాడు రమేష్.

"నేను నిన్ను బయటకు లాగేందుకు ఒక ఉపాయం ఆలోచించాను అనిచెప్పాను కదా-ఇంకా నీకు ఎందుకీ ఆలోచనలు? నువ్వు ఏమిటా ఉపాయం, ఏమాకథ అని అడగకుండా రా!"

"అది కాదురా. ఇందాక మీ యింటాయన వచ్చాడు" అన్నాడు రమేష్ చెప్ప లేక చెప్తుతూ.

"వస్తే! ఆయనగురించి నీకు చెప్పానా? మంచి కబాడీ ఆటగాడు. కాంపోజిట్ మద్రాస్ స్టేటుకి ఆడేవాడు. చాలా మంచి వాడు కాని,చాలా చాదస్తుడేలే! ఎంత చాదస్తుడంటే కబాడీని చెడుగుడు అని ఎవరయినా అంటే రమ్ము తాగిన చింపాంజి లాగా డాన్సు చేస్తాడు."

"నిజమేన్నమాట? అందుకే మనిద్దరి మీద కబాడి ఆడతానన్నాడు. యిందాక" రమేష్ అసలు సంగతి అంతా చెప్పాడు.

ఈ విషయం విన్న గోపాలం రియాక్షన్ చాలా తీవ్రంగా వుంటుందని. వూహించటంలో రమేష్ పొరపాటు పడలెదు. తనని మామూలుగా తిట్టే ఇరవై రెండు తిట్లు పూర్తిగా తిట్టునా లేదా అని ఆలోచిస్తున్న రమేష్. గోపాలం తనని దాదాపుగా ముద్దు పెట్టుకోవటం చూసి ఆశ్చర్యపోయాడు.

"నిజంగా నీదిరా స్నేహమంటే! నేను


నీకు సహాయం చెయ్యడం యింకా ప్రారంభించలేదు-నువ్వు అప్పుడే నాకు బ్రహ్మాండమయిన ఉపకారంచేశావు. నిన్న మొన్నటి వరకు జాంబవతిని పెళ్ళిచేసుకోమని షంటేవాడు. ఇప్పుడు ఆయన మేనకోడలిని పెళ్ళిచేసుకోమని షంటుతున్నాడు. మనిషి ఎంత మంచివాడంటే ఆయన చెప్పింది కాదనలేం! ఎంత చాదస్తుడంటే అయిదు నిముషాలకన్నా ఎక్కువ మాట్లాడలేం! ఇప్పుడు చూడు నీదయవల్ల ఆ మేనకోడలికి నాకు మధ్య అడ్డుగోడలు."

రమేష్ హాయిగా వూపిరి పీల్చాడు.

రమేష్‌ని బలవంతంగా లేపి అన్నాడు గోపాలం "విచారించటం మాను. నేను పన్నిన వుపాయంతో నీ బాధలు, సమస్యలు. కష్టాలు. గ్రటా అన్నీ పటాపంచలు.... పంచలు.. ఆ పంచలు అంటే గుర్తుకు వస్తున్నది. జాంబవతికి, ఆ చీర యిచ్చావా? ఇందాక ఎదురు పడి చెప్పింది. బట్టలు పుస్తకాలు తీసుకున్నానని, అవును గాని నీకు యింత బుర్ర లేదేమిట్రా? ఆ అమ్మాయిని జాం కావాలి అని అడిగావా తను చెప్పిందిలే. మీ ఫ్రెండ్ జాం కోసం తెగ కలవరిస్తున్నాడని!"

గోపాలం దగ్గర చీర పోయింది అన్న విచారాన్ని ప్రకటించలేదేం అన్న ఆశ్చర్యాన్ని. జాంబవతి పేరు జాంబవతేనా కాదా అన్న సందేహాన్ని పక్కనపెట్టి అన్నాడు రమేశ్ ఇది చాలా పెద్ద కథ. చెప్పటానికి యిప్పుడు ఓపికలేదు!"


రమేష్ గోపాలం ప్రాణ స్నేహితు అని, రమేష నాన్న రంగనాధరావు అని, ప్రియురాలు భానుమతి అని తెలుస్తూనే వుంది కదా? ఇకపోతే హనుమంతం రంగనాధరావు సెక్రటరి అనికూడా తెలుస్తూనే వుంది. కాని సెక్రటరీని పెట్టుకోగల గొప్పవాడా రంగనాధరావు అన్న సందేహం పాఠకులకు రావచ్చు. ఆ సందేహం తీరిస్తే



హనుమంతానికి రమేష్‌కివున్న ప్రచ్ఛన్న విరోధంకూడా బయటపడుతుంది కాబట్టి రమేష్ గోపాలం భోజనంచేసి వచ్చేలోగా జవాబు చదువుదాం:

హనుమంతం రంగనాధరావు అన్న కొడుకు. రంగనాధరావు దత్తతకు రావటంతో ఆస్తిబాగానేవుంది. వచ్చినఆస్తికన్నా సంపాదించిన ఆస్తే ఎక్కువ. (మొదట్లో గుర్రపు పందాలలో బాగా సంపాదించాడు, తనుగాని తన వారసులుగానీ మళ్ళీ గుర్రపు పందాలు ఆడితే వచ్చినది వచ్చినట్లే పోతుంది అని రంగనాధరావు నమ్మకం. అందుకనే తను గుర్రపు పందాలు ఆడుతున్నానని తండ్రికి తెలియకూడదని రమేష్ విశ్వప్రయత్నాలు చెయ్యటం.) దానికితోడు కంట్రాక్టులు చెయ్యటం. రాజకీయాల్లో ప్రవేశం వుండటంతో ఆయనకు పలుకుబడి బాగానే వుంది. తన అన్న కొడుకు చదువుకుని వూరికే వుండటంతో వుద్యోగం యిప్పిస్తానని రాజధానికి రమ్మనమన్నాడు రంగనాధరావు. "పాలకోవా యిస్తానురా" అని పిలిచిన వాళ్ళ దగ్గర పాలిచ్చే ఆవును, పాలు తాగే గిన్నెను సంపాదించగల ప్రజ్ఞ కలవాడు హనుమంతం. ఆ ప్రజ్ఞ అన్నాళ్ళు నివురుకప్పివ నిప్పులా వుండిపోయింది. హైదరాబాద్ గాలికి ఆ నివురు ఎగిరిపోగా- "బాబాయి: నేను పరాయి వాళ్ళదగ్గర పని చెయ్యటం ఎందుకు? నీకు చాలా పనులు వున్నాయి. నువ్వు ఒక్కడివే అవి చూసుకోవటం కష్టం. నీ దగ్గరే వుంటాను. నీ పనులు చూస్తాను. అందరితో నీ 'సెక్రటరి' అని చెప్పుకో. నీకూ గొప్పగా వుంటుంది" అన్నాడు. రంగనాధరావుకు ముఖ్యంగా ఆ చివరి పాయింటు నచ్చింది. (తన అన్నవాడు యింకోడు లేకపోతే కష్టం అనీ, రమేష్‌ని యింజనీరు చెయ్యక పోవటం పొరపాటు అని గ్రహించాడు ఆయన.)

అసలు యిట్లా అనటంలో హనుమంతం అభిప్రాయం- పరాయివాళ్ళ దగ్గరయితే వాళ్ళు యిచ్చినంత జీతం వస్తుంది-మరి యిక్కడో? తను అడిగినంత. కాజేయగలిగినంత. రంగనాధరావుకి. బయట ప్రపంచానికి మధ్య తను నిలబడితే తను కాజేయగలిగే మొత్తానికి అంతు వుండదు. అంతకన్నా మంచి అవకాశం రాదు అని గ్రహించి సెక్రటరీగా మారి మొదటి ఆరునెలలు కుక్కలా. ఎద్దులా. గాడిదలా కష్టపడి రంగనాధరావు మనసులో. చెవిలో చెరోకాస్త స్థలాన్ని సంపాదించాడు. రంగనాధరావును యింకా మంచి చేసుకోవాలి అన్న ప్రయత్నంలోనే రమేష్‌తో విరోధం తెచ్చుకున్నాడు. (రమేష్ అంటే హనుమంతానికి అసూయ లేకపోలేదు.) రమేష్ జీతంకాక నెలకుఇంత అని తీసుకోటంఅలవాటుగావుండేది. చిన్నవాడు నా తమ్ముడు చెడిపోతున్నాడు అని, అతనికి నెలనెలా పైసలు యివ్వకూడదని, అదని, యిదని అతని జీతంలోనే ఎంతో దాచుకోవచ్చనీ, రమేష్ దుబారా చేస్తున్నాడని, రంగనాధరావు చెవిలో తను కట్టుకున్న ఇంట్లో కూర్చుని బోధించేవాడు. దాని ఫలితంగా గుర్రపు పందాలకు డబ్బులు దొరకక రమేష్ అల్లల్లాడిపోసాగాడు.




సీలేరుకి కంట్రాక్టు పనులకోసం వెళ్ళిన రంగనాధరావు జ్యోతిష్య రత్న మరో ఆరు జ్యోతిష్యడాష్‌ల పురుషోత్తమరావు అదే సమయానికి బస్సులో వెళ్ళిపోతున్నాడని తెలిసి హనుమంతాన్ని బస్టాండుకి పంపాడు. తండ్రి అంటే ఎంతో గౌరవం వున్నవాడై, కూతురి అందచందాలు విన్నవాడై బస్సు కదలబోయేముందు బస్టాండు చేరిన హనుమంతం పురుషోత్తమరావుకి- ఆహ్వానం అందిచటం. పురుషోత్తమరావు దానికి అంగీకరిస్తూ వుత్తరం రాయటం మనకు తెలుసు కాబట్టి ఫ్లాష్ బాక్‌కి సెలవు యిచ్చి భోజనంనించితిరిగివచ్చినగోపాలం. రమేష్‌ల సంభాషణ విందాం.

"....అర్థం అయ్యిందా? అదీ ప్లాను: నువ్వు కంగారుపడకుండా. తప్పులుచెయ్యకుండా వుంటే నీకు హనుమంతం గొడవ తప్పటంతోపాటు ఎన్నో లాభాలు అన్నట్లు మనం యిక్కడ ఎక్కువసేపు ఉండకూడదు. ఏ నిముషానైనా ముసలి ఆయన రావచ్చు. నువ్వు ఈ రాత్రికే మీ యింటికి పో: ఇదుగో ఈ వుత్తరం ఎక్కడినుంచి తీసుకువచ్చావో అక్కడే పెట్టు." అన్నాడు గోపాలం రంగనాధరావుకి పురుషోత్తమరావు రాసిన వుత్తరం తిరిగి రమేష్‌కి యిస్తూ:

"ఈ వుత్తరం చింపేస్తే పోతుంది కదా?" అన్నాడు రమేష్,

"ఛస్: నీకు తెలియదు. దాని అవసరం ఎప్పటికయినా వస్తాంది. ఇవిగో అయిదు వందలు ఇదిగో నువ్వు కొనాల్సిన వస్తువుల బాబితా. ఏదీ మరిచిపోకు."

మరో అయిదు నిముషాల తరువాత గోపాలం కాజీపేటకి వెళ్ళే టాక్సీలో వున్నాడు. గోపాలం సృష్టించిన ప్లాన్‌మీద ఎంత నమ్మకమున్నా ఏదో తెలియని భయం రమేష్‌ని నెర్వస్‌గా చేయసాగింది.

టాక్సీ కదలబోతుండగా గోపాలం తల బయటకి పెట్టి అరిచాడు "ఒరేయ్: మరిచిపోయాను. భానుమతి రేపు తన పుట్టినరోజని గుర్తు చేయమంది" టాక్సీ కదిలిపోయింది.

ఆ ప్రాంతాల జనసంచారం లేదు. ఉండి వుంటే గోపాలం చెప్పిన ఆ మాటలు విన్న వెంటనే రమేష్ కెవ్వున కేక వెయ్యటాన్ని, ఆ వెను వెంటనే టాక్సీ బుర్రున కదలటాన్ని చూసి హత్యకు తక్కువది జరిగిందంటే నమ్మక పోలీసులకు ఫోన్ చేసే వాళ్ళు.

రమేష్ రెండు నిముషాలు అట్లా నిలబడిపోయాడు. ఇంకో రెండు నిముషాలు నిలబడేవాడు కాని, బెణికిన కాలు పర్మిషన్ ఇవ్వలేదు. నెమ్మదిగా నడుస్తూ, ఆలోచిస్తూ ఇంట్లోకి వచ్చాడు. ఛీ: ఎంత మతిమరుపు తనం: భాను తనకి ఎంతలేదన్నా ఒక నాలుగు సార్లు చెప్పి వుంటుంది. తప్పకుండా చాలా మంచి ప్రెజంటేషన్ యిస్తానన్నాడు తను. ఈ గుర్రపు పందాలలో పడి ఆ విషయం మరిచిపోయాడు. రేపు పొద్దున షాపింగ్ చెయ్యటానికి కూడా వీలులేదు." చిరాకుగా సిగరెట్ తీసి నోట్లో పెట్టాడు. అదే చిరాకుతో గోపాలం తనని తిట్టే యిరవై రెండు తిట్లు తిట్టుకోవటంతో సిగరెట్ పెదిమల మధ్యనించి జారి కిందపడి మంచం కిందకు వెళ్ళింది. రమేష్ ఇరవై మూడో తిట్టు తిట్టుకుంటూ,

మంచం కిందవున్న సిగరెట్ తియ్యటానికి వంగాడు.

వంగక మునుపు నుంచున్నప్పుడు, వంగిన తర్వాత నుంచున్నప్పుడు అన్న రమేష్ పోజులు చూసిన వారు రెండు తేడాలు కనిపెట్టగలరు. నిరాశ వున్న మొహంలోకి. కాలు బెణికింది గాని లేక పోతే ఎగిరి గెంతులు వెయ్యగలను తెలుసా అన్న భావప్రకటన, ఖాళీగావున్న చేతుల్లోకి ఒక చీర రావటం, ఇవీ ఆ తేడాలు.

రమేష్ మనసులో ఏం వుందో తెలియకపోయినా. వూహించటం ఏమంత కష్టంకాదు - ఎందుకంటే రమేష్ చీరను విక్రీ చెయ్యటానికి సరంజామా రెడీ చేస్తున్నాడు.

## 2

పన్నెండోసారి వాచి చూసుకుని సరిగ్గా అన్నోసారే తిట్టుకున్నాడు గోపాలం ఎంతకీ అవని ఆరు గంటలను. గోదావరి ఆరు గంటలకు వస్తుందిట. దాదాపు గంట క్రితం వచ్చాడు గోపాలం కాజీపేట స్టేషన్‌కి.

కాఫీ స్టాలుకి నడిచి కాఫీ తీసుకున్నాడు. కాఫీ తాగుతూ ఆలోచించసాగాడు. అతని ద్విపాత్రాభినయం ఇంకా కొద్దిసేపటిలో ప్రారంభమవుతుంది. ఇప్పుడు వస్తున్న పురుషోత్తమరావుని హనుమంతంలా నటించి బురిడీ కొట్టించడం గురించి కాదు గోపాలం ఆలోచిస్తున్నది. గోపాలం లెక్క ప్రకారం అది చాలా సులభమయిన పని- ఎందుకంటే పురుషోత్తమరావు హనుమంతాన్ని మూడు వారాల క్రితం దాదాపు రెండు మూడు నిముషాలు మాత్రమే చూశాడు. ఇకపోతే ఆ తరువాత గోపాలం వెయ్యబోయే మారువేషం సక్సెస్ కావాలంటే బోలెడంత లక్కు కావాలి. తాము ఎంతో పర్పస్‌తో కొంతసరదాగా చేస్తున్న ఈ పని తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందా అన్నది గోపాలాన్ని కంగారు పెడుతున్నది.

గోపాలంచేత పదమూడోసారి తిట్టించుకోవటం యిష్టంలేని ఆరుగంటలు ఆరు గంటలయిపోయింది. ఆరుగంటల ముప్పై సెకనులకల్లా గోదావరి వచ్చింది.

గోపాలం హడావుడిగా కనపడ్డ ట్రీబెయిర్ దగ్గరకు వెళ్ళాడు. బోగీకి అంటించి వున్న లిస్టు చదివాడు. అదృష్టం కొద్దీ అందులోనే వున్నారు. మిస్ రాధ, మిస్టర్ పురుషోత్తమరావులు ముప్పై. ముప్పై ఒకటి బెర్తులలో. అదృష్టం బాగానే వుందే అనుకున్నాడు గోపాలం. తను నక్కతోక తొక్కి వచ్చిన గుర్తు లేదుగాని టాక్సీలో ఎక్కేముందు రమేష్ కాలు తొక్కినట్టున్నాడు.

"ఆ....యా....యా....యా....వ్" అని ఆవలించుకుంటూ దిగాడు లావుపాటి కండక్టరు. ఆవులింత విని అదిరిపోయిన గోపాలం అరడుగు వెనక్కి జంపుచెయ్యబట్టి సరిపోయిందికాని. లేకపోతే గోపాలం కాలు కండక్టరు తొక్కేవాడే!


'ఆ.. యా.. యా.. యా.. వ్' అని తను కూడా ఆవలించి "బండి లేటయిపోయిందండి. ఈ లెక్కన మనం సికింద్రాబాద్ ఎప్పుడు చేర్తాం?" అన్నాడు గోపాలం.

"తొమ్మిదవ్వొచ్చు!" అన్నాడు కండక్టరు.

"మీ దగ్గర వంద రూపాయల చిల్లర వుందాండి? చిల్లర దొరకక చాలా అవస్థ పడుతున్నాను. కాఫీ తాగాలన్నా వీలు లేకుండా వుంది. ఎంతవుంటే అంత ఇవ్వండి. మిగతాది సికింద్రాబాద్‌లో ఇవ్వొచ్చులెండి. నేనూ ఈ బోగీలోనేకదా వున్నాను!" అన్నాడు గోపాలం.

చిల్లర లేదన్నాడు కండక్టరు. 'అమ్మయ్య! మనం ఆ పెట్టెలోనే వున్నాం అన్న అభిప్రాయం క్రియేట్ చేశాం పెట్టెలో కనబడ్డా మీ బెర్తు నెంబరెంత అని అడగడు' అనుకున్నాడు వంద రూపాయల నోటు జేబులో లేని గోపాలం.

కంపార్టుమెంట్ లోకి నడిచాడు - బెర్తు నెంబర్లు చూసుకుంటూ.



జ్యోతిచక్ర

ఫొటో : వి. ఎస్. మోరపాకుల, మద్దిపాడు

ముప్పైలో ఒకాయన కూర్చుని ఆస్ట్రలాజికల్ మాగజైన్ చదువుతున్నాడు. పక్క బెర్తులో పడుకున్నది ఒక చిన్నది అవటంతో ఆయనే పురుషోత్తమరావు అయి వుండాలి అనుకున్నాడు గోపాలం. మొక్కజొన్న పొత్తు పీచులా వున్న ఆయన జుట్టును చూసి తన తల ఎంత తెల్లగా చేసుకోవాలో కదా అనుకున్నాడు గోపాలం.

ఆయన పక్కన కూర్చుని "నమస్కారమండి!" అన్నాడు.

ఆయన తల ఎత్తి చూశాడు. చూపులో

ఎవరు అన్న ప్రశ్న, ఎందుకు అన్న చిరాకు వున్నాయి

"నన్ను గుర్తుపట్టలేదేమో! నా పేరు గో....హనుమంతం....హనుమంతం."

"అయితే?"

"నేను రంగనాధరావుగారి సెక్రటరీని. నేను మిమ్మల్ని సీలేరులో కలుసుకున్నాను రంగనా...."

"సీలేరా? అంటే?"

గోపాలంకి చిన్న అనుమానం పుట్టింది. "మీరు పురుషోత్తమరావుగారు కదూ?" అడిగాడు.

ముసలాయన ఒక్క క్షణం మాట్లాడ లేదు. పుస్తకం మొదటి పేజీ తిసి దాని మీద రాసివున్న పేరు చదివి "ఔను. నా పేరు పురుషోత్తమ రావే!" అన్నాడు. అని "సీలేరు అంటే ఏదో వుంది. గుర్తుకు రావడం లేదు. ఏమిటది?"

వున్నట్లుండి గోపాలంకి గుర్తు వచ్చింది-రమేష్ తనతో పురుషోత్తమ రావుకి మామిడికాయంత మతిమరుపుతనం వుందని చెప్పటం.

"సీలేరు అనగా అచట హైడ్రో ఎలక్ట్రిసిటీ ప్రాజెక్టు కలదు. ఎగువ సీలేరు, దిగువ సీలేరు అని సీలేళ్ళలో రెండు రకాలు" అన్నాడు గోపాలం వెటకారంగా. సెలయేరు బహువచనంలో సెలయేళ్ళు అయితే సీలేరు సీలేళ్ళు అవదా అన్నట్లు.

"అవునూ సీలేళ్ళకి నేను వెళ్ళానుకదా" అన్నాడు పురుషోత్తమరావు.

"అమ్మయ్య! దారిలోకి వస్తున్నావురా బాబూ!" అనుకుని "అవునండి" అన్నాడు. గోపాలం

"అవునూ! నేను సీలేళ్ళకి ఎందుకు వెళ్ళాను?" అన్నాడు బుర్ర గోక్కుంటూ పురుషోత్తముడు.

"ఇదుగో! నా ప్రాణాలు ఇట్టే కొరుక్కు తింటానికి" అనుకున్నాడు గోపాలం. "ఏమోనండి నాకేం తెలుసు?" అన్నాడు పైకి అమాయకంగా.

"ఆ! గుర్తుకు వచ్చిందోయి! అక్కడ రాము అని నా స్నేహితుడు వున్నాడు ఎక్కడా? సీలేళ్ళలో....వాడిని కలవటానికి వెళ్ళాను. అన్నట్లు నీకు రాము తెలుసా?"

"నాకు తెలియదండి."

"పొడుగ్గా, సన్నగా వుంటాడు."

"నాకు తెలియదండి!"

".... తెల్లగా వుంటాడు. బట్టతల. నీకు పరిచయం వుండే వుంటుంది. ఖద్దరు బట్టలుతప్ప మిగతావి...."

"నాకు తెలియదండి! నాకు తెలియదండి!" తెలియకుండా గోపాలం గొంతులో ఏడుపు చోటు చేసుకుంది. "నాకు సీలేరులో ఎవరూ తెలియరండి!"

"చుట్టలేకుండా వాడిని చూడటం అసాధ్యం కాదుటోయి! వాడి యిల్లు చూశావా? బంగారంలాంటి తోట. తోటలో మామిడి చెట్లేమిటి, జామ...."

"లేదండి! నాకు పరిచయం లేదండి. అసలు సీలేరులో ఆ పేరుగలాయన వున్నట్లు నాకు తెలియనే తెలియదు" అన్నాడు గోపాలం. బాబ్బాబూ నీ కాళ్ళు పట్టుకుంటాను. నా మాట వినిపించుకో అన్న ధోరణిలో.


"మరి యిందాకటి నుండి చెప్పవేం?" అన్నాడు ఆయన విద్విలాసంగా నవ్వుతూ.

గోపాలం పాఠం మళ్ళీ మొదలు పెట్టాడు. "రంగనాధరావుగారు నన్ను ..."

"రంగనాధరావు ఎవరు? ఓ! చెప్పావు కదా? నీ సెక్రటరీ అనీ" అన్నాడు పురుషోత్తమరావు మళ్ళీ పుస్తకం పేజీలు తిప్పుతూ.

"కాదండి. నేను ఆయనఅంటే రంగనాధరావుగారి సెక్రటరీని...." గోపాలం మాటలు మధ్యలో ఆగిపోయాయి. తన కంగారులో రాధ ఎప్పుడు లేచిందో గోపాలం గమనించలేదు. యధాలాపంగా ఆమెవంక చూసిన గోపాలంకి మాట పోవటంతో పాటు ప్రపంచంలో అందవికారులు ఎందు కుంటారో అర్ధమయ్యింది. బ్రహ్మదేవుడు తన డ్యూటిలో చివరిక్షణం వరకూ ఇలాంటి అందగత్తెలను సృష్టించటంలో మునిగిపోయి, చివరిలో గబగబా మిగతా వాళ్ళను తయారుచెయ్యటంతో అంద వికారులు పుడతారు అన్న నిశ్చయానికి వచ్చాడు. ఆ రైలు ఎక్కటమే తన అదృష్టం అనుకున్నాడు. కాని యింకో రెండు గంటలలో వీళ్ళకి తను బలవంతంగా వీడ్కోలు యివ్వబోతున్నానన్న విషయం గుర్తుకు వచ్చి కలలు కనడం మాని పురుషోత్తమరావు వంక చూశాడు. పురుషోత్తముడు సీరియస్‌గా చదువుతున్నాడు.

గోపాలం గొంతు సవరించుకున్నాడు. "క్షమించాలి! మీరు రాధగారు అనుకుంటాను. నేను హనుమంతాన్ని. రంగనాధరావుగారి సెక్రటరీని. రంగనాధరావుగారికి నిన్న అర్జెంటుగా పని తగిలి ఆయన కొడుకుతో సహా ఢిల్లీ వెళ్ళిపోయారు. అందుకనే నేను మిమ్మల్ని కలిసి ఆ మాట చెప్పటానికి వచ్చాను. రంగనాధరావుగారు చాలా యిదయిపోతున్నారు. తిరా మిమ్మల్ని ఆహ్వానించి, మీరు వచ్చేటప్పటికి తాము వెళ్ళిపోయామని. ఆయన ఒక విషయం చెప్పారు. ఢిల్లీలో పని ఒక వారం రోజులలో అయిపోతుందిట. అవగానే డైరెక్టుగా బొంబాయి వచ్చి. మిమ్మల్ని కలుస్తామన్నారు. ఆ తరువాత అందరూ కలిసి హైదరాబాద్ రావచ్చు అని కూడా చెప్పారు.



రాధ తల వూపింది. గోపాలం చెప్పిన మాటలు ఆమె నమ్మిందో, లేదో చెప్పటం కష్టం. కాని మొహంలో కొంచెం చిరాకు చోటు చేసుకున్నది. దాన్ని ఇంకా పెరగ నివ్వకుండా అంది "ఫర్వాలేదులేండి! మనం అనుకోకుండా ఎన్నో జరుగుతుంటాయి."

"ఇవాళ పదింటికి బొంబాయికి స్పెషల్ ట్రైన్ వుంది. అందులో వెడితే బాగుంటుంది. ఏమంటారు?"

* * *

రంగనాధరావు బంగ్లాలో అంతకు గంట క్రితం—

హనుమంతం వులిక్కిపడ్డాడు. సాధారణంగా తొమ్మిదింటికి గాని నిద్రలేవని రమేష్ ఆరింటికే లేస్తే ఎవరన్నా వులిక్కిపడతారు. అందులో ఆ వేళ వస్తున్న అతిధుల రాక రమేష్‌కి అంత ఇష్టం లేదని హనుమంతం పసికట్టాడు. అటువంటప్పుడు ఆ అతిధులకు స్వాగతం యిస్తున్నట్లు అంత త్వరగా ఎందుకు లేచాడా అన్నది హనుమంతానికి అర్థంకాలేదు.

రమేష్ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. "కరక్టుగా తొమ్మిదిన్నరకు అక్కడకు రా!.. నిన్న చెప్పినట్లు నేను నిన్ను కలవకపోవచ్చు. కాబట్టి నువ్వేరా! అది తొమ్మిదికి. ఇప్పుడే కనుక్కున్నాను. బై! బై! మళ్ళీ కలుద్దాం."

హనుమంతం ఈ సంభాషణని అంతగా పట్టించుకోలేదు. రమేష్ మెదడు మీద హనుమంతానికి చాలా చిన్నచూపు వుంది. ఈ సంభాషణ తనని వెళ్ళగొట్టే ప్రయత్నంలో ఒక భాగం అని తెలిస్తే హనుమంతం తప్పక ఇంకోసారి వులిక్కిపడేవాడు.

హనుమంతం ఫోన్ చెయ్యటం ప్రారంభించాడు.

"ఎక్కడకి?" అడిగాడు రమేష్ సిగరెట్ పాకెట్ తీస్తూ.

"రైల్వే ఎంక్వయిరీకి. గోదావరి ఎన్నింటికో కనుక్కోవాలి తొమ్మిదింటికి వస్తుందని తెలిసింది."

"నాన్నగారు వస్తున్నారా?" అమాయకంగా అన్నాడు రమేష్. "అయినా జీపు తీసుకువెళ్ళారు కదా?"

"కాదు. పురుషోత్తమరావు వస్తున్నారు" అన్నాడు హనుమంతంఅదోలా నవ్వుతూ. "వెంట మిస్ రాధ కూడా వస్తున్నది."




"అయితే స్టేషన్‌కి కారు తీసుకువెళ్ళు" అన్నాడు రమేష్.

"బాబాయి వచ్చేటప్పటికి కూడా అదే టైమవుతుంది దాదాపుగా" అన్నాడు హనుమంతం లోపలికి వెడుతూ.

ఎనిమిది ఇరవైకి మళ్ళీ ఎంక్వయిరీకి ఫోన్ చేద్దామని వచ్చాడు హనుమంతం. రమేష్ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు.

"ఏమిటి? నిన్న నీ దగ్గరనుంచి నువ్వు ఇంకా తెరిచి అయినా చూడని మాగజైన్ తీసుకురావడంవల్ల నీ మనసు ఎంతోబాధ పడుతోందా? ఆ వుసురునాకు తగలకపోదా? ఎందుకీ కోపాలు ప్లస్ శాపాలు!" రమేష్ చేతిలో వున్న పత్రికతో విసురుకుంటూ గట్టిగా అరుస్తున్నాడు. రెండో పక్క ఎవరూలేరు కాబట్టి, సరిపోయింది.

.................

"అదా నీ బాధ? నవలశ్రీ రాస్తున్న సీరియల్ తరువాయి భాగం ఏమయ్యిందో తెలియక నీ హృదయం ఆందోళన పడుతున్నదా? ఆ సీరియల్ ఆ పత్రికకి గత నాలున్నర ఏళ్ళగా హైలైట్‌గా భావించిన నువ్వు, ఏమవుతుందా అని వుర్రూతలూగిన నువ్వు. చదువుతూ ఆనంద సాగరంలో మునిగి తేలిన నువ్వు అట్లా బాధ పడటం సహజమేలే!"

.................

"ఏమిటి? నువ్వు ఎట్లా వూగావో, ఎటా మునిగావో నాకు ఎట్లా తెలిసింది అంటావా? అట్లాగని నువ్వు రాసిన వుత్తరం యిందులో పడిందిలే!"

.................

"ఆ బాధతో నిన్నటి నుంచి ఎవ్వరిన్నీ చూడకుండా మంచమ్మీద నుంచి లేవకుండా పడుకున్నావా? పత్రిక వచ్చిన రోజునే తరువాతి కథ తెలుసుకోలేకపోయిన నీ జన్మ వృథా అంటావా? అంత వైరాగ్యం ఎందుకు? ఇక్కడ నేను వున్నానుగా!"

హనుమంతం టైము చూసుకున్నాడు— ఎనిమిదిన్నర. రమేష్ భుజంమీద చెయ్యి వేసి ఏదో చెప్పబోయాడు.

"హనుమంతం! ఇది జీవన మరణ సమస్య. తన అభిమాన సీరియల్ ఏమయ్యిందో తెలియక ఒక అమాయక పాఠకుడు విల విల లాడుతున్నాడు. అతనికి యిప్పుడు నేను ఫోన ద్వారా కథ వినిపించి అతనిని చైతన్యవంతుడిగా చేస్తాను. ఇటువంటప్పుడు మమ్మల్ని డిస్టర్బు చెయ్యవద్దు" అన్నాడు రమేష్ తన భుజం మీద చెయ్యివేసిన హనుమంతంతో. అని తన భుజంమీదనుంచి అతని చెయ్యి తీసేశాడు.

హనుమంతం తల పట్టుకుని సోఫాలో కూలబడ్డాడు.

రమేష్ అటు పక్క నించి ఎవరో మాట్లాడుతున్నట్లే నటిస్తూ "చాలా రోజుల



దీపావళి చిత్రం జి.వి. రమణ. సూర్యాపేట

తరువాత కలుసుకున్న, అన్నా చెల్లెళ్ళయిన హిమాలయ్, హిమత ఒకరి చేతుల్లో ఒకరు వాలిపోయి వుండగా కిటికీ లోంచి చూసి, అపార్థంచుకున్న హిమాలయ్ ప్రియతమ శ్రీనీల ఏం చేసింది అంటావా? ఇంత కాలం తన అల్లుడు నిష్కపట మనస్కుడని అమదానంద కందళిత హృదయార విందుడైన భూషణరాయుడు యిప్పుడు ఏం...."

.... .... ....

"ఏమిటి? 'అమదానంద........' అర్థం కావాలా? ఆముదం. ఆనందం, కందం, హృదయం. అ ర వి ం ద ం, వీటి అర్థం తెలుసుకదూ? అంతేమరి!"

హనుమంతం టైము చూసుకున్నాడు- ఎనిమిదీ నలభై. దాదాపుగా లాక్కున్నట్లు రిసీవర్ పట్టుకున్నాడు.

"ఏమిటి?" అన్నాడు రమేష్.

"ఒక్క నిముషంలో అయిపోతుంది నా పని!"

"ఆగు గురూ! ఒక్క నిముషం తరువాత వినిపిస్తా కథను. అంతవరకూ ఫోన్ దగ్గరే కూర్చుని "అమదానంద...." పది సార్లు ఇంపోజిషన్ రాయి" అన్నాడు రమేష్ ఫోన్‌లో. అని ఫోన్ హనుమంతానికి యివ్వకుండా తనే ఎంక్వయిరీకి ఫోన్ చేశాడు. గోదావరి ఎన్నింటికి అని అడిగి అవతలనించి తొమ్మిది అంటున్నా "ప్రది అయిదా?" అని ఫోన్ పెట్టి హనుమంతం వంక చూసి "పది అయిదుట" అన్నాడు.

రమేష్ వెంటనే కొన్ని నంబర్లు తిప్పి "సువ్వేనా? ఇంపోజిషన్ రాశావా? ఇందాక ఏం చెప్పాను? 'అమదానంద..' అర్థంకాదూ? ఇక కాచుకో! కథ విను. బాష్పాకులిత నేత్రాలతో శయ్యడిగ్గిన రాణి మాలినీదేవి వడి వడిగా.." అంటూ అరవ సాగాడు.

హనుమంతం టైం చూసుకుని లోపలికి వెళ్ళాడు.

హనుమంతం అట్లా లోపలికి వెళ్ళిన మరుక్షణమే రమేష్ ఫోన్ పెట్టేశాడు. "ఆపరేషన్ నంబర్ వన్ అయిపోయింది- హనుమంతం పది గంటల వరకు స్టేషన్‌కి వెళ్లాలని అనుకోడు" అని అనుకున్నాడు.

ఇంకో అరగంట తరువాత హనుమంతం హాలులోకి వచ్చేటప్పటికి రమేష్ "హమ్ తుమ్ ఏక్ కమరేమే......." అని పాట పాడుతున్నాడు.

"కారు కీస్ నీ దగ్గర వున్నాయి కదూ!" అన్నాడు హనుమంతం.

"ఇందాక సామాన్ల గదిలో పెట్టాను. తలుపు తెరిచి కుడి పక్కగా నాలుగు అడుగులు వేసి ఎదురుగావున్న టేబులుమీదకి ఎడమచేతిని.......ఎందుకులే? నేనే వచ్చి యిస్తాను. రా!" అన్నాడు రమేష్ లేచి సామాన్ల గదివేపు నడుస్తూ! హనుమంతం రమేష్ వెనకాలే నడిచాడు.

"అవును. తాళాలు ఆ గదిలో ఎందుకు పెట్టావు?" అన్నాడు హనుమంతం.

"అవును. 'హమ్ తుమ్ ఏక్ కమరేమే....' పాట ఎందులోది?" అడిగాడు రమేష్.

హనుమంతం తల బాదుకున్నాడు.

సామాన్ల గది తలుపు దగ్గర రమేష్ ఆగిపోయాడు. హనుమంతం తలుపు తీసుకుని లోపలికి వెళ్ళాడు. రమేష్ టేబులు చూపించాడు.

గదిలో నానా రకాల పాత సామాన్లు వున్నాయి. కిటికీలు లేని ఆ గదిలో చీకటి మాత్రంవుంది. హనుమంతం టేబులు దగ్గరకు వెళ్ళాడు. తాళం చేతులు లేవు ఆ మాటే చెప్పాడు.

"మర్చిపోయాను. నా జేబులోనే వున్నాయి!" అంటూ మెరుపులా జేబు లోంచి తాళం చేతుల గుత్తి తీసి కావాలని హనుమంతంపక్కగా పడేటట్లు విసిరాడు. అవి పాత పందిరి మంచం కిందకు చేరాయి.

"సారీ బ్రదర్!" అన్నాడు రమేష్.

హనుమంతం తన తెల్లపాంటు, చొక్కావేపు ఒక్కసారిచూసి నిట్టూర్చి మంచం కిందకు దూరాడు. బూజులో దుమ్ములో కష్టపడి సాధించి బయటకు వచ్చాడు.

రమేష్ తలుపు దగ్గర లేకపోవటంతో, తలుపులు దగ్గరగా వేసి వుండటంతో, హనుమంతానికి రెండు విషయాలు తెలిసిపోయాయి. ఒకటి .. రమేష్ బయట గడియ పెట్టి వుంటాడని, రెండు – రమేష్ తొందరగా నిద్రలేవడానికి, యింట్లో పనివాడు వెంకయ్య వుండకుండా వాడిని బయటకు పంపడానికి. ఇందాకటి నుంచి రమేష్ ప్రవర్తిస్తున్న తీరుకి. ఏదో సంబంధం, వాటి వెనక ఏదో ప్లానూ వున్నాయని.

బయట కారు స్టార్టు అయిన శబ్దం వినబడింది. హనుమంతం చేతిలోని తాళాల గుత్తి వంక చూశాడు. అది పాత తాళాల గుత్తి. కారు తాళంచెవి కాదుకదా సైకిలు తాళం చెవికూడా లేదు. ఆశ లేకపోయినా తలుపులు తోసి చూశాడు. ఒక్క మిల్లీమీటరు కూడా కదలలేదు. గదిలో చాలా ఉక్కగా వుండటంతో చొక్కా విప్పాడు. బూజు పట్టిన కుర్చీలో (హనుమంతం కుర్చీకి మూడే కాళ్ళు) జాగ్రత్తగా

కూర్చున్నాడు. చేతులలో తల పెట్టుకుని ఆలోచించసాగాడు.

* * *

అంతకు అరగంట క్రితం....

గోదావరి సికింద్రాబాద్ చేరింది. ముస లాయన పులిక్కిపడి లేచాడు. "రంగనాథ రావుగారు వస్తారనుకుంటాను!"

గోపాలం తోకను పోయిన తన ప్రాణం యింకా ఎక్కడకి పోతుందా అని ఆలో చించ సాగాడు.

రాధ పురుషోత్తమరావుకి వివరించటం ప్రారంభించింది. చెప్పటం అయిపోయాక అడిగింది" జగన్నాథం మామయ్య వూళ్ళో వుంటా డంటావా?" అని.

'జగన్నాథమా? వాడెవ్వడు?' అన్నాడు పురుషోత్తమరావు.

"సరేలే!" అంది రాధ. గోపాలంవంక తిరిగి "ఈ వూర్లో మాకు జగన్నాథం గారని ఒక బంధువు వున్నాడండి. ఆయ నకు ఒక వుత్తరం రాయమన్నాను- మేము యిట్లా వస్తున్నామని. అసలు ఆయన యిప్పుడు వూళ్ళో వున్నాడో లేడో కూడా తెలియదు. ఆ మాటకొస్తే మా నాన్నగారు ఆయనకు వుత్తరం రాశారో లేదో కూడా తెలియదనుకోండి. మీరు చెప్పిన ప్లేస్‌కి బొంబాయి వెడితే బాగుంటుందేమో!" అంది.

స్టేషన్‌లో కాఫీ గ్లాసు యిప్పించి, రైలు ఎక్కించి, రైలు కదిలేంత వరకూ క్షమాపణలు చెబుతూనేవున్నాడుగోపాలం.

రైలు కదిలాక నాంపల్లి స్టేషన్‌లో వున్న తన ఫ్రెండ్‌కి ఫోన్ చేశాడు. ఫలాని బోగీలో పురుషోత్తమరావు, రాధ అని వున్నారని వాళ్ళు రైలు నాంపల్లి వది లేంతవరకూ అందులోనే వున్నారో లేదో కాస్త చూడమని చెప్పాడు. గోపాలంకి రాధమీద కాస్త అనుమానంగా వుంది.

ఆలోచిస్తూనే వెయిటింగ్ రూమ్‌లోకి నడిచాడు. భానుమతి, రమేష్ కబుర్లు చెప్పు కుంటున్నారు. వారి పక్కన రెండు సూట్ కేసులు వున్నాయి.

"భానూ! నీకు 'అమదానంద కందళిత హృదయార విందుడు' అంటే అర్థం తెలుసా? రాధ ఎమ్. ఏ. తెలుగట" అంటున్నాడు రమేష్.

"హేపీ బర్త్‌డే!" అని భానుమతితో అని రమేష్‌వంక తిరిగి "ఒక చేతికర్ర, తెల్లరంగు అర్జంటుగా తీసుకురా! అన్నట్లు ఈ కళ్ళజోడు పట్టుకు వెళ్ళి లూజుచేయించి తెమ్మా నాయనా! అంటే ముక్కు మీదకి జారుతుండాలి. ఈ లోగా భానుమతికి ఎట్లా నటించాలో, ఏం జాగ్రత్తలు తీసుకోవాలో చెప్తాను" అన్నాడు.

"ఓ.కె. మామయ్యగారూ! అన్నట్లు ఈ సూట్‌కేసులో ఆరు పంచెలు, లాల్చీలు వున్నాయి. ఆ లాండ్రివాడి దగ్గర అంతే వున్నాయి" రమేష్ వెళ్ళిపోయాడు.





ప్రతాప్

రబ్బరు రోలర్ షెల్లర్లు

[వి. బెల్టు డ్రైవ్]

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్
హైదరాబాద్ వారి అనుమతి పొందిన
సరికొత్త రైసు మిల్లు

7.5 H. P. కరెంటును ఉపయోగించి గంటకు
$2\frac{1}{2}$ నుండి $3\frac{1}{2}$ టన్నులు ధాన్యం ఆడించవచ్చును.
దిగుబడి 75 నుండి 80 శాతం వరకు వచ్చును.
మరియు 98 శాతం ఊకను తీసివేయును.

ఇతరమైన అన్ని రైస్ మిల్లులకంటే అతి మన్నికగా
మా స్వంత ఫ్యాక్టరీలో నవీన పద్ధతిలో
తయారుచేయబడినది.

వివరములకు :

ప్రతాప్ ఇండస్ట్రీస్

(Specialists in Cast Iron Alloy Castings)

ఫ్యాక్టరీ & ఆఫీసు : ఎనికేపాడు
వయా] రామవరప్పాడు-
521108
విజయవాడ
ఫోన్ : 84-34

షో రూమ్ :
బాలకృష్ణా మార్కెట్,
బాబూ రాజేంద్రప్రసాద్ రోడ్,
విజయవాడ-520001
ఫోన్ : 74324

ఇంకో ఇరవై నిముషాల తరువాత ముగ్గురూ స్టేషన్ బయటకి వచ్చారు. గోపాలం దాదాపుగా మారిపోయాడు- తెల్ల జుట్టు, జారుడు కళ్ళజోడు, లుంగీ, లాల్చి, గోపాలం ఉత్సాహంగా వున్నాడు. ఐదు నిమిషాల క్రితం నాంపల్లి మిత్రుడికి ఫోన్ చేశాడు. రైలు నాంపల్లి దాటేంత వరకూ యిద్దరూ రైల్లోనే వున్నారని తెలిపాడు అతను. తమ ప్లాన్ దాదాపు విజయవంతమయినట్లే అనుకున్నాడు గోపాలం.

దారిలో వెంకయ్యను ఎక్కించుకుని యింటికి వెళ్ళారు.

బంగ్లా ముందు కారు దిగారో లేదో ఒక జీపు వచ్చింది. అందులోంచి రంగనాధరావు దిగాడు. రమేష్‌తో మాట్లాడుతున్న ఆ యిద్దరినీ చూడగానే ఎవరో అర్థం చేసుకున్నాడు.

రమేష్ పరిచయాలు పూర్తి చేశాడు.

రంగనాధరావు భానుమతివంక తృప్తిగా చూశాడు. అమ్మాయి బాగుంది. రమేష్‌కి మంచి జోడీ.

"మీరు శ్రమపడి వచ్చినందుకు కృతజ్ఞుడిని" అన్నాడు రంగనాధరావు.

"దానికేముంది!" అన్నాడు గోపాలం.

అంతా లోపలికి నడిచారు. భానుమతికి భయం భయంగా వుంది. నాటకాలలో వేషాలు వెయ్యటం వేరు. ఇది నిజ జీవితంలో పైగా పాత్ర గురించి పూర్తి వివరాలు తెలియకుండా!

అంతా కబుర్లు చెప్పుకుంటూ వెంకయ్యా అందించిన కాఫీ తీసుకుంటున్నారు.

అదే సమయానికి సామాన్లగదిలో నిద్ర నుంచి ఒక్కసారిగా వులిక్కిపడి లేచాడు హనుమంతం. అంత అసౌకర్యమయిన భంగిమలో నిద్ర రావటం నిజంగా ఆశ్చర్యకరమయిన విషయమే! టైము చూసుకున్నాడు. పదకొండు అంది వాచ్. హాలులోంచి మాటలు వినిపిస్తున్నాయి. తలుపులు బాదుదామని వెళ్ళాడు. కాని అయిదు నిముషాల క్రితమే రమేష్ గడియ తెరవటంతో ఆ అవసరం లేకుండా పోయింది. ఆశ్చర్యంగా హాలువంక పరిగెత్తాడు.

రంగనాధరావుకి పరిగెడుతూ వస్తున్న హనుమంతం అదీ టాప్‌లెస్‌గా కనబడ్డాడు. అప్పుడే ఆయన రమేష్‌ని అడిగాడు. "నేను హనుమంతాన్ని స్టేషన్‌కి వెళ్ళమన్నాను కదా? అసలు హనుమంతం కనబడ దేమిటి?" అని. రమేష్ తనకి తెలియదు అన్నాడు.

పరిగెడుతున్న హనుమంతాన్ని చూసి రంగనాధరావు విస్తుపోవాలో, పోనక్కర లేదో తెలియని వాడిలా వుండిపోయాడు. ముఖానికి, చేతులకి, ఛాతికి బూజు,దుమ్ము అంటి వుంది. నిద్రకళ్ళు. ఇరవై మూడవ శతాబ్దపు తవ్వకాలలో దొరికే ఇరవైవ శతాబ్దపు మనిషిలా వున్నాడు. వీడికి మతిపోయి వుండాలి. ఆ అవతారంతో అందరిముందుకి వదామని ఎట్లా అనుకున్నాడని అనుకుని గబగబా హనుమంతాన్ని సమీపించాడు రంగనాధరావు. రమేష్ కూడా ఆయన వెనకాల వెళ్ళాడు.

"ఏమిటి హనుమంతం?" ఏమయ్యింది? ఎక్కడికి వెళ్ళావు? ఏమిటీ వేషం?" అన్నాడు రమేష్.

ఆ ప్రశ్నలు ఇంకెవరైనా అడిగితే మెల్లిగా జవాబు చెప్పేవాడేమోగాని, తను దాదాపుగా ఒక గంటన్నర కాలం గడిపిన నరకానికి కారణమయిన రమేష్ ఏమీ తెలియని వాడిలాగా అడిగే టప్పటికి ఆ బాధంతా ఒక్కసారిగా కోపంగా, వుక్రోషంగా మారింది.


"నన్ను రేస్ కోర్సులో మోసం చేశాననుకుంటున్నావేమో? నాకు అప్పుడే తెలుసు. నువ్వు నీ పేరు బిషన్‌సింగ్‌బేడి అని అబద్ధం చెబుతున్నావని. ఇప్పుడు చెప్పు! నన్నెందుకు గదిలో పెట్టి గడియ వేశావు? గదిలో కారు తాళం చెవులు వున్నాయని ఎందుకు...." గట్టిగా అరవటంతో హనుమంతం గొంతుపోయింది.

అంతకు ముందే వూహించి రిహార్సలు చేసుకున్న రమేష్ సునాయాసంగా అన్నాడు- కొంత బాధను నటిస్తూ "నువ్వు ఏం మాట్లాడుతున్నావో నీకు తెలుస్తున్నదా? నీ కోసం తొమ్మిది గంటల వరకు చూశాను. నువ్వు కనబడకపోయేటప్పటికి నేనే కారు తీసుకువెళ్ళాను. అయినా కారు తాళం చెవులు యిందులో వున్నాయంటే నువ్వెట్లా నమ్మగలవు? మధ్యలో రేస్ కోర్స్ పిడకల వేట ఏమిటి?"

రంగనాధరావు అందుకున్నాడు. "వీడు అక్కడ బిషన్‌సింగ్ బేడి అని పేరు చెప్పుకుంటే అప్పుడే నిలదియ్యకపోయావా? పైగా తలుపుకు గడియపెట్టి వుంటే నువ్వు బయటకి ఎట్లా వచ్చావు?"

స్టేషన్‌కి పురుషోత్తమరావుగారిని తీసుకురావటానికి నా బదులు వెళ్ళానన్నావే! ఆయనని నువ్వు యింతకు పూర్వం చూడలేదు కదా? ఎట్లా గుర్తుపట్టుదామనుకున్నావు? చెప్పు రమేష్?" అన్నాడు హనుమంతం బి.పి పెరిగిపోతుండంగా.

"నేను బయలుదేరినప్పుడు అదంతా ఆలోచించలేదు. స్టేషన్‌కి వెళ్ళాక అయిడియా వచ్చి యిట్లా ఫలానివారు ఫలాని చోటికి రావల్సిందని అనౌన్సు చేయించాను" అన్నాడు రమేష్. రమేష్ గోపాలం తెలివితేటలను మెచ్చుకోకుండా వుండలేక



పోయాడు. ప్రతి చిన్న విషయం ఆలోచించి ఎట్లా మాట్లాడాలో ఏది మాట్లాడితే బాగుంటుందో, ఏది మాట్లాడాల్సి వస్తుందో ముందే చెప్పాడు.

హనుమంతం మాట్లాడలేదు.

"సరే! ఈ విషయం ఎందుకుగాని.... ఆయన యిక్కడకు వచ్చారు. ముందు బూజు దులుపుకుని మొహం కడుక్కునిరా! ఆయనకు క్షమాపణ చెప్పుకోవాలి నువ్వు" అన్నాడు రంగనాథరావు. ఆయనకు హనుమంతం పరిస్థితి ఆందోళనగా వుంది. 'కొంపదీసి తమ మేనమామకి వున్న పిచ్చి వీడికి రాలేదుకదా?'

రెండు నిమిషాల తరువాత హాలులోకి వచ్చాడు హనుమంతం. "క్షమించాలి" అంటూ భానుమతి నించి చూపు గోపాలం వంక మారుస్తూ ఏదో చెప్పబోయాడు. నోట్లో క్రికెట్ బంతి వున్నట్లు నోరు అట్లాగే తెరుచుకుని వుండిపోయింది. కొంతసేపు అందరికీ తన నాలిక, ముప్పైరెండు పళ్ళు కొండనాలిక ప్రదర్శించి తరువాత సంబాళించుకుని రంగనాథరావుతో అన్నాడు. "సార్! ఈయన పురుషోత్తమరావు కాదు." (అందరి ఎదుట బాబాయి అని రంగనాథరావుని పిలవడు) ఎంతో వేగంగా, తేలికగా ఆలోచించే హనుమంతం మెదడు కూడా ఒకదాని తరువాత ఒకటి జరుగుతున్న ఈ ఆశ్చర్యాలకు మొద్దుబారిపోయింది.

గోపాలం తనకేమి పట్టనట్లు "ఇతనేనా నన్ను అక్కడెక్కడో కలిసింది! మనిషి బాగా చిక్కిపోయాడు" అన్నాడు.

"సిలేరులో నాన్నా!" అంది భానుమతి.

"అవును. సిలేరులో- ఆ రోజు...."

"కారు. మీరు ముమ్మాటికి పురుషోత్తమరావు కారు." అన్నాడు హనుమంతం.

"హనుమంతం! దేనికన్నా ఒక హద్దుపద్దు వుండాలి. ఇందాక జరిగిన సంఘటన. ఇది చూస్తుంటే నీకు నిశ్చయంగా పిచ్చి ఎక్కినట్లుంది. ఆ పెద్ద మనిషికి క్షమాపణ చెప్పుకొమ్మంటే నీ నోటికి వచ్చింది వాగుతావా!" రంగనాథరావుకి కోపం వచ్చింది.

హనుమంతం మాట్లాడటానికి అవకాశం లేకుండా భానుమతి అంది. "రంగనాథరావుగారు! ఇంత అవమానం జరుగుతుంది అని తెలిస్తే యిక్కడకి వచ్చేవాళ్ళంకాదు. జరిగాక యిక్కడ వుండటం భావ్యంకాదు."

రమేష్ తనకి యివ్వబడిన యిన్‌స్ట్రక్షన్స్ ప్రకారం నోరు తెరుచుకుని చూడ (విన) సాగాడు.

రంగనాధరావు ఆలోచిస్తున్నాడు. ఒకసారి ఫొటోలో చూశాడు పురుషోత్తమరావుని. ఇద్దరి ముగ్గురి దగ్గర విన్నాడు ఆయన గురించి. తెల్లజుట్టు, పొడుగు, సన్నం, మతిమరుపు అన్ని సరిపోతున్నాయి.

హనుమంతం మొహం ఒక్కసారిగా వికసించింది. "ఆగండి సార్! ఈయన పురుషోత్తమరావు కాదని యిప్పుడే ఋజువు చేస్తాను. ఈయన వస్తున్నట్లు మనకి రాసిన వుత్తరం వుంది. దస్తూరి పోలిస్తే సరి!"

రమేష్‌కి గోపాలం తెలివితేటల మీద వున్న గొప్ప అభిప్రాయం కరిగిపోయింది, తను నిన్న చింపుదాం అంటున్నా వినక దాన్ని మళ్ళీ హనుమంతం టేబుల్లో వుంచమని చెప్పాడు. ఇప్పుడు ఏం జరగబోతుందో ఆలోచిస్తేనే భయంగా వుంది.

హనుమంతం పెన్ను, కాయితం, ఉత్తరం తీసుకువచ్చాడు. మొదటి రెండు గోపాలంకి యిచ్చి "నేను చెప్పింది రాయండి" అన్నాడు. అనటం బహువచనంలో అన్నా అందులో గౌరవం లేదు.

రంగనాధరావు లౌక్యంగా అన్నాడు. "ఏమీ అనుకోకండి! మిమ్మల్ని శంకిస్తున్నానని కదూ దీంతో మా వాడికి ఎంత పిచ్చి వుందో తెలుస్తుంది."

గోపాలం రాయటం పూర్తి అయ్యాక హనుమంతం అన్నాడు. "రమేష్! ఇదుగో అసలు వుత్తరం. రెండూ సరిచూడు."

రమేష్ యాంత్రికంగా రెండు కాయితాలు తీసుకున్నాడు. చూడగానే మతిపోయింది, 'ఇది కలా? నిజమా? ఇది ఎట్లా సాధ్యం? వీడు గోపాలంగాడా లేక ఏసీ సర్కారా?'

"ఏం రమేష్! మాట్లాడవేం?" అన్నాడు హనుమంతం వెక్కిరింతగా.

రమేష్ తల ఎత్తి చూశాడు. గోపాలం నవ్వుతున్నాడు. మన్ను కోసం కృష్ణుడి నోరు దూసిన యశోదకి మూడు లోకాలు చూపించి కృష్ణుడు నవ్విన నవ్వు అది.

"చూడు హనుమంతం! ఇందులో మనకు ముందు వచ్చిన వుత్తరం ఏదో చెప్పగలవా?" రెండు కాయితాలు కలిపి యిచ్చాడు.

దీపావళి శుభాకాంక్షలతో

సౌత్ ఇండియా రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్

సిరినగర్,
విజయవాడ-7.

హనుమంతం రెండు కాయితాలు లాక్కున్నాడు. ఇంకొక్షణంలో ఎవరెస్టి మీద వుంటా ననుకున్నవాడు పసిఫిక్‌లో పడిపోతే అచ్చు హనుమంతంలా వుంటుంది వాడి పరిస్థితి.

రంగనాధరావు కూడా చూశాడు. వెంటనే హనుమంతం రెక్క పట్టుకుని లాక్కు వెళ్ళాడు.

"నీకు పిచ్చి ఎక్కిందిరా! నీకు మతి చాంచల్యం పట్టుకుందిరా! పోరా! పో! వెంటనే మీ వూరు పో! ఇప్పుడు రైలు లేదు, బస్సులేదు అనకు. రెండెడ్ల బండిమీద పోతావో, రెండుకాళ్ళమీద పోతావో నీ యిష్టం! పో! పోయి జుట్టు తీయించుకుని నిమ్మకాయ మర్దన చేయించుకో! పోరా! పో!" అంటూ శివాజి గణేశన్ ఆశ్చర్య పడేటట్లు అరిచాడు.

ఆ స్థితిలో హనుమంతం అనుకున్నది ఒక్కటే!....తనకి నిజంగా పిచ్చి ఎక్కిందని అందుకనే తరువాతి అరగంటలో అతను బస్సులో హైదరాబాద్‌కి దూరం అయిపోతున్నాడు.

హైదరాబాద్‌కి దూరం అవుతున్న వారిలో పురుషోత్తమరావు, కమల (ఏక సంథాగ్రహులైన పాఠకులకు కమల జాంబవతి స్నేహితురాలని గుర్తుండేవుంటుంది) వున్నారు. హైదరాబాద్‌కి దూరం అవుతున్న వారిలో రాధ లేదు. ఇది ఎట్లా జరిగిందంటే....

సికింద్రాబాద్ నుంచి రాధ, పురుషోత్తమరావు ఎక్కిన రైలు కదిలి నాంపల్లి స్టేషన్ చేరింది. ప్లాట్‌ఫారంమీద హడావుడిగా తిరుగుతున్న కమలను, కమల పక్క పాంటు, షర్టు, వేసుకున్న అమ్మాయిని చూసి రాధ గట్టిగానే "కమలా!" అని పిలిచింది. ఎకామడేషన్ దొరకక హడావుడిగా తిరుగుతున్న కమల, పిలిచింది తన స్నేహితురాలైన రాధ కాకపోతే పట్టించుకునేదే కాదు. తనకు బొంబేలో ఇంటర్వ్యూ వున్నట్లు తనకి ఎక్కడా చోటు దొరకనట్లు చెప్పింది కమల. చురుకుగా ఆలోచించే రాధ వెంటనే దానికి సొల్యూషన్ చెప్పింది- కమలని తన పేరుతో బొంబాయి వెళ్ళమని, పురుషోత్తమరావుని ఫలానచోట జాగ్రత్తగా అప్పగించమని, తను హైద్రాబాద్‌లో రెండు రోజులు వుండి మెల్లిగా వస్తానని. కమల కూడా చురుకుగా రాధను ఆ రెండు రోజులు జాంబవతి (అవును. కమల పక్కన వున్నది. కమలకి రిజర్వేషన్‌చెయ్యటం మరిచిపోయిన జాంబవతి తప్ప మరెవ్వరూ?)తో వుండమని చెప్పింది. ఆ విధంగా రాధ హైదరాబాద్‌లోనే వుండిపోయింది.

ఆ విధంగానే నాంపల్లిలో గోపాలం స్నేహితుడు, కమల పురుషోత్తమరావుల పేర్లు అడిగి రాధ, పురుషోత్తమరావులు అనుకుని సంతృప్తిపడ్డారు.

## 3

ఆ రోజున విశ్రాంతి తీసుకోవాలి అని చెప్పి గోపాలం తలుపులు బిగించుకుని ఆస్ట్రాలజీ, న్యూమరాలజీ, పామిస్ట్రీమీద పుస్తకాలు చదివాడు. 'మీ యిద్దరికీ వూరు చూపిస్తానంటాను నువ్వు రానని చెప్పు' అని బెదిరించి రమేష్ భానుమతిని కారులో తీసుకువెళ్ళాడు ఆమర్నాడు. రంగనాథరావు గత వారంరోజులుగా పేరుకుపోయిన పనుల హడావుడిలో పడిపోవటంతో ఆ రోజు కూడా పుస్తకాలు చదవటానికి గోపాలంకి అవకాశం దొరికింది.

ఆ రోజు సాయంకాలానికి ఆ సబ్జెక్టుల మీద అవాకులు చవాకులు పేలగలనన్న ధైర్యం వచ్చింది. రెండు రోజుల నించి కాలు బయటకి కదపలేదు. కాబట్టి బయటకి వెడదాం అనుకుంటూ బయలుదేరాడు.

బయటకు వచ్చి హోటలుకు వెడదాం అని నిశ్చయించుకున్నాడు. ఆరున్నర అయినా సూర్యుడు ఓవర్‌టైము చేస్తూ వుండిపోయాడు. సరదాగా షికార్లకి తిరుగుతున్న భానుమతి,రమేష్‌ల గురించి ఆలోచిస్తూ కాఫీ తాగాడు. బిల్ పే చేస్తుంటే అద్దంలో తన ప్రతిబింబం తనకే ఏదోలా వుంది. ముక్కుమీదకు జారుతున్న కళ్ళజోడు మహా యిరిటేటింగ్‌గా వుంది.

కిళ్ళీకొట్లో సిగరెట్ కొని ముట్టించబోతున్నాడు.... సరిగ్గా అప్పుడే జరిగింది ఆ సంఘటన. రేపటి నుంచి రంగనాథరావుకి జ్యోతిష్యంమీద ఎట్లాబోరుకొట్టాలి అని ఇక్కడ ఆలోచిస్తున్న గోపాలం, 'మా నాన్నగారికి నువ్వు బాగా నచ్చావు' అని భానుమతితో ఎక్కడో అంటున్న రమేష్ ఎదురుచూడని సంఘటన.

గోపాలం గీసిన అగ్గిపుల్ల వెలిగింది. కాని అది యింకా గోపాలం నోట్లో వున్న సిగరెట్‌ను ముద్దు పెట్టుకోలేదు. అప్పుడు వినిపించింది దయానంద్ బిల్డింగ్ ఎక్కడ అన్న ప్రశ్న. ఆ గొంతు తనకు పరిచయమయిన గొంతుగా తట్టకపోతే. అడుగుతున్నది రమేష్ యింటి గురించి కాకపోతే సిగరెట్ వెలిగించుకుని జవాబు యిచ్చేవాడు. కాని ఫలాని విధంగా తట్టటంతో, ఫలాని ఇంటి గురించి అడగటంతో, గోపాలం అగ్గిపుల్ల ఎల్. ఐ. సి. లాగా పట్టుకుని ప్రశ్న వచ్చిన ప్రక్కకు చూశాడు.

అంతే.... ఆ ప్రశ్న వేసిన వ్యక్తి సమ్మోహనాస్త్రంవెయ్యలేదు. (క్రితంరోజు వేసిందెమో తెలియదు). కాని వేసినట్లే వుండిపోయాడు గోపాలం. ముక్కుమధ్యలో వున్న కళ్ళజోడు చివరవరకూ జారింది. అయినా పట్టించుకోలేదు. చేతిలో వెలుగుతున్న అగ్గిపుల్ల హనుమంతుడి తోక కాలిపోవడంతో సురసుర కాలి గోపాలం చేతిని కాటేసింది. వెంటదే నోటిలో వున్న సిగరెట్ జారి కింద పడింది.

తిన్న షాకుకి అంతరిక్షంలో వున్న గెలాక్సీలన్నీ చూసివచ్చిన గోపాలం మనసు. చెయ్యి కాలటంతో ప్రస్తుతంలోకి వచ్చింది. సంబాళించుకుంటూ అడిగాడు "నీ పేరు ఏమిటమ్మాయీ?" కళ్ళజోడు సరిచేసుకున్నారు.

"మాయ!"

గోపాలం రాధ యిట్లా మారు పేరు చెప్పుకుంటేఆశ్చర్యపడలేదు. నాంపల్లిలో రైలు కదిలినప్పుడు కూడా రైల్లోనే వున్న రాధ యిక్కడకి ఎట్లా వచ్చిందా అని ఆలోచిస్తున్నాడు రమేష్ యింటికి బయలుదేరిందంటే రాధకు రమేష్, రంగనాధరావు వూళ్ళోనే వున్నారని తెలిసి వుంటుంది. కాని. పురుషోత్తం రాధ. పేర్లతో తను, భానుమతి వచ్చిన సంగతి కూడా కనుక్కుందా? అసలు రాధ నిన్ననె తనను దొంగ వెధవగా పసిగట్టిందా? ఇప్పుడు ఆ దొంగ వెధవా. ఈ ముసలి వెధవా ఒక్కడే అని పసికట్టిందా? ఒకవేళ అవి అన్నీ తెలిస్తే యిప్పుడు మారుపేరు చెప్పుకోవాల్సిన అవసరం ఏమిటి? పోలీసులను తీసుకువచ్చి తమ అంతు చూస్తే పోయేది కదా?

"దయానంద్ బిల్డింగ్ ఎందుకమ్మాయి?" గోపాలం అడిగాడు.

మాయ గోపాలంని పరీక్షగా చూసింది.

తెల జుట్టు, నేత బట్టలు, వంగిన నడుం- చూస్తుంటే చాదస్తపు ముసలివాడిలా వున్నాడు. చెబితే వచ్చే నష్టం లేదనుకుని చెప్పసాగింది. "రంగనాధరావుగారిని కలవాలండి! నేను .... రంగనాథరావుగారి సెక్రటరీ యిప్పుడు పనిచెయ్యడం లేదని తెలిసింది. నేను చాలా అవసరాలలో వున్నాను. ఆ వుద్యోగం నాకు యిస్తారేమో అని అడగటానికి".

వింఢా మునిగిన గోపాలంకి చలి అనిపించలేదు. కాని యింత యిన్ఫర్మేషన్ రాధ అప్పుడే ఎట్లా సంపాదించిందా అన్న అనుమానం వచ్చింది. అయినా "పదమ్మా! చూపిస్తా," అన్నాడు నడుంవంచి నడుస్తూ. రమేష్ పెళ్ళికి వెయ్యి అబద్ధాలతో పాటు నడుం కూడా వంచాల్సి వచ్చినందుకు తిట్టుకుంటూ!


రాధను ఏం చదివావు, ఎక్కడ వుంటున్నావు అన్న ప్రశ్నలయితే అడుగుతున్నాడు కాని గోపాలం ఆ జవాబులు వినటంలేదు.

కరక్టుగా బంగళా గేటుదగ్గరగా వచ్చాక బ్రహ్మాండమయిన ఐడియా వచ్చింది.

"చూడమ్మా! ఇదే దయానంద్ బిల్డింగ్. ఇందాక నువ్వు బిల్డింగ్ చూపించమన్నావు- అందుకనే చూపిస్తున్నాను. ఇందాకటినుంచి అర్థమయిన ప్రశ్నలు వేస్తున్నాడు ఎవడీ చాదస్తపు ముసలి ముండా వాడు అని అనుకుంటున్నావేమో! నేనే రంగనాధరావును! అవును. నా సెక్రటరి వెళ్ళిపోయిన మాట వాస్తవమే! కాని నేను తిరిగే సర్కిల్స్‌లో, కదిలే చోట్లలో నీ లాంటి ఆడపిల్ల నెగ్గుకు రాగలదా అన్నది పెద్ద ప్రశ్న పైగా అది ఆడపిల్ల చెయ్యాల్సిన పని కాదు" అన్నాడు. "అంతేకాదు మొన్న నేను అర్జంటుగా ఢిల్లీ వెళ్ళినప్పుడు మా సెక్రటరీని నేను కాజీపేట పంపాను. అటువంటి పనులు ఆడపిల్లలకు నేనుచెప్పలేనుకదా!"

గోపాలం చెప్పిన మాటలు ముఖ్యంగా ఆ చివరి మాటలు. రాధను కొంచెంసేపు ఆలోచించేటట్లు చేశాయి. "మీరే అట్లా అంటే ఎట్లాగండీ!" అంది.

ఆ అమ్మాయి మాట్లాడుతున్న మాటలలో గాని చూస్తున్న చూపులోగాని తనని గుర్తుపట్టిన జాడ లేకపోవటంతో గోపాలం నిజంగా తన తెలివితేటలకు సమయస్ఫూర్తికి మురిసిపోయాడు ఆ



ఏకాంతం (ఒంటరి)

చిత్రం : ఆర్. మల్లేశం, (సిద్ధిపేట)

ఆనందంతో కళ్ళజోడు తీసి లాల్చి అంచులతో తుడవసాగాడు.

"నేను చాలా అవసర...." అంటున్న రాధ కళ్ళజోడు లేని గోపాలం మొహం చూసి వెంటనే గుర్తుపట్టింది. అందుకనే మాట మధ్యలో ఆపి "సరే, నేను వెళ్ళివస్తానండి" అంది.

"మంచిది!"

"చాలా థాంక్సండి తాతగారూ!"అంది రాధ వెటకారంగా. దురదృష్ట వశాత్తు గోపాలంకి అందులో వెటకారం వినబడలేదు.

రాధ కనుమరుగయ్యే వరకూ అట్లా చూస్తూ వుండిపోయేడు గోపాలం. తాత్కాలికంగా మాత్రమే ఈ అపాయం నించి తప్పించుకున్నానని గోపాలంకి తెలుసు. అసలు రాధ మాయ పేరుతో ఎందుకు వచ్చింది. రాధ వెనక ఎవరన్నా వున్నారా అని ఆలోచిస్తూ లోపలికి వెళ్ళాడు.

రాధ హైదరాబాద్‌లో వుండిపోవటమే చిత్రంగా జరిగింది. రాధ మాయగా రావటం ఇంకా చిత్రంగా జరిగింది.

రాధకు ముందు గోపాలం వేసిన ట్రిక్ మీద కొంచెంకూడా అనుమానం రాలేదు. జాంబవతితో కలిసి ఇంటికి బయలుదేరినప్పుడు తాము ఒక్క గంట క్రితం మోసగింపబడ్డాము అన్న విషయం తెలియనే తెలియదు రాధకు.

తను ఎంత మంచి చీరకొన్నదో ఆ చీరను కట్టనుకూడా కట్టక చాకలికి ఎట్లా వేయవలసివచ్చిందో, ఆ చీర వున్నట్లుండి ఎట్లా మాయం అయ్యిందో. చాకలివాడు గోపాలం రూమ్‌లోనే వుంచానని ఎంత ఘంటాపథంగా చెప్పాడో జాంబవతి రాధకు ఆటో కోసం వెయిట్ చేస్తున్నప్పుడు, ఆటోలో, ఇంటికి వచ్చాక తడవకు రెండుసార్లు చొప్పున చెప్పింది.

ఇంక భరించలేక అంది రాధ "మరి ఆయన రూమ్‌లో సరిగ్గా చూడకపోయారా!" అని.

జాంబవతిని స్పృహను వ్యక్తం చేస్తు అంది. "నిన్నటి నుంచి గోపాలం కనబడటంలేదు. అప్పటికి ముసలాయనని తాళం చెవుల కోసం అడిగాను - ఆయన దగ్గర ఇంకో తాళంచెవి వుందిలేండి. అదేమిటో ఆయన గోపాలం పేరు ఎత్తితేనే గంగవెర్రులు ఎత్తుతున్నాడు. ఇంకో నాలుగు రోజులలో గోపాలం రాకపోతే తాళం తీసి సామాన్లు బయటవెయ్యటానికి చాలా ఉబలాటపడుతున్నాడు. ఇంతకీ ఆ చీర ఎంత గొప్పగా వుందో తెలుసా!, ఎరుపు, నీలం, ఆకుపచ్చ, పసుపు అంత గొప్పగా స్నేహం చేస్తున్నట్లు వున్న చీర నేనెక్కడా...."

రాధ కూడా అంతకన్నా నిస్పృహగా ఇంకోసారి చీర కథ వింది. ఉన్నట్లుండి రాధకు బ్రహ్మాండమయిన ఐడియా తట్టింది. చూడండి! ఆ ముసలాయన దగ్గరకు వెడదాం. నేను ఇంటి కోసం చూస్తున్నానని చెప్పండి. అసలే గోపాలం మీద కోపంలో వున్న ఆయన నాకు ఇల్లు చూపించటానికి తప్పక ఏర్పాటు చేస్తాడు. తాళం తీశాక మీరు చీర కోసం చూస్తూ వుండండి. నేను ఇల్లు చూస్తున్నట్లు నటిస్తాను."

జాంబవతి ఎగిరి గంతేసింది. క్రితం రోజు రమేష్ జాంబవతి ఎదురుగా ప్రదర్శించిన గంతు దీని ముందు బలాదూరు.

"ఎంత మంచి బుర్రండి మీది!" అంది జాంబవతి.

ఆదిలోనే హంసపాదు అన్నట్లు ముసలాయనని అంత దూరంలో చూస్తూనే రాధ గబుక్కున వెనక్కి తిరిగి వచ్చింది. జాంబవతి కంగారుగా వచ్చి "ఏమిటి! ఎందుకు వచ్చేశారు!" అంది.

"మీరు ఆయన పేరు జగన్నాధమని

నాకు ఎందుకు చెప్పలేదు? ఆయన మా మేనమామ" అంది రాధ. రాధకు పురుషోత్తమరావు లేకుండా జగన్నాథాన్ని కలపటం ఇష్టంలేదు. జగన్నాథం తనని చూడటం తటస్థిస్తే తను హైదరాబాద్‌లో ఎన్ని రోజులైనా గడపవచ్చు కాని. సరదాగా మటుకు కాదు.

ఈసారి ఐడియా చెప్పడం జాంబవతి వంతైంది. కూలింగ్ గ్లాసెస్‌తో, చీర కొంగు ముసుగుతో రమ్మనమని. మాట్లాడినంతసేపూ నేలచూపులు చూస్తూ వుండమని మరీ మరీ బ్రతిమిలాడింది జాంబవతి. ఒప్పుకోకపోతే ఇంకోసారి చీర కథ వినాల్సి వస్తుందన్న భయంతో రాధ ఒప్పుకుంది.

జగన్నాథం ఏ కళన వున్నాడోగాని, తాళం చెవి ఇచ్చాడు. గదిలోకి అడుగు పెట్టిన రాధ ఆశ్చర్యపోయింది. గోపాలం రమేష్ ఫొటోలను చూసి. ఇన్‌ఫర్మేషన్ బ్యూరో అయిన జాంబవతి ద్వారా తమని హనుమంతం పేరుతో కలిసింది గోపాలం అనే పెద్దమనిషని, తాము కలవటానికి వచ్చిన రంగనాధరావు అబ్బాయి రమేష్ గోపాలం స్నేహితుడని, రమేష్ నిన్న రాత్రి వరకు హైదరాబాద్‌లోనే వున్నాడని ఢిల్లీ వెళ్ళలేదని తెలుసుకుంది. గోపాలం మంచివాడే కాని రమేష్ పిచ్చివాడు అయివుండచ్చు అని చెప్పింది జాంబవతి.

వెంటనే రంగనాధరావు ఇంటికి ఫోన్ చేసింది రాధ. ఫోన్ ఎత్తిన వెంకయ్య ఇట్లా పురుషోత్తం రాధ అని తమ ఇంటికి అతిథులు రావడం, హనుమంతానికి పిచ్చి ఎక్కటం లాంటి విషయాలు చెప్పాడు. అసలు వెంకయ్య ఫోన్‌లో అంతసేపు మాట్లాడటం జీవితంలో అదే మొదటిసారి. ప్రతివారూ ఫలాని వాడిని పిలు అని అనేవారేగాని స్నేహంగా మాట్లాడినవారులేరు. అందుకనే రాధకు చాలా సమాచారం అందించాడు వెంకయ్య.

ఒక రోజంతా ఆలోచించింది రాధ. గోపాలం ఎందుకనో ప్రమాదమయిన వ్యక్తిగా కనబడలేదు. అందుకనే అసలు విషయం కనుక్కోవటానికి మాయ అనే పేరుతో బయలుదేరింది.

ఇవన్నీ ఏమీ తెలియని గోపాలం తన గదిలో కూర్చుని ఆలోచించ సాగాడు. ఎంతగా ఆలోచనలలో మునిగిపోయాడంటే వెంకయ్య వచ్చి చెప్పేంత వరకూ షికార్లనుంచి రమేష్ భానుమతీ, పనుల నుంచి రంగనాధరావు వచ్చారని తెలియలేదు గోపాలంకి. ఆలోచనలు విరమించి హాలులోకి నడిచాడు.

గోపాలం కనబడగానే "రండి రండి" అని రమేష్ రంగనాధరావు ఆహ్వానించారు

"పొద్దుటినుంచి ఒక్కరే వున్నట్లున్నారు. రేపటినుండి నాకూ తిరికే, మీరు వచ్చినందుకు నాలుగు రోజులు జ్యోతిష్యంలో గడపవచ్చును. అన్నాడు రంగనాధరావు.

గోపాలం చిరునవ్వు నవ్వాడు తల వూపుతూ.

"అన్నట్లు మాటలలో పడి నీ మాట మర్చిపోయాను. కూర్చో అమ్మా పర్వాలేదు. ఏమిటి? ఏదో సహాయం అన్నావు?" అన్నాడు రంగనాధరావు, గోపాలం కుడి పక్కన వున్న గుమ్మం నీడలో నుంచుని వున్న అమ్మాయితో. ఆ అమ్మాయి లోపలికి రావటంతో ఆ అమ్మాయిని రాధగా గుర్తించిన గోపాలం మహమ్మదాలీనో, దారాసింగో ముక్కు మిద పంచ్ ఇచ్చినట్లు మొహం పెట్టాడు.

"నా పేరు మాయ. మాది చాలా పేద కుటుంబమండి. నేను ఎమ్. ఎ. తెలుగు పాస్ అయ్యాను. టైపింగ్ వచ్చు. ఇక్కడ తిల్లారాం పెల్లారాం కంపెనీలో ఇంటర్వ్యూకి వచ్చాను. రిక్షావాడు మోసం చేసి నా బ్యాగుతో పారిపోయాడు. అందులో నా సర్టిఫికెట్సు అన్నీ, డబ్బు వుండిపోయాయి. గుడ్డిలో మెల్లగా నా పెట్టె, అందులో నాలుగు చీరలు నా వద్ద వుండిపోయాయి. అది ఒకరింట్లో పెట్టి ఏం చెయ్యాలా అని ఆలోచిస్తుంటే ఎవరో ముసలాయన కనబడారండి. చాలా మంచివాడు. నేను బెరుకుగావుంటే అదీ ఇదీ అడిగి మీ సెక్రటరి కొన్ని రోజులవరకూ రారని, ఆ వుద్యోగం కోసం ప్రయత్నించమని చెప్పారండి. ఆయనపేరు పురుషోత్తమరావు....' అంటూ ఎడాపెడా అబద్ధాలు చెపుతూ మధ్యలో ఆగి "అదుగోండి ఈయనేనండి ఆయన. మీరు ఇక్కడే వుంటారాండి?" అంది రాధ అప్పుడే గోపాలాన్ని చూసినట్లు నటిస్తూ.

గోపాలం తాడినెక్కిన వాడు తన తలను తన్నిన వాడిని చూసినట్లు రాధను చూస్తూ వుండిపోయాడు. ఇప్పుడు తను రాధ చెప్పింది కాదంటే ఎవరికీ తెలియకుండా పడుచు పిల్లతో స్వతంత్రించి చనువుగా మాట్లాడే ముసలి నక్కగా అందరి దృష్టిలో తనకో ముద్ర పడుతుంది.

అందుకనే "ఇందాకటి నుంచి చెప్పవేమిటండి మీ రికమండేషన్ అని?" అని రంగనాధరావు అన్నా ఏం మాట్లాడలేదు గోపాలం.

రమేష్ తల వూపుతూ ఎవరూ చూడకుండా కన్ను గీటాడు.

"....దాంతో నాకు ధైర్యం వచ్చింది. మీరు వచ్చేవరకూ వెయిట్ చేసి మిమ్మల్ని కలిశాను. నాకు ఆ వుద్యోగం జీవనాధారం అవుతుంది. దయచేసి అది నాకు ఇప్పించాలి. ఇది టేబులుకాదు మీ కాళ్ళు అనుకోండి." అంది రాధ ఎదురుగా వున్న టేబులును తాకుతూ.

"ఎంత మాటా? కానిచూడు అమ్మాయి. నువ్వు ఎమ్.ఎ. చదివావని నాకు నమ్మకం ఏమిటి చెప్పు. ఇట్లా అంటున్నానని ఏమి అనుకోకు" అన్నాడు రంగనాధరావు.

రాధ మాట్లాడే లోపల ఎత్తుకున్నాడు రమేష్. రమేష్ ఇంకోలా ఆలోచిస్తున్నాడు. మాయ అందంగా వుండటం, గోపాలం మాయని రికమెండ్ చెయ్యటంతో మాయ మీద గోపాలానికి ప్రేమ వుందని, తన ప్రేమ సఫలం చేయటానికి గోపాలం కష్టపడుతుంటే తనూ గోపాలంకి సహాయం చెయ్యాలని రమేష్ అభిప్రాయం. అందుకనే మాయకు ఎట్లాగయినా సెక్రటరీ వుద్యోగం ఇప్పించాలి అని కంకణం కట్టుకున్నాడు. భానుమతికూడా రమేష్‌లా ఆలోచించింది.

అందుకనే "రాధగారు తెలుగు ఎమ్.ఎ చదివారు నాన్నగారు. ఆవిడని పరీక్షించి చూడమంటే సరిపోతుందికదా?" అని రంగనాధరావుతో అని భానుమతితో "రాధగారూ ఏమన్నా ప్రశ్నలు అడగండి" అన్నాడు రమేష్.

భానుమతి ఆలోచించి ప్రీవియస్‌లో సబ్జెక్టులు ఏమిటి, ఫైనల్‌లో ఏమిటి అంటూ అడగ సాగింది. గోపాలం మిరియంపొడి ముక్కులో పడ్డట్లు బాధపడ సాగాడు.

రమేష్ అమదానంద కందళిత హృదయార విందుడు అర్థం వివరించి చెప్పమన్నాడు.

రాధ వివరించి చెప్పసాగింది. తప్పో, ఒప్పో తెలియని రమేష్, భానుమతి అద్భుతం అన్నారు.

"మీరు తెలుగు లెక్చరర్ అయితే

బాగుంటుంది" అంది భానుమతి రాధతో.

"థాంక్సు!" అంది రాధ.

రంగనాధరావు ఆడపిల్లవి అంటూ ఏవో అభ్యంతరాలు చెప్పబోయేడు. రమేష్ అంతర్జాతీయ మహిళా సంవత్సరం, ఆడా మగా సమానం. అంటూ తోసి పారేశాడు.

"సరే నమ్మాయి! నిన్ను తీసుకోవటానికి నాకు అభ్యంతరంలేదు. కాని నువ్వు ఆ పనిలో నెగ్గుకు రాగలవా అన్నది నాకు తెలియదు. కాబట్టి ప్రస్తుతం జీతం గురించి మాట్లాడకు. నాలుగు రోజులు పనిచేసి కంటిన్యూ చెయ్యగలవంటే అప్పుడు చూసుకుందాం. సరేనా?" జీతం గురించి అతిధులముందు బేరం ఆడటం రంగనాధరావుకి ఇష్టంలేదు. అందుకనే వాయిదా వేశాడు.

తల వూపింది రాధ.

"మాయగారు చాలా అమాయకురాలు లాగా వున్నారు. బయట వుండటం అదీ అయితే ఇంకా ఎన్ని మోసాలు చూడవలసి వస్తుందో? నాన్నగారూ, ఇక్కడే వుండమందాం! దేనికీ ఇబ్బంది వుండదు" గోపాలంకి సహాయం చేద్దాం అన్న తాపత్రయంతో అన్నాడు రమేష్. అని నన్ను మెచ్చుకో అన్నట్లు గోపాలం వంక చూశాడు.

"ధైర్య సాహసాలకి తెలివి తేటలకి ప్రమీల అవార్డు లాంటిది ఇస్తే అది ఈ పిల్లకివస్తుందిరా. అమాయకురాలుఅంటావు ఏమిట్రా గుడ్లగూబ వెధవా!" అనుకున్నాడు మూగ ప్రేక్షకుడుగా వున్న గోపాలం.

రంగనాధరావుకి ఒప్పుకోక తప్పింది కాదు. "సరే! బాగుంది! నీ పెట్టె అవీ తెచ్చుకో! మర్చిపోయాను. నిన్ను రికమెండ్ చేసిన ఆయన్ని నీకు పరిచయం చెయ్యక్కరలేదు అనుకుంటాను. అయినా ఆయన జ్యోతిష్యరత్న పురుషోత్తమరావు. అదుగో ఆ అమ్మాయి రాధ అని వారి అమ్మాయి. మనింట్లో వీరిద్దరూ కొన్ని రోజులు అతిధులు. ఇకపోతే వాడు మా సుపుత్రుడు డాక్టరు రమేష్", అన్నాడు రంగనాధరావు పరిచయాలు చేస్తూ.

"థాంక్సండి! మీరు చేసిన సహాయం మరువలేను. ఇది తెలిస్తే మా అమ్మ చాలా సంతోషిస్తుంది. అన్నట్లు మా అమ్మ గుడ్డిది సార్!" అంది రాధ బాధతో.

"మరే! మీ తమ్ముడు మూగవాడు మీ చెల్లెలు కుంటిది కదూ" అన్నాడు గోపాలం కసిగా.

"అరె పాపం! రమేష్ నువ్వు ఆ అమ్మాయిని కారులో తీసుకువెళ్ళు. మళ్ళీ రాత్రి ఒంటరిగా ఆడపిల్ల రావటం కష్టం" మాయ కుటుంబం గురించి విన్నాక రంగనాధరావు మనసు నిజంగా మెత్తబడింది.

"ఇన్నాళ్ళూ ఈ ఆటలో నేను రాజును అనుకున్నాను. ఇప్పుడు తెలిసింది నువ్వు మహారాణివి, మేము ఆఫ్ట్రాల్ నీ భృత్యులం" అనుకున్నాడు గోపాలం వెళ్ళిపోతున్న రాధను చూస్తూ.

* * *

"గురూగారూ! గురూగారూ!"

"ఎవరు మీరు?"

"మేం పాఠకులం! మాది చిన్న ప్రార్ధన."

"ఏమిటది?"

భానుమతిని అందరూ రాధ అంటున్నారు రంగనాధరావు ఎదుట. అసలు రాధ కూడా అదే సీనులో వుంటే ఇద్దరు రాధలతో కన్‌ఫ్యూజింగ్‌గా వుంది.

"అందుకని?"

దీపావళి శుభాకాంక్షలతో

ఈస్ట్ ఇండియా కమర్షియల్ కం., (ప్రై) లిమిటెడ్

లెస్సీ : శ్రీ కృష్ణా జూట్ మిల్స్ లిమిటెడ్


ఏలూరు (ఆంధ్రప్రదేశ్)

అన్ని రకములైన సంచులు మరియు పురికొస తయారీదారులు

హెడ్ ఆఫీసు : 38, నేతాజీ సుభాస్‌రోడ్, కలకత్తా-1.

టెలిఫోనులు : ఆఫీసు : 22-0737, 0738, 0739, రెసి : 454123, 454124.

ఏలూరు : ఆఫీసు : 37, 441, రెసి : 182, 853.



"అందుకని భానుమతిని రాధ భాను మతి అన్న పేర్లతో రాస్తూ అసలు రాధ. ఎట్లాగో మాయ పేరు చెప్పుకుంది కాబట్టి మాయ పేరుతో రాయ ప్రార్థన."

"మీరు చెప్పిందీ బావుంది. సరే! అట్లాగే చేద్దాం!'

* * *

"మొత్తంమీద నువ్వు ప్రేమలోపడ్డావు. ఈ మాయ...."

"బాబూ! మాయ కాదురా చవటాయి. రాధరా" అన్నాడు గోపాలం.

"బాగానే వుందండి! మీ పేరు గోపాలం కాబట్టి ఆ అమ్మాయిపేరు రాధ చేస్తారా? మాయ అనే పేరు బాగుంది." అంది భాను మతి.

కల్లు తాగిన కోతి నిప్పు తొక్కితే లేక నిప్పు తొక్కిన కోతి కల్లు తాగితే ఎట్లా వుంటుందో ఇద్దరికీ ప్రదర్శించి అసలు విషయం చెప్పాడు గోపాలం.

"మరి ఇంత తెలిసి ఆ అమ్మాయితో ఇక్కడ సెక్రెటరీ పోస్టు ఖాళీ అని ఎందుకు అఘోరించావు!" అన్నాడు రమేష్.

"ముందు మీ నాన్నగారిలా పోజుకొట్టి తరిమాను. తరువాత అంత పెద్ద నాటకం ఆడి నన్ను వెర్రి వెంగళాయిని చేసింది" వివరించాడు గోపాలం.

"ఎన్నెన్ని తెలివి తేటలు?" ఆశ్చర్య పోయాడు రమేష్.

"ఆవిడ వేషం వెయ్యటానికి కూడా నాకు అర్హతలేదు" అంది భానుమతి.

"కొంపతీశావు రమేష్ నువ్వు! నేను తెలుగులో ఎమ్. ఎ అని చెప్పావు. రేపు ఏ అమదానందలాంటిదో మీ నాన్నగారి ఎదురుగా అడిగితే చస్తాను."

"చూస్తుంటే ఆ అమ్మాయి మన బండారం బయటపెట్టడానికి వచ్చినట్లు లేదు. లేకుంటే పోలీసులతోనే వచ్చేది" అన్నాడు గోపాలం.

"అవును మా నాన్నగారికి సెక్రటరీ లేని కొరత తీర్చటానికి వచ్చింది!" అన్నాడు రమేష్ వెక్కిరింతగా, "నీ ప్లాన్‌కు నా జోహార్లు రా బాబూ!"

"అయ్యో అంటావేమిటి రమేష్? గోపాలంగారి ప్లాన్ లేకపోతే హను మంతం నీ భుజాల మీద వుండేవాడు. తెలుసుకో! ఇప్పుడు నిజం తెలిస్తే పట్టుబడేది మేం ఇద్దరం. నీకు తెలియదని తప్పించుకోవచ్చు నువ్వు." అంది భాను మతి.

"సరే నమ్మా! పొరపాటైంది. నాయనా గోపాలం! నీ బుర్ర పెద్దది. దీనికి ఏదన్నా వుపాయం ఆలోచించరా?"

"ఆగు! ఆలోచిస్తున్నాను!"

"ఒరేయి! ఎవడురా?" ఆ నాంపల్లి స్టేషన్‌లోని నీ ఫ్రెండ్! ఎవడురా ఆ తల మాసిన సన్యాసి? తండ్రి కూతుళ్ళు ఇద్దరూ వున్నారు పురుషోత్తమరావు. రాధ-ట్రెయిన్ నాంపల్లి వదిలినప్పుడు అన్నాడు కదా? మరి బొంబే వెళ్ళిన రాధ ఇప్పుడు ఎట్లా తిరిగి వచ్చింది?"

"రమేషం! నీ నోరు కొంత తగ్గించు. అట్లాంటివి నాకు లక్ష తొంభై సందేహాలు వున్నాయి. నాకూ నోరుంది—నీకన్నా పెద్దది కూడా! అయినా అరుస్తున్నానా? ఆలోచించరా ముందు!"

"తండ్రి వేషం వెయ్యగానే నీకు తండ్రి డైలాగులు వచ్చాయిరా!" అన్నాడు రమేష్ నవ్వుతూ.

"ఆగు రమేష్ ఐడియా తట్టింది." అని ఆగింది భానుమతి.

ఏమిటి అని ఇద్దరూ అడిగారు.

"మాయ ఎట్లాగో ఆడది. అందులో ఇంట్లోకి కొత్తగా వచ్చింది. కాబట్టి నేను మాయను అంటుకు తిరుగుతాను. మాట లలో పెట్టి అసలు విషయం రాబట్టగలను. మాయ ఇక్కడకి రావటానికి గల కారణం తెలియకపోదు."

రమేష్ "ఆహా! అద్భుతం? బ్రహ్మాండం ఒరేయి గోపాలం! ఆ కిటికీలో అదేమిటి?" అంటూ, గోపాలం అటు చూడ గానే భానుమతిని దగ్గరగా తీసుకుని బుగ్గల మీద మృదువుగా ముద్దు పెట్టుకున్నాడు. గోపాలం తన వెనక ఏదో ప్రేమకలాపం జరిగింది అని తెలుసుకునే లోపల ఇద్దరూ దూరంగా జరిగారు.

మర్నాటినుండి భానుమతి ప్లాన్ అమలు చెయ్యటానికి నిశ్చయించుకోవటంతో ఆ రహస్య సమావేశం ముగిసింది.

మాయ భయపడిపోయింది. మీరు కిటికీలోంచి ఎవరో మాట్లాడుతున్న మాటలు రహస్యంగా వింటున్నప్పుడు ఆ మాటలు మాట్లాడుతున్న వారిలో ఒకరు హఠాత్తుగా కిటకీలో ఏదో వుంది అంటే మీరుకూడా మాయలాగా ఒక్క పరుగున గదిలోకి వెళ్ళి భయపడిపోతారు.

* * *

హనుమంతం వాళ్ళ వూరికి వెళ్ళి రెండు రోజులు అవుతుంది. హనుమంతం గొప్పతనాన్ని గురించి అదివరకే చెప్పు కొన్నాం. అటువంటివారు ఓ ఇద్దరు కలిసి తనను పిచ్చివాడు అంటే నమ్మి గాజులు తొడుక్కుని కూర్చున్నాడంటే అతనికి, మిగతా వారికి తేడా ఏమిటి? అతన్ని గురించి ఈ రచయిత చెప్పిందంతా అబద్ధమా అన్న అనుమానం పాఠకులకు రావచ్చు. హనుమంతం మౌనవ్రతానికి

# దేవదాసు మళ్ళీ పుట్టాడు!!

శశిధర



సమయం : 1976వ సంవత్సరంలో ఏదో ఒక నెల।
స్థలం : భారతదేశంలో ఏదో ఒక ఊరు (ముఖ్యంగా ఉత్తర భారద్దేశం అయితే మంచిది)

దేవదాసు ప్రేమకథ ట్రాజిడి కాకుండా "కామెడీ" చేయాలన్న పట్టుదలతో యమ ధర్మరాజు దేవదాసుకి తిరిగి భారతదేశంలో పుట్టేందుకు పర్మిషన్ గ్రాంటు చేశాడు. అలా.... దేవదాసు మళ్ళీ పుట్టాడు.... పోతే....



దేవదాసు కష్టపడి పార్వతిని కలుసుకోగలిగాడు. అతన్ని తిరిగి చూసిన పార్వతికి "ఏదైనా సినిమాలో వేషంగాదు కదా"ని రవంత సేపు అనుమానం వొచ్చినా, నిజ వని తెలిసి, సంతోష పడింది "ఈసారేనా నన్నొదిలిపోకు దేవదా" అంది దీనంగా.



"బాధపడకు పారూ। గత జన్మలో మా నాన్న మనల్ని విడదీశాడు. ఈమారు ఎవ రొచ్చినా మనల్ని వేరు చేయలేరు. మన కథ "కామెడీ" కాబోతుంది, ఇహనుంచీ దేవదాయే పారు, పారే దేవదా।" అన్నాడు.

కారణం వుంది. అసలు తెలివి గలవారు ఎవరైనా మంచి కారణంలేకుండా మౌన వ్రతం చెయ్యరు.

రంగనాధరావు హనుమంతాన్ని తన్ని తగలేశాడు. తంతే హేమమాలిని ఒళ్ళో పడ్డట్లు అయ్యింది హనుమంతం పని. బిస్సులో హనుమంతానికి తమ వూరికీ అందులో తమ ఇంటికి ఎదురుగావున్న పెద్ద మేడకు రాబోతున్న ఓ యంగ్ రిచ్ బ్యూటిఫుల్ విడో పరిచయ మయింది. హనుమంతం 'ఓం గిరీశాయనమః' అను కుని చొరవతీసుకుని ఆ పరిచయాన్ని బిస్సు దిగేలోపల ఇంకేదో చేశాడు. ఆ మరునాడు ఆవిడని ఒంటరిగా కలిసిన అతనికి ఐహిక విషయాలు మాట్లాడి కాలం వృధా చెయ్య బుద్ధికాలేదు. రెండు రోజులలో ఎంతో ఎత్తుకు పెరిగిన తమ ప్రేమ వృక్షాన్ని చూసి హనుమంతం, ఆవిడ(తో) ఇంకో రెండు రోజులలో తనతో లేచి రావటం గ్యారంటీ అనుకున్నాడు. హైదరాబాద్‌లో మూడేళ్ళు కష్టపడి పది వేలు కూడా మిగల్చ లేకపోయాడు. ఇప్పుడో। దాదాపు యాభై వేలు రావటం నిశ్చయం.

ఆ అనివార్య కారణం వల్ల హను మంతం లేకుండానే మన కథ నడవాల్సి వస్తుందేమో।

ఆ మరునాడు—

గోపాలంతో రంగనాధరావు తన గురువుగారి గురించి (అదే పురుషోత్తమ రావు శిష్యుడి గురించి) మాట్లాడుతూ వున్నట్లుండి "నా నాలుగో ఇంట్లో రాహువు వున్నాడు మరి నేను కలప వ్యాపారం చేయవచ్చా?" అని అడిగాడు.

గోపాలం మతిపోయింది. తను చదివిన పుస్తకాలలో కలప వ్యాపారానికి, నాలుగో ఇంట్లో రాహువుకి సంబంధం వున్నట్లు ఎక్కడా చదవలేదు. అయినా పురుషోత్తమ రావుని గుర్తు తెచ్చుకుంటూ "మీకు సీ.వి. రామన్ తెలుసా?" అన్నాడు.

"ఆయనకి నాలుగో ఇంట్లో రాహువు వున్నా కలప వ్యాపారం చేశాడా?" అన్నాడు రంగనాధరావు పుత్సాహంగా.

అదేనండి।'సి వి సర్ రామన్ తెలుసా?' అన్నాడు గోపాలం కర్ణాటక సంగీతం వింటున్నట్లు చిటికెలు వేస్తూ.

"తెలుసు అంటే పరిచయం లేదు. విన్నాను. తమరికి!"

"ఒకసారి ఆయనని ఎక్కడో కలిశాను ఎక్కడబ్బా?" గోపాలం బుర్ర గోక్కోసాగాడు.

"బెంగుళూరులో!" అందించాడు రంగనాధరావు.

"బెంగుళూరా? అక్కడ కాదు?"

"మద్రాసులో!"

"మ ద్రా సు. ఊ! మ ద్రా సు. ఆ హా! మద్రాసు కాదు."

ఇంకో ఏడు పేర్లు చెప్పి ఏడుపుమొహం పెట్టాడు రంగనాధరావు. ఇంకా ఆయనని బాధ పెట్టటం ఇష్టం లేక గోపాలం "ఆగండి! ఆగండి! గుర్తుకు వచ్చింది. బెంగుళూరులో కలిశాను. ఎవరిని? అదే సివి సర్ రామన్‌ని" అని ఒక్క నిముషం రంగనాధరావు మొహంలో మారిన భావాలు చూసి మొదలుపెట్టాడు. అప్పుడు ఆయన పుట్టిన రోజు. జన్మనక్షత్రం వగయిరా కనుక్కుని న్యూమరాలజీ ప్రకారం ఆయనకు ఏ సంవత్సరంలో నోబెల్ ప్రయిజు వచ్చిందో చెప్పాడు. ఇంకొకడు ఇంకొకడు చెప్పివుంటే నమ్మేవాడు కాదు— "పేపర్లలో చదివిచెప్పారు అనుకునేవాడు. నా మతిమరుపు సంగతి తెలుసుకదా? "పేపరులో చదివినా ఈ ముండావాడికి గుర్తుపుండదు. కాబట్టి శాస్త్రప్రకారం చెప్పాడు" అనుకున్నాడు. నా దగర నేర్చుకోవాలని చాలా ఇదయిపోయాడు. కాని ఈలోగా ఆయన విశాఖపట్నం వెళ్ళిపోవటం, నేను చచ్చిపోవటం జరిగాయి."

చివరి వాక్యాన్ని దిద్దబోయి ఆగిపోయాడు రంగనాధరావు. ఆయనలో గోపాలం రాకముందువున్న వుత్సాహంలో పదో వంతు కూడా లేదు ఇప్పుడు.

అదే సమయానికి భానుమతి మాయ గదిలోకి వెళ్ళింది.

"అబ్బా! ఏం తోచటం లేదు! బోర్ కొడుతుంది!" అంది భానుమతి ఎక్స్‌ప్లనేషన్ ఇస్తున్నట్లు.

"రండి! కూర్చోండి!" అంది మాయ మంచం మీద భానుమతికి చోటు ఇస్తూ.

భానుమతి ఏం మాట్లాడాలా అని ఆలోచించ సాగింది.

"మిమ్మల్ని నేను అదివరకు చూశాను" అంది మాయ.

భానుమతి గతుక్కుమంది. తనని చూసిందిట. అంటే తన పేరు భానుమతి అని కూడా తెలుసా? భానుమతి మాట్లాడకుండా తల వంచుకుంది.

మాయ మాట్లాడలేదు. ఒక నిముషం ....రెండు నిముషాలు గడిచాయి. భానుమతి అతి ప్రయత్నం మీద తల ఎత్తి మాయ వంక చూసింది. మాయ మొహం అదోలా వుంది—ఎట్‌లీస్ట్ అదోలా వున్నట్లు భానుమతికి అనిపించింది. కళ్ళు జీవంలేనట్లు, చూపులు చల్లగా కంపరం పుట్టించేంత చల్లగా వున్నాయి. భానుమతి సన్నగా వణకసాగింది. పిచ్చినవ్వు నవ్వి "ఎక్కడ చూశావు?" అంది. అడిగాక ఎందుకు అడిగానా అని అనుకుంది. మాట్లాడకుండా బయటకి వెళ్ళిపోతే బాగుండేది అని అనుకుంది.

మాయ లేచి భానుమతి ఎదురుగా నిలబడింది. భానుమతి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ చెప్పసాగింది. "విజయవాడలో చూశాను మిమ్మల్ని. మీ యూనివర్సిటి లేడీస్ అంతా సోషల్‌వర్క్ ప్రోగ్రాంకి వచ్చారు అవునా?"

"అవును వచ్చాం!" అంది భానుమతి ఏమనాలో తెలియక.

"అప్పుడు మనద్దరినీ చూసి మా ఫ్రెండ్సంతా కవల పిల్లలు లాగా వున్నారు అన్నారు. మీ నాన్నగారి స్నేహితుడు.... పేరు గుర్తుకు రావటం లేదు.... నేనే పురుషోత్తమరావుగారి అమ్మాయిని అనుకుని పొరపాటుపడ్డాడు."

భానుమతికి కంగారు పట్టుకుంది. ఎందుకనో నెర్వస్ అయిపోసాగింది. "నేను వెడతాను!" అంది లేచి నుంచుంటూ.

"వీల్లేదు, మీరు కూర్చోండి!" అంది మాయ గట్టిగా.

భానుమతి టక్కున కూర్చుండిపోయింది. కూర్చున్నాక తను ఎందుకు ఎదురు చెప్పలేకపోతున్నది, తనని మాయ హిప్నటైజ్ చేస్తున్నదా అని అనుకుంది.

వున్నట్లుండి మాయ కళ్ళు పెద్దవి అయ్యాయి. భానుమతి మీదగా ఒంగి భానుమతి పైట లాగింది. ఇక్కడే ఇక్కడే అంటూ పొడవయిన వేళ్ళతో భాను మెడ చుట్టూ తడమసాగింది. గొంతు పిసుకుతున్నదా అన్న భయంతో మాయ వంక చూసింది భానుమతి. నిజమో భ్రమోకాని డ్రాకులా లా కనిపించింది మాయ. "లేదు. పుట్టుమచ్చలేదు" అంటున్నది మాయ.

మాయ చేతులు రెండు మొండి ధైర్యంతో వెనక్కినెట్టి "నేను పోతాను" అని లేచింది భానుమతి. గబగబా మాయను దాటుతున్నప్పుడు చూసింది- మాయ మెడ పక్కన పావలా కాసంత పుట్టుమచ్చవుంది.

భానుమతి వెళ్ళిపోయాక మాయ నవ్వుకుంది - పాపం ఎక్కువగా భయపెట్టినట్లున్నాను అనుకుంటూ.

* * *

"రమేష్! ఇది భరించలేను ఆ మాయ...."

"ఏమిటండి రాధగారూ?" అన్నాడు రమేష్.

భానుమతి నాలిక కరుచుకుని చుట్టూ చూసింది. వెంకయ్య కాఫీ పట్టుకుని వస్తున్నాడు.

వెంకయ్య వెళ్ళిపోయాక అన్నాడు "ఏమిటి అంత కంగారు? ఎవరు వున్నారో చూసుకోవద్దా?"

"కాదు రమేష్! ఆ అమ్మాయికి పిచ్చి నిశ్చయంగా! లేకపోతే మేం మోసగాళ్ళమని తెలిసికూడా ఎందుకు వూర్కుంది? నూటికి నూరుపాళ్ళు పిచ్చిది. ఇప్పుడు నన్ను గొంతు నులిమి చంపి వుండేది కొంచెం వుంటే!"

"ఏమయ్యింది?" కంగారుగా అడిగాడు రమేష్.

* * *

"అదోయి కథ!" అన్నాడు రమేష్.

"భానుమతి అనవసరంగా కంగారు పడిందని నా అభిప్రాయం" అన్నాడు గోపాలం.

"అవును. నేనూ అదే అనుకుంటున్నాను. కాని భాను ఎదుట అది అనకు."

"సరే, మన ప్లాన్ మొదటిలోనే బాతుపాదో, హంసపాదో వేసింది. అన్నట్లు రమేష్ రేపు నేను ఆవిడని వాచ్ చేస్తాను. భానుమతి ఆడది కాబట్టి భయపడ్డది. కాని నేను...."

"మరి నాన్నగారు ఇంట్లోనే వుంటారుగా? ఎట్లా?"

"లేదులే! ఇవాల్టితో ఆయనకు కంగారు పట్టుకుంది. రేపు ఏదో పనుందని నాతో గడప లేనందుకు బాధ పడుతున్నానని చెప్పారు. రేపు ఆ అమ్మాయి ఇంట్లో వుంటే పురుషోత్తమరావులా బయటకి వెడితే మారువేషంలో వెంటబడతాను.

# దేవదాసు మళ్ళీ పుట్టాడు!!



"మా డాడీని కలిసి నిలదీసి ఖచ్చితంగా అడిగేస్తాను, ఈ సారేనా మా పెళ్ళి చేస్తావా లేదా? అని."

"ఒప్పుకున్నాడా సరేసరి.... లేదా తక్షణం ఇద్దరం రిజిష్టరు మేరేజీ చేసుకుని కాశ్మీరుకి హనీమూన్‌కి చెక్కేద్దాం. ఓకే.... ఇదో ఇప్పుడే డాడీ దగ్గరికి వెళ్ళిపోతున్నాను...." అంటూ ఒక్క క్షణం కూడా ఆక్కుండా వెళ్ళిపోయాడు దేవదాసు.



అతగాడి తండ్రి దేవదాసుని జూసి బోలెడంత ఆశ్చర్యపోయి, తదనంతరం ఆనంద పడిపోయాడు. "ఇది కలా, సినిమాయా లేక నవలల్లో సీనా? నాకు బోలెడంత ఆనందంగా ఉంది దేవదా" అన్నాడు.

"కానీ నాకేమాత్రం ఆనందంగా లేదు" అన్నాడు దేవదాసు వెంటనే.



"గత జన్మలో మమ్మల్నిద్దర్నీ విడదీసినందువల్ల ఏం లాభం వచ్చింది (మన నవల పేరొచ్చి బాగా అమ్ముడవడం తప్పించి, తెలుగు దేశంలో రచయితలు బోలెడన్ని కాపీ నవల్లు తయారుచేయగలగడం తప్పించీ....)" అని ఇంకా ఇలా అన్నాడు దేవదా, "ఇన్ని మాటలెందుకు, ఈసారైనా మా పెళ్ళి జరిపిస్తావా లేదా?"

తలమీద బొచ్చుటోపి. కళ్ళకి గాగుల్స్, గురూ షర్టు వేసుకుంటే వేషం మారిపోతుంది ఏమంటావు?"

"ఏమీ చెయ్యకుండా వుండటంకంటే ఏదో ఒకటి చెయ్యటం నయం కదా?" చూద్దాం దీనివల్ల ఏమన్నా లాభం వుంటుందేమో" అని అన్నాడు రమేష్.

* * *

గోపాలం చెప్పిన మాట నిజమే! రంగనాధరావు పనిలేక పోయినా వుందని చెప్పి బయటకి వెళ్ళటానికి తయారు అవసాగాడు. ఆయనకు గోపాలంతో మాట్లాడుతుంటే చిన్నప్పటి పరీక్షలలోని ఫిలప్‌ది బ్లాంక్స్, కరెక్టుది సెంటెన్సెస్ గుర్తుకు వస్తున్నాయి. ఆయన వాలకంచూసి రాగల ఇరవై నాలుగు గంటలలో ఆయన గోపాలంతో చెదురు మదురుగానయినా మాట్లాడే అవకాశాలు చాలా తక్కువని రమేష్. గోపాలం గ్రహించారు.

రంగనాధరావు బయటకి వెడుతుంటే మాయ అడిగింది "నేను కూడా రావాల్సిన అవసరం వుంటుందా సార్!"

"అక్కర్లేదమ్మా!" అన్నాడు రంగనాధరావు. ఆయనకి మాయతో మాట్లాడుతున్నా తన టేబులు మీద వున్న గాంధిగారి మూడు కోతుల బొమ్మను చూస్తున్నా మాయ గుడ్డి తల్లి, కుంటి చెల్లి, మూగ తమ్ముడు గుర్తుకు వస్తున్నారు.

"వుత్తరాలు టైపు చెయ్యటం అయిపోయింది. పనులు ఏమీలేవు కాబట్టి నా పనులు చూసుకోవటానికి రెండు మూడు గంటలు బయటకి వెడదాం అని అనుకుంటున్నాను. వెళ్ళమంటారా."

రంగనాధరావు ఏదో చెప్పబోయాడు. చాటునించి గోపాలం ఈ సంభాషణ వింటున్నాడు. మాయ చెప్పిన ఈ ప్రయాణాన్ని కనక ఫాలో అయితే మాయ ఇక్కడకి ఎట్లా వచ్చింది? మాయకి ఎవరి మదత్తువుంది? అన్ని విషయాలుతెలుస్తాయి అనిపించింది. నానుస్తున్న రంగనాధరావుని చూస్తే గోపాలానికి ఒళ్ళు మండిపోయింది. అందుకనే చాటు నించి బయటకి వచ్చి "రంగనాధరావుగారూ! సివి సర్ రామన్‌ని ఎక్కడ కలుసుకున్నానని చెప్పాను?" అన్నాడు.

రంగనాధరావు "బెంగుళూరులో!" అంటూ కంగారుగా జవాబు చెప్పి మాయ వంక హడావిడిగా తిరిగి "నీ ఇష్టం అమ్మా!" అని ఇద్దరి వంక చూసి "వెళ్ళొస్తా" అంటూ గబగబా జీపులోకి వెళ్ళాడు.

మాయ గోపాలం వంక తిరిగి "నమస్కారమండి పురుషోత్తమరావుగారూ!" అంది ఎత్తిపొడుపుగా! గోపాలం జవాబు ఇచ్చేలోగానే రాధ లోపలికి వెళ్ళింది.

రాధ మళ్ళీ బయటకి వచ్చేటప్పటికి పది నిముషాలు పట్టింది. ఈ పది నిముషాలలో పాంటు, గురూ షర్టూ, గాగుల్సు! బొచ్చు టోపితో గోపాలం బస్ స్టాపుకి వెళ్ళిపోయాడు.

రాధతో పాటు బస్సులో ప్రయాణం చేసి రాధతోపాటు మార్కెట్‌లో దిగాడు. "అమ్మయ్యా ఇంతసేపు మిస్ చెయ్యలేదు- అనుకున్నాడు గోపాలం. కాని ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఎందుకంటే మాయ బట్టల కొట్లోకి వెళ్ళింది. ఆడవాళ్ళ జీవితంలో మొగుణ్ణి ఎంచుకోవటం కంటే చీరను, దానిమీద మాచింగ్

జాకెట్ గు ఎంచుకోవటానికి ఎక్కువ సమయాన్ని. ప్రాధాన్యతని ఇస్తారని భానుమతితో షాపింగ్ చేసి వచ్చిన మొదటి రోజున రమేష్ గోపాలంకి చెప్పాడు.

గోపాలం బయట నిలబడి నిరీక్షించ సాగాడు. అరగంట అయింది .... గంట అయ్యింది. మాయ బయటకి రాలేదు. కొంప తీసి డిటెక్టివ్ పుస్తకాలలో లాగా షాపుకి వెనకాల నుంచి దారి వుంది కాబోలు అని షాపులోకి వెళ్ళబోయాడు. కాని అదే క్షణాన మాయ చేతిలో పాకెట్ తో బయటకి వచ్చింది. తల వంచుకుని నడవ సాగింది. గోపాలం మాయను పది గజాల దూరంలో అనుసరించ సాగాడు. మాయకు ఎవరన్నా వెంబడిస్తున్నారన్న అనుమానమే వున్నట్లులేదు. గోపాలంకి ఇంకా సందేహం వచ్చింది. మాయ తన సహాయకారులను ఆ బట్టలకొట్లోనే కలుసుకుందేమో అని.

మాయ సరాసరి పోస్టాఫీసు వేపు నడిచింది. గోపాలం గుండెలు ఆనందంతో గబగబా కొట్టుకున్నాయి. మాయ రహస్యం తెలిసిపోతున్నది అనుకున్నాడు.

గోపాలం పోస్టాఫీసులోకి వెళ్ళేటప్పటికి మాయ అప్పుడే కొన్న కవరుమీద అడ్రెసు రాస్తున్నది. గోపాలం జాగ్రత్తగా మాయ వెనకాలేవెళ్ళి అడ్రెసు చూశాడు- పురుషోత్తమరావు....కళ్యాణ్ అన్నవి మాత్రం కనిపించాయి. మాయ హేండ్ బాగ్ లోంచి ఓ కాయితంతీసి కవరులోపెట్టి, కవరు అతికించింది. మాయ వుత్తరాన్ని డబ్బాలో పడ వెయ్యటం చూసిన గోపాలంకి మాయను అనుసరించాలా లేక వుత్తరాన్ని సంపాదించాలా అన్నది తెలియ లేదు. క్లియరెన్సు టైము ఇంకో పది నిముషాలు మాత్రమే వుండటంతో వుత్తరం సంపాదించటం తెలివిగల పని అనుకున్నాడు.

ఇంకో ఇరవై నిముషాల తరువాత గోపాలం జేబులో వుత్తరంతో మొహం మీద విజయ గర్వంతో రంగనాధరావు ఇంటి హాలులోకి నడిచాడు.

వెంకయ్యా ఎదురు పడ్డాడు. "ఎవరు కావాలి సార్?" అన్నాడు.

"రమేష్ వున్నాడా?" అన్నాడు గోపాలం. "వీడు గుర్తు పట్టలేదంటే పర్వాలేదు. మాయ కూడా గుర్తుపట్టుండదు." అనుకున్నాడు.

"లేరు సార్! బయటకి వెళ్ళారు" అన్నాడు వెంకయ్యా.

గోపాలం ఏం చెయ్యాలా అని ఆలోచిస్తుంటే భానుమతి లోపలినించివచ్చింది. ఒక్క క్షణం గోపాలంని గుర్తుపట్టలేదు. అంతలోనే గ్రహించి "కూర్చోండి!" అని వెంకయ్యావంక తిరిగి "వెంకయ్యా! కాఫీ పట్టుకురా!" అంది.

వెంకయ్యా లోపలికి వెళ్ళాడు.

వెంటనే గోపాలం హడావుడిగా లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకున్నాడు. హాలు



"భక్తి"

చిత్రం : ఆర్. మల్లేశం, సిద్దిపేట

లోకి వచ్చాక భానుమతి అడిగింది. "ఎక్కడికి వెళ్ళారు?" అని.

గోపాలం జవాబు చెప్పేలోగా లోపల నించి వెంకయ్యా. బయటనించి మాయ వచ్చారు.

"ఇంతసేపా వెంకయ్యా కాఫీ తేవటం? ఆయన వెళ్ళిపోయారు" అంటూ ఒక కప్పు గోపాలంకి అందించింది భానుమతి. రెండో కప్పులోంచి సాసర్లో పోస్తూ "రండి ఫిఫ్టీ ఫిఫ్టీ" అంది మాయనుచూస్తూ.

"థాంక్సు" అంటూ భానుమతి పక్కన కూర్చుంది.

"షాపింగ్ చేసినట్లున్నారే?" అంది భానుమతి ధైర్యంగానే.

"అవునండి. చీర తీసుకున్నాను."

"చాలాసేపు పట్టినట్లుందే? ఎన్ని కొట్లు తిరిగారు?"

"వెళ్ళిన మొదటి కొట్లో చూసిన మొదటి చీర కొన్నాను."

"నిజంగా?"

"షాపులో మిగిలిన చీర లన్నిటితో ఈ చీరను పోల్చి చూశాకే అనుకోండి!" మాయతోపాటు భానుమతికూడా నవ్వింది.

మాయ పాకెట్ తీసుకుని లోపలికి వెళ్ళింది. మరుక్షణం రమేష్ ప్రత్యక్షం అయ్యాడు.

"ఏమయ్యింది గోపాలం?" అన్నాడు.

"సక్సెస్ రా బేటా! లోపలికి రా చూపిస్తా!"

ముగ్గురూ లోపలికి నడిచారు.

గోపాలం కవరు తీసి "ఇది మాయ పురుషోత్తమరావుకి రాసిన వుత్తరం. మీతో కలిసి చదవాలని ఇంతసేపు ఆగాను" అన్నాడు.

రమేష్ ఆతృతగా కవరు లాక్కుని చింపి కాయితం తీసి చదివాడు. చదివి స్తంభించిపోయాడు.

"ఏమిటి? అంత ప్రమాదకరమయిన వార్తా?" అంటూ గోపాలం ఆ కాయితం తీసుకున్నాడు. భానుమతి కూడా కుతూహలంగా వంగి చదివింది.

అందులో —

గోపాలంగారూ,

ఇతరుల వుత్తరాలు చదవటం తప్పు కాదూ?!

అని వుంది.

## 4

రెండుగంటల తరవాత—

"సీజరుతో పుట్టివుంటే క్లియోపాత్ర అయివుండేది. బ్రహ్మనాయుడుతో పుట్టివుంటే నాగమ్మ అయివుండేది" రమేష్ మాయ గురించి వర్ణన మొదలుపెట్టాడు.

"ఛట్! నోర్మూయ్! వెధవా! నా దగ్గర శత్రు కూటమిని పొగడకు" గోపాలం అన్నాడు.

"పొగడటమా? ఒరేయి! వున్నమాటని వంతపెట్టి భాగించి అంటున్నానురా! మాయ ఇక్కడకి ఎందుకు వచ్చిందో ఇంతైనా గ్రహించలేకపోయాం! మనం దద్దమ్మలంరా! తనుచూడు వచ్చి రెండు

రోజులు కాలేదు నీ బుద్ధి, నువ్వు చెయ్యబోయే పనులు, నీ పేరు, అన్నీ పసిగట్టేసింది. తెలివిరా! తెలివంటే అట్లా వుండాలి!"

"నిజమే, ఆవిడ గొప్పదే! కాని ఇప్పుడు ఆవిడ డప్పువాయిస్తూ కూర్చుంటే ఎట్లా?"

"అసలు తప్పుపని చెయ్యటమే తప్పు. తరువాత ఎన్ని తప్పులు చేయవలసి వస్తుందో!"

"పశ్చాత్తాపాలూ, అభిప్రాయ ప్రకటనలు తరువాయి మన తక్షణ కర్తవ్యం?"

రమేష్ ఆలోచించాడు "మనం ముగ్గురం కలిసి ఇందులో దూరాం. మీ యిద్దరూ దెబ్బ తిన్నారు. నేను మిగిలాను. నేను కూడా ప్రయత్నిస్తాను. నేనూ దెబ్బతింటే మనకి జరిగే నష్టంలేదు. ఎందుకంటె జరగాల్సిన నష్టం ఎప్పుడో జరిగింది. ఒకవేళ నేను పొరపాటున మాయ గుట్టు...."

"మనం ముందునించి అనవసరంగా తాపత్రయపడ్డాము అని ఇప్పుడు అనుకుంటున్నాను. మాయకి మన గురించి తెలుసు. సో వాట్? మాయ ఎవరితోనూ చెప్పటంలేదు. మన కసలు భయపడాల్సిన అవసరం అగత్యంలేదు. అటువంటప్పుడు ఆమె గురించి ఆరా తియ్యబోయి బోల్తా పడ్డాము. కాబట్టి మన ఆపరేషన్ మాయ ఇంతటితో ఆపుదాం. తను ఎందుకు వచ్చిందో చెబితే విందాం. లేకపోతేవద్దు. "The best way to treat any thing unusual is to ignore it అన్నారు" అన్నాడు గోపాలం.

"నీ బుర్ర ఇందాకటి షాకునుంచి తేరుకోలేదని నా అభిప్రాయం. ప్రగాఢకూడా చేర్చుకో! లేకపోతే 'ఆరంభింపరు నీచ మానవుల్..' అన్న పద్యం చదివినట్లు నువ్వు మర్చిపోయి వుండాలి. ఏమయినా నేను రేపటి నుంచి, మాయను చూసిన మొదటి క్షణం నుంచి ప్రేమిస్తున్నట్లు, భానుమతి అంటే ఇష్టం లేనట్లు నటిస్తాను."

"మాయకు నువ్వు నా పక్షం.. కాదు.. నేను నీ పక్షం అని తెలియదంటావా నీ పిచ్చిగాని? ఇప్పుడు నువ్వు బాకాబరోసా వేషం వేసినా బ్రౌన్ దొర వేషం వేసినా నీవన్నీ వెధవ వేషాలే అని తెలిసిపోతుంది."

"తెలియనీ! నువ్వు వేసిన పిచ్చిప్లానుల కన్నా ఇదేమన్నా తీసిపోయిందా? సొంతంగా ఒక ఉపాయం ఆలోచించాను అన్న తృప్తి నాకు వుంటుంది. నువ్వు చెప్పిన ప్రతి మాటకు తల వూపాను. ఇప్పుడు నేను చెప్తాను. నువ్వు తలవూపు. నువ్వు పిరికి వెధవ్వి. ఒక దెబ్బ గట్టిదే అనుకో. తగలంగానే అస్త్ర సన్యాసం చేశావు. అయినా Desperate ills need desperate remedies' అన్నారు. పైగా నేను రాజు కన్నా బలవంతుడిని - మొండివాణ్ణి."

గోపాలంకి ఒప్పుకోక తప్పలేదు.

"రేపటి దాకా ఎందుకు? ఇవాళ సాయంకాలం మాయను కారులో షికారు తీసుకువెడుతున్నాను" రమేష్ డిక్లేర్ చేశాడు.

* * *

"రాధగారూ!" మాయ హుషారుగా భానుమతి గదిలోకి వెళ్ళింది.

క్రితం రోజు భయం కొంచెం తగ్గటంతో భాను నవ్వుతూ పలకరించింది.

"చాలా మంచివార్త" అంటూ భానుమతి పక్కన కూర్చుంది.

"ఏమిటది?" అడిగింది భానుమతి.

"ఈ ఇంటికి వచ్చినప్పుడు నాకు నీడ దొరికిందనే అనుకున్నాను. కాని ఈ రోజు తెలిసింది. నాకు జీవితాంతమూ తోడు దొరుకుతున్నదని."

భానుమతికి అర్థం కాలేదు. "అంటే?"

"నేను ఆయనని ప్రేమిస్తున్నాను. ఆయన పేరు చెప్పలేను బాబూ, సిగ్గు వేస్తున్నది.... కూడా నన్ను ప్రేమిస్తున్నారు."

అడగకూడదు అనుకుంటూనే అడిగింది భానుమతి "ఎవరు?" అని.

"నేను చెప్పలేనండి! మరి....సాయంకాలం నన్ను షికారుకి తీసుకువెడుతున్నారు. మీరే చూడండి! మీకే తెలుస్తుంది"

మాయ వెళ్ళిపోయింది.

* * *

ఆ మర్నాడు ఉదయం....

రంగనాధరావు ఆఫీస్ రూమ్ లో కూర్చుని ఆలోచిస్తున్నాడు. మొహం అదోలా వుంది. అనుకోనిది. అనుకుంటేనే కంపరం ఎత్తించేది జరిగింది మరి. చేతిలోని కాయితం ఇంకోసారి చదివాడు అదే అర్థం.


మాయ లోపలికి వచ్చింది.

రంగనాధరావు టేబులు మీద వున్న మూడు కోతుల బొమ్మలను ఒకసారి చూశాడు. మాయ వేపు దృష్టి మరల్చి "మాయా! ఈ కాయితం నా టేబులు మీదకి ఎట్లా వచ్చింది!" అడిగాడు.

"నాకు తెలియదండి. కాని ఇందాక రాధగారు ఈ గదిలోంచి బయటకి రావటం చూశానండి!" మాయ ఒక నిముషం ఆగి మళ్ళీ అంది "ఎందుకో తెలుసుకోవచ్చా?"

రంగనాధరావు ఆలోచించి "ఇదుగో ఇది చదువు" అంటూ కాయితం ఇచ్చాడు.

మాయ కాయితం విప్పింది.



# దేవదాసు మళ్లీ పుట్టాడు !!



దేవదాసు తండ్రి దీర్ఘంగా నిట్టూర్చి ఇలా అన్నాడు "దేవదా.... నాకిప్పుడర్థం అవు తోంది. నేనెంత పొరబాటు చేశానో! నే చేసిన పాపాన్ని తుడిచివేసుకునే అదృష్టం ఇపుడొచ్చింది. వెళ్ళు ఆ పిల్లని పట్రా! వెంటనే మీ పెళ్ళి జరిపించేస్తాను" అన్నాడు.



దేవదా ఆనందాన్ని పట్ట లేకుల్లేవు.

"ఓహ్ నా జన్మ ధన్యమాయెనుగదా
నా ప్రేమ భీమా ఆయెనుగదా
ఓ పారూ వెంటనే నా కడకు దా....దా....దా....
నీకై అర్రులు జాస్తున్నాడి దేవదా...."

అని అర్జంటుగా పాటగట్టి హిందీ సినిమా తాలూకు ట్యూనొకటి కాపీ కొటుకుని పాడుకుంటూ పార్వతి దగ్గరికి బయల్దేరాడు....



కానీ.... అనుకోని ఘోరం జరిగిపోయింది.

దేవదాసుకు తీరని అన్యాయం జరిగిపోయింది.

"ఏవిఁటది"

"ఇంతకూ ఏం జరిగింది?"

శ్రీయుత రంగనాధరావుగారికి

ఎట్లా రాయాలో నా మనసులో వున్నది ఎట్లా చెప్పాలో అర్థం కావటంలేదు. నేను చేస్తున్న పనినే నమ్మకద్రోహం అంటారు కాబోలు. కాని నా మనసును చంపుకోలేను.

నేను మీ అబ్బాయి స్నేహితుడు గోపాలం గారిని ప్రేమిస్తున్నాను. క్షమించాలి. మీరు నన్ను ఎంతో ఆదరంగా చూశారు. కోడలిని చేసుకోవాలని మురిసిపోయి వుంటారు. మీ మనసుకు కష్టం కలిగిస్తే క్షమించాలి. నేను రమేష్‌ని ప్రేమించలేను.

ఈ విషయంలో మీరు తొందరపడరని నింపాదిగా ఆలోచిస్తారని నమ్ముతున్నాను.

ఇట్లు
రాధ.

రంగనాధరావు ఉత్తరం తీసుకుని అన్నాడు. "వచ్చిన తరువాత రమేష్‌తో షికార్లు తిరిగిందమ్మా! నేను చక్కని జోడీ అని మురిసిపోయాను. అసలు ఆ వూహతోనే పురుషోత్తమరావుగారిని రమ్మన్నాను. నేను ఇప్పుడేం చెయ్యాలి?"

"రాధగారికి ఇష్టంలేని పెళ్ళి చేస్తే లాభం ఏమిటి? అదీగాక నాలుగయిదు రోజులలో వాళ్ళు వెళ్ళిపోతున్నారాయె. ఈ సంగతి మరిచిపోవటానికి ప్రయత్నించాలి.... అన్నట్లు ఈ దస్తూరీ రాధగారిదని ఏమిటి?" అంది మాయ.

రంగనాధరావులో ఆశ చిగురించింది. "అదే నేనూ అనుకున్నాను. అయినా రాధ ఈ గదిలోకి వచ్చిందని నువ్వే చెప్పావుగా? పైగా ఇంకొకరికి ఇట్లా వుత్తరం రాయటంలో గల లాభం ఏమిటి?"

"ఒక పని చేద్దాం అండి. నేను రాధ గారితో ఒక పాట రాయించుకుని వస్తాను. ఆ దస్తూరితో ఇది పోల్చి చూద్దాం! సరేనా? ఏ పాట రాయించుకుని రమ్మంటారు?"

"అవును. అట్లాగే చేద్దాం! ఏదో ఒక పాట రాయించుకురా. అట్లాచేస్తే వున్న సందేహం పోతుంది."

"అయితే! 'ఏమిటో ఈ మాయ'.... పాట రాయించుకు వస్తాను. అందులో నా పేరుకూడా వుంది" అంది మాయ నవ్వుతూ.

నవ్వలేక నవ్వాడు రంగనాధరావు.

మాయ భానుమతి గదిలోకి వెళ్ళింది. రంగనాధరావు ఆఫీసురూమ్ బయట నిలబడ్డాడు. మాయ పాట రాయమనటం, రాధ బలవంతంమీద ఒప్పుకోవటం వినిపించింది. రాధ పాట రాస్తూ వుండగా రంగనాధరావు లోపలికి వచ్చి కూర్చున్నాడు.

రెండు నిమిషాల తరువాత మాయ వచ్చింది చేతిలో పాటవున్న కాయితంతో.

రెండు దస్తూరీలు పోల్చి చూసిన వెంటనే రంగనాధరావు రెండు కాయితాలు వుండచుట్టి చెత్త బుట్టలో పారేశాడు.

మాయ ఏం అడగలేదు. అడగకుండానే తెలుస్తున్నది. రంగనాధరావు తల ఎత్తి 'వుత్తరం రాధ రాసిందేనమ్మా!' అన్నాడు.

మాయ కదిలింది.

"చూడమ్మా! కాస్త స్ట్రాంగ్ కాఫీ పంపమని వెంకయ్యతో చెప్పు. రమేష్ కనబడితే వెంటనే నా దగ్గరకు రమ్మని చెప్పు."

* * *

"నిన్న రాత్రి కనబడి నీ ప్లాన్ ఏమయ్యిందో చెప్పలేదే?" అన్నాడు గోపాలం.

"ఇంతకీ ఏమయ్యింది?"

"ఒరేయ్! ముసలి వేషం వేసేటప్పటికి నీకు ముసలి టక్కులన్నీ ఎట్లా వచ్చా

యిరా మిత్రద్రోహి? నీకు సిగ్గు లేదురా తేనెపూసిన కత్తి? నిన్ను ఏం చేసినా పాపం లేదురా గోముఖపులి! నిన్ను ఎట్లా తిట్టాలో తెలియటం లేదురా. చాపకింద నీరు! నిన్ను...."

"నీకు సామెతలు, తిట్లూ పుష్కలంగా వచ్చు. ఒప్పుకుంటున్నాను. ఇంతకీ ఎందుకీ హడావిడి?" అన్నాడు గోపాలం కళ్ళజోడు సరిచేసుకుంటూ.

"నాకు హడావుడిరా? నీకు నీతి వుందిరా? భాను తండ్రి వేషం వేసినందుకు నీకు పాపభీతి లేదురా?"

"చెప్పేదేమన్నా సూటిగా చెప్పు. నువ్వు మాట్లాడింది అర్థం అవుతున్నది కాని, ఆ మాటల వెనక వున్న అర్థం అర్థంకావటం లేదు."

"ఎట్లా చెప్పాలిరా?" అన్నాడు రమేష్ పచార్లుచేస్తూ. "భాను నిన్ను ప్రేమిస్తున్నదిట!"

"పిచ్చి ఎక్కిందా? లేకపోతే తాగి మాట్లాడుతున్నావా?" గోపాలం తీవ్రంగా అన్నాడు.

"పిచ్చి నిజంగానే ఎక్కింది ఆ విషయం విన్నాక తాగాలనేవుంది ఇప్పుడు. నవ్వులాట కాదు జోకు కాదు. నాన్నగారి టేబిలుమీద వుత్తరం పెట్టిందిట భాను. నిన్ను ప్రేమిస్తున్నానని. అంటే మీ మారు వేషాల సంగతి రాయలేదులే! గోపాలాన్ని ప్రేమిస్తున్నాను అని రాసిందిట. వుత్తరం కూడా రాధ పేరుతోనే రాసిందిట. నాన్న గారికి అప్పటికి అనుమానం వచ్చిందిట. అది భానుమతి దస్తూరి కాదేమోఅని. అందుకని మాయ సలహామీద మాయను భానుమతి దగ్గరకు పంపారుట. మాయ భానుమతి చేత ఏదో పాట రాయించుకుని వచ్చిందిట. తిరాచూస్తే రెండు దస్తూరీలు ఒకటేనుట."

"నీకు చూపించారా ఆ కాయితాలు?"

"అడిగాను. కాని కోపంలో ఆ రెండు కాయితాలు వుండచుట్టి చెత్త బుట్టలో పారేశాను అని చెప్పారు. అయినా ఇందులో సందేహానికి ఆస్కారం లేదు."

"మధ్యలో మాయ వుందని అంటున్నావు. నాకెందుకో ఇందులో మాయ మాయాజాలం వుందని అనుమానంగా వుంది."

"నోర్మూయ్! నీకు మాయ ఫోబియా పట్టుకుంది – ప్రతిదీ మాయే చేసింది అంటున్నావు. ఇందులో ఏ ఇంద్రజాలానికి చోటు వుండటానికి అవకాశంలేదు!" అన్నాడు రమేష్ కుర్చీలో కూలబడుతూ.

"నేను మటుకూ నీ గోపాలాన్నే ఇంకా! అయినా భానుమతి ఇట్లా చేస్తుందని అనుకోను. ఏదో జోకో, సరదాగానో చేసి వుంటుంది! ఇంతకీ భానుమతిని కలుసుకున్నావా?"

"ఇంకా భానుమతి ప్రసక్తి నా వద్ద తీసుకురాకు. భానుమతిని ఈ జన్మకి...."

గుమ్మం దగ్గర శబ్దం అవటంతో ఇద్దరూ అటు చూశారు. భానుమతి నిలబడి వుంది.

రమేష్ అర నిముషం కుర్చీలో ఇబ్బందిగా కదిలి "..., మరిచిపోతాను!" అని పూర్తి చేసి, లేచి భానుమతి పక్కనించి బయటకి వెళ్ళాడు. వీడు నిజంగానే రాజు కన్నా బలవంతుడుఅనుకున్నాడుగోపాలం.

భానుమతి లోపలికివచ్చింది. "చూశారా గోపాలంగారూ? రమేష్ ఎట్లా మారిపోయాడో!" అంది బరువుగా.

గోపాలం ఆశ్చర్యపోతూ భానుమతి వంక చూశాడు.

"అతని బలవంతంమీద, అతను నన్ను ప్రేమిస్తున్నాడనేకదా నేను ఇక్కడకి వచ్చింది. తిరా ఇప్పుడు రమేష్ మాయను ప్రేమిస్తున్నాడంటే నేనేం చెయ్యాలి? మీరే విన్నారుగా ఇప్పుడు అతను అన్న మాటలు. నా ప్రసక్తి భరించలేడుట. నన్ను మరిచిపోతాడుట" దాదాపుగా ఏడుస్తున్నట్లు అంది.

గోపాలం మతి పోయింది. "రమేష్ మాయను ప్రేమిస్తున్నాడా? ఎప్పుడు చెప్పాడు?"

"నాతో రమేష్ చెప్పలేదు ఆ మాట. నిన్న మాయ చెప్పింది – సాయంకాలం తన ప్రియుడితో కలసి సికారుకి వెడుతున్నానని. సాయంకాలం వాళ్ళిద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కారులో షికారుకి వెళ్ళటం నేను చూశాను.

గోపాలం రెండు నిముషాలు ఆలోచించాడు. తన పేరు గోపాలం అని తెలియటానికి. రమేష్ తనతో అన్న మాటలు తెలివిగా ఇంకో విధంగా భానుమతితో చెప్పటానికి మాయకు వున్న ఒకే అవకాశం.... తమ సంభాషణ వినటం. అది ఎట్లా సాధ్యం? గోపాలంకి అనుమానం వచ్చి కిటికీలోంచి తోటలోకి చూశాడు. కిటికీ పక్కగా చేతిలో పుస్తకంతో నిలబడి వుంది. మాయ చూపులు పుస్తకం మీద వున్నా చెవులు మాత్రం వాటి పని అది ఎఫిషియంట్‌గా చేసుకుపోతున్నాయి.

గోపాలం భానుమతి దగ్గరగా నడిచాడు. "చూడండి భానుమతి! మాయతో చెప్పివెంటనే...." గోపాలం వాక్యం పూర్తి కాలేదు....మాయ తోటలోంచి తన గదిలోకి వెళ్ళిపోయింది.

తోటలో మాయ లేదని రూఢి చేసుకున్నాక గోపాలం భానుమతిని అడిగాడు. "మాయ మీ దగ్గరకు వచ్చిందా?"

"ఆ! పొద్దున వచ్చింది. వచ్చి "ఏమిటో ఈ మాయ!" పాట రాయించుకుని వెళ్ళింది. ఎందుకంటే సరిగ్గా చెప్పలేదు."

"రంగనాధరావుగారికి మీరే మన్నా వుత్తరం రాశారా?"

"నేనా? ఆయనకి ఎందుకు రాస్తాను?"

"అంటే అదేదో మిస్టరీ అన్న మాట. ఇకపోతే రమేష్ మాయను షికారుకి ఎందుకు తీసుకువెళ్ళాడంటే...." అని, రమేష్, మాయ రహస్యాలు రాబట్టటానికి ప్లాన్ వెయ్యటం, మాయ తన సమావేశాలు వినటం, రంగనాధరావుకి వుత్తరం రావటం, అది భానుమతి దస్తూరితో సరిపోలటం చెప్పి.. "రమేష్ ఆ విషయం నాతో చెప్తుండగా మీరు వచ్చారు. నాకు ఇందులో మాయ చెయ్యి వుందని అనుమానంగా వుంది" అన్నాడు గోపాలం.

"దస్తూరిలు ఒకేలాగావున్నాయా? ఎట్లా సాధ్యం?"

"అదే ఆలోచించాలి. మన పరిశోధన సిస్టమేటిక్‌గా ప్రారంభిద్దాం! ముందు ఆఫీసురూం వేస్టు పేపర్ బాస్కెట్‌లో ఆ పాట, వుత్తరం వున్నాయేమో చూసి రండి!" అన్నాడు గోపాలం, "వుంటే పట్టుకు రండి."

భానుమతి చూసివచ్చి ఆ కాయితాలు లేవని చెప్పింది.

"కరక్టు వుండవనే అనుకుంటున్నాను. మాయ చేసిన మాజిక్కు తెలిసిపోయింది" అన్నాడు గోపాలం.

"తెలిసిపోయిందా? ఏమిటి?"

"మనం వచ్చిన రోజున హనుమంతం మనల్ని అనుమానించి పురుషోత్తమరావు రాసిన వుత్తరం తీసుకు వచ్చి నాచేత ఇంకో కాపీ రాయించి రెండు పోల్చి చూశాడు. గుర్తుందా? అయినా పురుషోత్తమరావు రాసిన వుత్తరం. నేను రాసిన వుత్తరం ఒకేలాగా వున్నాయి."

## దేవదాసు మళ్ళీ పుట్టాడు !!



దేవదాసు డీలా పడిపోయి. నీరసంగా పార్వతి దగ్గరకు వచ్చాడు. అతగాడి వాలకం చూసి పార్వతికి భయం వేసింది.

"మన పెళ్ళికి మీ నాన్న ఒప్పుకోలేదా దేవదా?" అంది ఆదుర్దాగా.

"ఒప్పుకున్నాడు"


"మరి"

"లేదు పారూ.... అయినా నేను నిన్ను పెళ్ళి చేసుకోలేను ప్చ్"

"ఏం? ఎందుకని?"



"ఏం చెప్పను! ఇంటినుంచి వస్తుంటే మార్గం మధ్యలో 'ఫామిలీ ప్లానింగ్' వాళ్ళు నలుగురు నన్ను పట్టుకుపోయి "కంపల్సరీ స్టెరిలైజేషను" చేసేశారు. (అలా చేస్తున్నప్పుడు వాళ్ళంతా "జై-సంజై" అనడం లీలగా గుర్తుంది)



అలా మన హీరో కథ మరోసారి ట్రాజడీగా ముగిసింది. భారద్దేశంలో "ప్రేమ భీమా కాదు సుమా" అనుకుని తిరిగి వెళ్ళిపోయాడు దేవదాసు.

గ మ ని క .

"దేవదాసులానే బలి అయిపోయిన బోలెడంతమందికీ "కార్టూన్ కథ" అంకితం చేస్తున్నాను. ఇంతకుమించి నే చేయగలిగిందేవుంది చెప్పండి" —శశిధర్

(స మా ప్తం)

"అవును. అప్పుడే అడుగుదామనుకుని మర్చిపోయాను. ఎట్లా చేశారు?" అంది భానుమతి కుతూహలంగా.

"ఆ క్రితంరోజు రమేష్ పురుషోత్తమరావు రాసిన వుత్తరం నాకు ఇచ్చాడు. నేను దానికి కాపీ నా స్వదస్తూరీతో లాగి, ఆ కాపీని యథాస్థానంలో అంటే హనుమంతం సొరుగులో వుంచమని చెప్పాను. నాకు హనుమంతం తెలివి తేటలు తెలుసు. వుత్తరం అసలే లేకపోతే అనుమానం ఎక్కువ అవుతుంది. అసలు వుత్తరం వుంటే మన బండారం బయటపడుతుంది. అందుకే అట్లా చేశాను. దాంతో మనం ఇక్కడ ఎస్టాబ్లిష్ అవటమే కాకుండా హనుమంతం తోక ముడవాల్సి వచ్చింది. ఇప్పుడు మాయకూడా అదేచేసి వుంటుంది. తన దస్తూరితోనే వుత్తరంరాసి అది రంగనాధరావు టేబులుమీద పెట్టి వుంటుంది. ముందుగానే తను "ఏమిటో ఈ మాయ" పాట రాసి వుంచుకుని వుంటుంది. నీ దగ్గరకు వచ్చి పాట రాయమని అడిగినా రంగనాధరావుకి తనురాసినపాటఇచ్చివుంటుంది. దాంతో ఆ దస్తూరీలు ఒకటి కాక ఏం అవుతాయి. మళ్ళీ ఇప్పుడేమో ఎందుకన్నా మంచిదని ఆ కాయితాలు మాయం చేసి వుంటుంది. సింపుల్ !"

"ఎన్ని తెలివి తేటలు?" ఆశ్చర్య పడింది భానుమతి "మరి నన్ను రమేష్ నమ్ముతాడా? రంగనాధరావుగారు ఏమనుకుంటున్నారో నా గురించి?" అసలు మనమే ఆయనకు చెప్తే మాయ గురించి?"

"ఇప్పుడు చెప్పడంలో ప్రయోజనం లేదు. మనది పైచేయిగా వున్నప్పుడు చెప్పాలి. ఇక రమేష్ విషయం మీరు కంగారుపడకండి. నేను నచ్చచెప్పగలను. కాని మీరు ఓ రెండు రోజులు దూరం దూరంగా వుండండి. మాయకు మనం ఎదురుదెబ్బ తీస్తున్నామన్న అనుమానం రాకూడదు. మనం తియాల్సిన ఎదురుదెబ్బ గురించి నేను ఆలోచిస్తాను."

గోపాలం తోటలోకి వెళ్ళి ఆలోచించసాగాడు పచార్లు చేస్తూ.

'నమస్కారం పురుషోత్తమరావుగారు.' ఆలోచనలలోంచి తేరుకుని చూశాడు గోపాలం. హనుమంతం నిలబడి వున్నాడు చేతిలో బ్యాగ్, పక్కనే సూట్‌కేసు.

"న మ స్కా ర ం. ఎవరు నువ్వు?" అన్నాడు గోపాలం, హనుమంతం అంత హఠాత్తుగా వూడి పడటంవల్ల కలిగిన షాకులోకూడా గోపాలం పురుషోత్తమరావు మతి మరుపుతనం గురించి మరిచిపోలేదు.

"నేను రంగనాధరావుగారి సెక్రటరీనండి. నా పేరు హనుమంతం. మిమ్మల్ని సీలేరులో కలిశాను" వినయంగా అన్నాడు. "వస్తానండి!" లోపలికి వెళ్ళాడు.

గోపాలంతోపాటు పాఠకులు కూడా ఆశ్చర్యపడి వుండవచ్చు - హనుమంతం ఎందుకు, ఎట్లావచ్చాడా అని. అతని ప్రియురాలు ఏమయింది అన్న అనుమానంకూడా రావచ్చు.

రెండోసారి అతన్ని కలుసుకున్నప్పుడు అతనితో లేచి రావటానికి అతని ప్రియురాలు ఒప్పుకుంది. ఆ మర్నాడు హనుమంతం బజారుకు వెడుతుంటే ఎదురింటి మేడ నించి కబురు వచ్చింది. కబురు పెట్టినది కాబోయిన బావగారు అంటే ప్రియు

రాలి అన్నగారు! హనుమంతం వెళ్ళే టప్పటికి అతను బస్సెక్కుటు తున్నాడు. పక్కన ఇద్దరు పాలేళ్లు బాణా కర్రలతో నిలబడి వున్నారు.

"ఒరేయి! వూరు వదిలి ఎప్పుడు పోతున్నావురా?" అన్నాడు బావగారు.

మర్యాదగా మాట్లాడ మనటం హాస్పిటలుకు దారి అడగటం ఒకటే అవుతుందని తెలిసిన హనుమంతం మాట్లాడలేదు.

"ఇంకో రెండు గంటలకు బస్సువుంది. దానికి వెడతావా?"

పరిస్థితిని బాగా ఆకళింపు చేసుకున్న హనుమంతం "నేను వెళ్ళిపోతాను" అని, ఎందుకయినా మంచిదని "నేను వెళ్ళిపోతానండి!" అన్నాడు.

ఇక హనుమంతం తను తల దాచుకోవటానికి మిగిలింది హైదరాబాద్‌లో వున్న "దయానంద్ బిల్డింగ్ అని తెలుసుకున్నాడు. గోపాలంని పురుషోత్తమరావుగా గుర్తించకపోతే అందులో తనకి స్థానం వుండదని గుర్తించాడు అందుకనే ఎదురు పడ్డ గోపాలాన్ని పురుషోత్తమ రావు అని పిలిచాడు.

ఆశ్చర్యం నించి తేరుకున్న గోపాలం రమేష్ దగ్గరకి వెళ్ళాడు. హనుమంతం గురించి చెప్పాడు. మాయ ఎట్లా మోసగించిందో చెప్పాడు. భానుమతి రమేష్ మీద.

భానుమతి మీద రమేష్‌కి, రంగనాథ రావుకి ఎట్లా అపార్థం కలిగించిందో చెప్పాడు. "మాయ మనల్ని చాటుగా వింటున్నది. మనం ఏం చెయ్యబోతున్నామో ఆవిడకి ముందుగానే తెలుసు. నాకుఇప్పుడు మాయకి మాయలు రావని మామూలు మనిషని తెలిసింది. అదల్లా వుంచు. మనం ముందుగా చూడాల్సింది హనుమంతం పని."

"ఇప్పుడు భానుకి నేను నిర్దోషినని తెలుసా?" అన్నాడు రమేష్ ఆతృతగా.

"నాయనామీరిద్దరూ విడిపోలేదు. ఎవరూ విడదీయ లేదు? ముందుగా హనుమంతం ఒరేయి........ఒరేయి నాకు ఎన్ని తెలివి తేటలు వున్నాయిరా" ఇందాక ఒక నిముషంలో మాయనిజస్వరూపంకని పెట్టేశాను. ఇప్పుడు హనుమంతం పని తా. నువ్వు హనుమంతానికి రేసుకోర్సులో కనబడ్డావని మనం ఎంత విలవిలలాడి పోయాం! అసలు అది మన తురుపు ముక్కరా!" అన్నాడు గోపాలం ముఖం ఆనందంతో వెలిగి పోతుండగా.

"ఇప్పుడు ఆ సంగతి ఎందుకు?"

"మీ వూరికి మా వూరు ఎంత దూరమో, మా వూరికి మీ వూరు అంతదూరమే కదా?" నువ్వు హనుమంతానికి రేసుకోర్సులో కనబడ్డావంటే..."

"అంటే వాడు నాకు కనబడినట్టే కదా? అవున్రోయ్ ఇన్నాళ్ళ నించి ఆలోచించ లేదు." అన్నాడు రమేష్!

"అందుకనే మనం చెయ్యాల్సింది ఏమిటంటే...."

"బ్రదరా ఎప్పుడు వచ్చితివి?" హనుమంతం గదిలోకి అడుగుపెడుతూ అడిగాడు రమేష్.

పౌడరు పూసుకుంటున్న హనుమంతం దాంతోపాటు ఇంత నవ్వు పూసుకుని "ఏమిటి? ఈ మధ్య మీ మామగారి దగ్గర పద్యాలు నేర్చుకుంటున్నావా?" అన్నాడు.

కుర్చీలో కూలబడి కాళ్ళు రెండు టేబులు మీద చాచాడు రమేష్. టేబులుమీద వున్న సిగరెట్ పాకెట్ తీసి సిగరెట్ వెలిగించుకుని అన్నాడు. "నాన్నగారు నీకు మంగళం పాడారు తెలుసా? నీ స్థానంలో యంగ్, యనర్జెటిక్, ఎఫిషియంట్, అండ్ స్మార్ట్ సెక్రటరీ వచ్చింది."

"నాకు మంగళం పాడారా? ఎందుకు? ఆ వచ్చింది పురుషోత్తమరావే అంటున్నానుకదా! నా బుర్ర బాగానే వుంది ఇప్పుడు."

"అదీ అట్లాగన్నావు. నిన్ను పిచ్చాసుపత్రిలో పారెయ్యటానికి మేముసంకోచించ నక్కరలేదు. ఆయన పురుషోత్తమరావు ఏమిటోయి? నీ బొంద! సీలేరులో చూశావు కదా? ఆయనా, ఈయనా ఒక్కడేనా?"


హనుమంతం బుర్ర పని చెయ్యటం దాదాపు ఆగిపోయింది. రమేష్ చెబుతున్నది నమ్మాలో లేదో తెలియలేదు. ఒక్క నిముషం ఆగి అన్నాడు. "నేను అప్పుడే చెప్పానుకదా నా అనుమానం! అయినా నాకు ఎప్పుడయ్యింది జ్ఞానోదయం?"


'అప్పుడెప్పుడో ఆయన ఫొటో........ మధ్యలో ఆగిపోయాడు రమేష్. నాలుగు వేపుల చూస్తూ "గోడలకు చెవులుంటాయి. అట్లా బయటకిపోయి మాట్లాడుకుందాంరా!"

హనుమంతం, రమేష్ తోటలోకి వెళ్ళి మామిడి చెట్టు కింద కూర్చున్నారు.

రమేష్ మొదలుపెట్టాడు. "ఏం చెబుతున్నాను? అదే....వీడు పురుషోత్తమరావు కాదు. అసలు వీడికి జ్యోతిష్యం అంటే అర్థం తెలీదని నా అభిప్రాయం."

హనుమంతం మాట్లాడలేదు. ఆలోచిస్తూ వుండిపోయాడు. పురుషోత్తమరావు వేషంలో వచ్చింది ఎవరా అని అతనికి ముందునుంచి అనుమానంగా వుంది ఈ తతంగం అంతా రమేష్ మద్దతుతోనే జరిగిందని, ఇప్పుడు హైదరాబాద్ తిరిగి వచ్చాక ఈ నాటకానికి వెనకాల ఏం వుందో కనుక్కోవాలి అని అనుకున్నాడు. ఇప్పుడు రమేష్ వచ్చి తనతో కొన్ని రహస్యాలు పంచుకుంటుంటే, తను రమేష్‌ని డబుల్‌క్రాస్ చేస్తే ఈ నాటకం






ఏమిటో తెలిసిపోతుంది అని అనిపించింది.

"ఏం మాట్లాడవు?" అన్నాడు రమేష్.

"నేను మటుకు ఏం చెయ్యగలను?"

"నీ తెలివి తేటలమీద నాకు నమ్మకం వుంది. హనుమంతం! నా బుర్ర గురించి విడిగా నీకు చెప్పనక్కరలేదు."

హనుమంతం ఏం చెయ్యాలా అని ఆలోచించసాగాడు. రమేష్‌ని ఎదురు దెబ్బ తియటం ఎట్లా అని ఆలోచిస్తున్న హనుమంతానికి తను ఆ యింటి నుంచి రెండు గంటలలో వెళ్ళగొట్టబడుతున్నాడని తెలీదు – ఈ సారి శాశ్వతంగా!

హనుమంతం ఏదో చెప్పసాగాడు. రమేష్ హనుమంతం భుజాల మీద నుంచి గోపాలం గది వేపు చూడసాగాడు. గోపాలం గది కిటికీలో తెల్లటి జేబురుమాలు వూగింది. చేతులు దులుపుకుని లేచాడు. రమేష్ నేను వెడతాను."

"సాంతం వినకుండానే? అన్నాడు హనుమంతం.

"ఏమిటి సాంతంగా వినటం?" అడిగాడు రమేష్ వింతగా,

"అదే ఈ దొంగ పురుషోత్తమరావుని పట్టుకునే వుపాయం."

రమేష్ అదోలా హనుమంతం వంక చూశాడు. జాలిగా నవ్వుతూ అన్నాడు "నీకు నిజంగా మతి పోయింది హనుమంతం! నేను ఇందాకటినుండి చెప్పింది వినికూడా ఆయన పురుషోత్తమరావు కాదు అంటావేమిటి? నువ్వు మా మీద ప్రాక్టికల్ జోకు వెయ్యటం లేదుకదా?" రమేష్ వెళ్ళిపోయాడు.

హనుమంతానికి నిజంగానే మతి పోయింది. అక్కడనుంచి లేవలేక పోయాడు.

"ఏమయింది?" అన్నాడు రమేష్ గోపాలం కనబడగానే.

"ఏముంది? అన్నీ మా నాన్నగారి సొరుగులోకి చేరాయి. మా నాన్నగారు బయటనుంచి వచ్చిన వెంటనే ఆ పానకాల స్వామికి మంగళం పాడతారు. దాదాపుగా పదివేలు తెలుసా?" అన్నాడు గోపాలం వుత్సాహంగా.

గోపాలం చెప్పినట్లుగానే రంగనాధరావు బయటనుంచి వచ్చిన వెంటనే హనుమంతానికి కబురు పెట్టాడు.

తిరిగి వచ్చాక హనుమంతం అదే మొదటిసారి రంగనాధరావును కలవటం.

"రా! రా! అబ్బీ! నాకు కొన్ని సందేహాలు వున్నాయి! అట్లా కూర్చో!" అన్నాడు రంగనాధరావు.

హనుమంతం అనుమానంగా కూర్చున్నాడు.

"ఆ పెన్సిలు, కాయితం తీసుకో. రెండు వేల అయిదు వందల ఇరవై రెండు.... వేసుకో మూడువేల తొమ్మిది వందల ఎనభై ....రెండువేల పన్నెండు....పంథొమ్మిది వందల అరవై మూడు. ఈ నాలుగూ కూడి ఎంతో చెప్పు!"

మొదటి రెండు వేసేటప్పటికి హనుమంతంకి అనుమానం వచ్చింది. మూడు నాలుగు వేసేటప్పటికి అనుమానం దృఢపడింది. ఏమవ్వబోతున్నదో తెలుస్తూనే వున్నది. ఎట్లా తెలిసింది అన్నదే....?

"ఎంతో చెప్పు?"

"పది వేల నాలుగు వందల డెబ్భైఏడు అన్నాడు హనుమంతం తల వంచుకుంటూ.

"తల ఎత్తు! చూడు! నువ్వు నా దగ్గర మూడు ఏళ్ళనించి వుంటున్నావు. నిజంగానే మెచ్చుకుంటున్నాను" అంటూ సొరుగులాగి నాలుగు బ్యాంకు పాస్ బుక్స్ తిసి టేబులు మీద వుంచుతూ "అదుగో వీటిలో....ఎంతన్నావు....పదివేల నాలుగు వందల చిల్లర దాచుకున్నావన్నమాట. ఎట్లా సంపాదించావో నాకు చెప్పక్కర్లేదు. ఇకపోతే ఇవి" అంటూ సొరుగులోంచి ఇంకా కొన్ని పుస్తకాలు తిసి టేబులుమీద వుంచి "ఇవి నీ గుర్రప్పందాలపుస్తకాలు" ఈ డబ్బంతా గుర్రప్పందాలలో వచ్చిందని చెప్పకు. సీజన్‌లోని రేలన్నీ ఎట్లా తగ్గిపోయిందో చూశాను. నువ్వు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా నిన్ను బయటకి పంపటం ఇష్టంలేదు. ఏమన్నా చెప్పాలా?" అన్నాడు.

హనుమంతం మాట్లాడలేదు. లేదు అన్నట్లు తల వూపాడు. తన గదిలో తన పెట్టెలో అతి జాగ్రత్తగా వున్నవన్నీ రంగనాధరావు దగ్గరకు ఎట్లా వచ్చాయి అన్నది అతనికి అర్థంకాలేదు.

అంతవరకు సౌమ్యంగా వున్న రంగనాధరావు కర్కశంగా అన్నాడు "నీ కష్టార్జితం నాకు అక్కరలేదు. వీటిని నీ వెంటే తీసుకు వెళ్ళు కాని ఇక్కడ ఇంకో నిముషం వుండకు. వ్యాపారం ఏదన్నా పెట్టుకుని న్యాయంగా పైకి రా. అంతకన్నా నేను చెప్పేది ఏం లేదు."

హనుమంతం లేచాడు. టేబులు మీద వున్న పుస్తకాలన్నీ తీసుకున్నాడు. మాట్లాడకుండా గది గుమ్మం వరకూ వెళ్ళాడు. అక్కడ ఒక నిముషం ఆగిపోయాడు. మెల్లిగా వెనక్కి తిరిగాడు. "నన్ను క్షమించు బాబాయి!" అన్నాడు.

రంగనాధరావు పంటికింద నలుగుతున్న కింద పెదవి విచ్చుకొని అంతవరకూ కర్కశంగా వున్న మొహాన్ని ప్రసన్నంగా చేసింది. రంగనాధరావు ఏదో అనబోయాడు.

కాని హనుమంతం గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

## 5

దయానంద్ బిల్డింగ్‌కు దగ్గరగా వున్న హోటలులో కాఫీ తాగి బయటకి వచ్చాడు హనుమంతం. పక్కనే వున్న కిళ్ళీకొట్లో సిగరెట్ కొని ముట్టించుకోబోతున్నాడు. అప్పుడు వినిపించింది దయానంద్ బిల్డింగ్ ఎక్కడా అన్న ప్రశ్న.

కరక్టుగా ఇదే విధమయిన సిచ్యుయేషన్‌లో గోపాలం వుండటం పాఠకులకు గుర్తు వుండేవుంటుంది (చూడుడు మూడవ చాప్టర్).

హనుమంతం సిగరెట్ వెలిగించుకొని ప్రశ్న వచ్చిన వేపు చూశాడు.

సన్నగా, పొట్టిగా అమితాబ్ బచన్‌ని అడ్డంగా కోసి గుండు చేసినట్టున్న ఒకాయన అడిగాడు ఆ ప్రశ్న. ఆయన చేతిలో ఒక ఉత్తరం వుంది.

ఇక్కడికు దగ్గరేనండి. "పని ఏమిటో తెలుసుకోవచ్చా?" అన్నాడు హనుమంతం.

ఆయన హనుమంతాన్ని చూస్తూ వుండిపోయాడు.

"నా పేరు హనుమంతం అండి. నేను రెండు నిముషాల క్రితం వరకూ దయానంద్ బిల్డింగ్‌లో రంగనాధరావుగారికి సెక్రటరీగా వుండేవాడిని."

అల్లాగా! నా పేరు జగన్నాధం. పురుషోత్తమరావు అని జ్యోతిష్యంలో ఒకనమే వున్నాడు. వాడు నాకు బంధువు. వాడు హైదరాబాద్ వస్తున్నానని ఫలానా దయానంద్ బిల్డింగ్‌లో వుంటానని కలవమని రాశాడు. వాడికి కొంచెం....కొంచెమేం బొత్తిగానే...మ తి మ రు పు వుం డి. HYderabad అని రాయటానికి బదులు Byderamad అని అడ్రెసులో రాశాడు. దాంతో ఈ ఉత్తరం పది రోజులు తరు



వాత అందింది. చూస్తూ వుంటే ఇండియా అంతా తిరిగినట్లున్నది" అన్నాడు మాయకు మేనమామ, గోపాలం ఇంటి యజమాని అయిన జగన్నాధం.

"మీరు పురుషోత్తమరావుగారి బంధువులా! ఆయన్ని ఎప్పుడన్నా చూశారా మీరు?" అడిగాడు హనుమంతం ఆనందంగా.

"వాడిని నేను చూడకపోవటం ఏమిటి? ఇంతప్పటినుంచి కలిసి తిరిగా. కలిసి కబాడి నేర్చుకున్నాం - ఆడాం. వాడికి చిన్నప్పటినుంచి జ్యోతిష్యం పిచ్చిలే ఎదుటి పార్టీ వాళ్ళ కాలు పట్టుకున్నా చెయ్యి పట్టుకున్నా కబాడి మర్చిపోయి రేఖలు చూడటం మొదలుపెట్టేవాడు. దాంతో వాడు కబాడీలో పైకి రాలేకపోయాడు. అది సరేగాని...."

"ఆ ప్రశ్న నేను ఎందుకుఅడిగానంటే.... ఇప్పుడు పురుషోత్తమరావు పేరుతో ఎవరో దొంగ వెధవ ఆ యింట్లోకి వచ్చాడు. నాకు దానిని రుజువు చేసేందుకు ఆధారాలు లేకపోయాయి. అందుకే రాజీనామా ఇచ్చి వచ్చేశాను."

జగన్నాధం గర్జించాడు. "ఎవడువాడు? వాడికి ఎన్ని గుండెలు?" చూడు వాడిమీద కబాడీ ఆడతాను" అన్నాడు.

తృప్తిగా వూపిరి పీలుస్తూ యిల్లు చూపించాడు హనుమంతం. జగన్నాధం వెనక్కి వచ్చేటప్పుడు ఆయన్ని కలిసేందుకు వీలుగా మళ్ళీ హోటలు దగ్గరికి వెళ్ళిపోతున్నాడు.

* * *

గోపాలం భరోసా ఇచ్చినా భానుమతికి మనసు మనసులోలేదు. రమేష్‌ని స్వయంగా కలిసి తన తప్పు లేదని చెప్పాలని వుంది. ఇంతలో మంచి ఐడియా వచ్చింది. రమేష్ తనకి బర్తడే ప్రజంట్‌గా ఇచ్చిన చీర ఇంకా కట్టుకోలేదు. అది కట్టుకుని రమేష్ దగ్గరకి వెడితే అన్నీ మరిచిపోయి ఎంతో సంతోషించాడు. గోపాలందూరం దూరంగా వుండమన్నాడుకానీ ఈ ఒక్క రోజు ఇద్దరూ కలిసి సినిమాకి వెడితే జరిగే నష్టం ఏమిటి?

ఇంకో అయిదు నిముషాలలో భానుమతి ఆ చీర కట్టుకుని రమేష్ కోసం బయలుదేరింది.

మాయ చూసింది. "చాలా బాగుందండి చీర. ఎరుపు.నీలం,ఆకుపచ్చ,పసుపుఇంత గొప్పగా స్నేహం చేస్తున్నట్లున్న చీర




నేనెక్కడా చూడలేదు" అంది.

"థాంక్సు!" అంటూ రమేష్ రూమ్‌లోకి వెళ్ళింది భానుమతి.

* * *

"రంగనాధరావుగారు వున్నారా?" అడిగాడు జగన్నాధం.

"వున్నారండి! కూర్చోండి!" అన్నాడు వెంకయ్య.

కోపాన్ని, ఆవేశాన్ని అణుచుకుంటూ కూర్చున్నాడు జగన్నాధం. రంగనాధరావుని పిలుచుకు రావటానికి వెళ్ళాడు వెంకయ్య.

"మీరేనా రంగనాధరావు?" రంగనాధరావు హాలులోకి అడుగు పెడుతుంటే అడిగాడు జగన్నాధం. అవునన్నట్లుగా తల వూపాడు రంగనాధరావు.

"నేను పురుషోత్తమరావు బంధువును. నా పేరు జగన్నాధం. తనని కలవమని నాకు వుత్తరం రాశాడు. ఆ వుత్తరం ఆలస్యంగా...."

"అలాగా! సంతోషం!" అని "ఒరేయి వెంకయ్యా! పురుషోత్తమరావుగారిని పిలు!" అన్నాడు రంగనాధరావు.

ఎందుకు పిలిచాడా అనుకుంటూ వచ్చాడు గోపాలం. హాలులో తమ ఇంటాయన జగన్నాధం కనబడగానే ఎందుకో భయం పట్టుకుంది. అయినా మారువేషంలో వున్నాను కదా అనుకుంటూ వెళ్ళి రంగనాధరావుతో "పిలిచారుట?" అన్నాడు.

రంగనాధరావుకి ఏం అర్ధం కాలేదు. వీళ్ళిద్దరూ బంధువులుకదా పలకరించుకోరేం? అనుకుంటూ ఒక నిముషం గోపాలం వంక, ఒక నిముషం జగన్నాధం వంక చూస్తూ వుండిపోయాడు. జగన్నాధానికి అంతా అర్ధం అయిపోయింది. రెండు నిముషాలు గోపాలాన్నిచూస్తూ వుండిపోయాడు, గోపాలానికి అర్ధం అయీ అవనట్లుగావుంది. ఇబ్బందిగాకూడా వుంది. అయినా ధైర్యంగా జగన్నాధానికి చూపులతో జవాబు ఇవ్వసాగాడు.

"ఎవరీయన?" అన్నాడు జగన్నాధం రెండు నిముషాల తరువాత.

"రంగనాధరావుగారని పెద్ద కంట్రాక్టరులెండి." అన్నాడు గోపాలం.

"మిమ్మల్ని కాదు అడుగుతా" అని గోపాలంతో– రంగనాధరావు వంక తిరిగి గోపాలాన్ని వేలితో చూపిస్తూ "ఎవరీయన?" అన్నాడు.

రంగనాధరావుకి గోపాలం సావాసంతో కొంత మతి పోయింది. పొద్దున రాధ పేరుతో వున్న వుత్తరం చూసేటప్పటికి ఇంకాస్త పోయింది. దీంతో అంతా పోయింది. ఇంకా ఆయనకు మతి పోవాలి అంటే ఎక్కడనించయినా మతి అరువు తెచ్చుకుని పోగొట్టుకోవాలి. "ఆయన.... పురుషోత్తమరావుగారు" అన్నాడు కష్టపడి మాటలు బయటకి లాగుతూ.

జగన్నాధం ఒక గంతులో సోఫాలోంచి నేలమీదకు దూకాడు. "ఈయన పురుషోత్తమరావా? కానేకాదు! వీడు....ఈయన మోసగాడు."

"మరి తన పేరు పురుషోత్తమరావు

అని చెప్పాడే?" అన్నాడు రంగనాధరావు నువ్వు పొరపాటు పడుతున్నావు అన్న ధోరణిలో.

"మీ బొందలా వుంది! దొంగాడు వచ్చి దొంగాడు అని చెప్పుకుంటాడా?" అన్నాడు జగన్నాధం ఆవేశంతో వూగిపోతూ.

గోపాలంకి బోధి చెట్టు కిందకు వెళ్ళినట్లయింది. అయితే ఈ జగన్నాధంకి పురుషోత్తమరావు తెలుసు అన్నమాట. ఈ గండం నించి తప్పించుకోవటం ఎట్లా?

"కొంచెం పిచ్చిలెండి!" అన్నాడు గోపాలం రంగనాధరావుతో ఐడియా తట్టగా.

రంగనాధరావు మొహం వికసించింది. ఆయన ఇప్పుడు నమ్మటానికి కష్టంగా వుండే నిజాలు అర్థం చేసుకునే స్థితిలో లేడు. నమ్మగలిగే అబద్ధాలు ఆయన పాలిటి సత్యాలు. "మీకు తెలుసన్నమాట!" అన్నాడు.

"తెలియకనే? వీడు జగన్నాథం. చిన్నప్పటి నుంచి కలిసి తిరిగాం!" అన్నాడు గోపాలం. రంగనాధరావుకి గోపాలం మాటలమీద నమ్మకం పెరిగింది - మరి పేరు కూడా చెప్పాడాయె!

"పురుషోత్తమరావు పేరుతో ఎందుకు వచ్చావురా అబ్బి?"

"వీడు ఒకసారి చెడుగుడు ఆడుతూ తల బద్దలు కొట్టుకున్నాడు. అప్పటి నుంచి ఇదీ వరస!"

"పాపం!"

"ఇంట్లో అద్దెకివున్న వాళ్ళకి మేనకోడళ్ళనిచ్చి పెళ్ళి చేద్దా మనుకుంటాడు. అసలు ఈయనకి మేనకోడళ్ళే లేరు-అది కూడా పిచ్చిలో భాగమే!"

"మనిషి వ్యవహారం చూస్తుంటే తెలుస్తున్నది కదా?" అన్నాడు రంగనాధరావు.

"నాకు పిచ్చా? కబాడీ ఆడుతుంటే తల పగిలిందా? పుండాకోర్- ఎన్ని అబద్ధాలు! నిన్ను పోలీసులకు పట్టిస్తాను. అంతేకాదు నువ్వు పురుషోత్తమరావువి కూడా కాదు. నిన్ను చూస్తుంటె డ్రామాల్లో నటించే వాడిలాగా వున్నావు. నిన్ను పోలీసులకు పట్టించాల్సిందే!"

రంగనాధరావుకి ఎవరిని నమ్మాలో తెలియటం లేదు. ఇప్పుడు ఈ పురుషోత్తమరావుని అని చెప్పుకుంటున్న వాడు పురుషోత్తమరావే అయితే ఈ పురుషోత్తమరావుని అని చెప్పుకుంటున్నవాడు చెప్పినట్లు ఈ పురుషోత్తమరావు స్నేహితుడిని అని చెప్పుకుంటున్న వాడు పిచ్చివాడే అయి వుంటాడు. ఈ పురుషోత్తమరావుని అని చెప్పుకుంటున్నవాడు పురుషోత్తమరావు కాకపోతే వీడు పురుషోత్తమరావు అని నమ్మిన తామందరూ పిచ్చివారే అవుతారు.

ఇక్కడ పరిస్థితి ఇట్లా వుండంగా అక్కడ రమేష్ రూములో రమేష్ భానుమతి ఇద్దరూ నన్ను క్షమించమంటే నిన్ను అనవసరంగా అపార్థం చేసుకున్నామంటూ పది పదిహేనుసార్లు అనుకున్నాక సినిమాకి వెడదామనుకున్నారు. అనుకుని గదిలోంచి బయటపడి, హాలులోకి వచ్చారు.

హాలులోకి ముందుగా అడుగు పెట్టిన రమేష్ పరిస్థితి చాలా వేడిగా వుందని గ్రహించాడు. గ్రహించిన వెంటనే జగన్నాధాన్ని చూసి కొయ్యబారిపోయాడు.

ఆ సమయంలో జగన్నాధం గోపాలం మీద పైచేయిగా వున్నాడు. నిరాశలో వున్న గోపాలం తన నాటకానికి మంగళం పాడదామనుకున్నాడు. అప్పుడు జగన్నాధం చూపు రమేష్ మీద పడింది.

"ఇదుగో లుచ్చా!" అన్నాడు జగన్నాధం ఆవేశంగా.

రమేష్ డాక్టరుగా తన కర్తవ్యం మరిచిపోలేదు. "మీకు బిపి వున్నట్లుంది-కాస్త ఆవేశం తగ్గించుకోండి" అన్నాడు జగన్నాథంతో.

జగన్నాధానికి వళ్ళు మండిపోయింది. వీడు ఆ రోజు తన ఇంట్లో ఎవరినో తెచ్చుకుని కులకటమే కాకుండా, తనకు బూతు జోకులు చెప్పటమే కాకుండా, గోపాలంని తన కంటపడనివ్వకుండా చేసి వుండాలి. ఇప్పుడు తనకి సలహాలు.. బోడి సలహాలు ఇస్తున్నాడు.




ట్రెయిలర్లు ప్లవులు

మరియు

పెట్రోల్, డీజిల్, కిరోసిన్, ఫర్నేస్

ఆయిల్ టాంకులు.

క్రిస్టలైజర్ టాంకులు, ప్రజరి వెసల్స్ ఆధునిక పద్ధతులతో సరిక్రొత్త బేరింగులతో
బెస్టు చేసిన సామాగ్లతో తయారు చేయుచున్నాము.

గ్రామ్స్ : "ఫారమ్ స్టీల్"  ఫోన్స్ : ఆఫీసు : 86-258, రెసి. : 86-694.

ఫారం స్టీల్ ప్రొడక్ట్సు ఇండస్ట్రియల్ ఎస్టేట్, విజయవాడ-7.

"నిన్ను ఏం చేసినా పాపంలేదురా రౌడీ వెధవా! నువ్వు చేసిన పనికి నిన్ను...."

అంతవరకూ ఈ పురుషో త్తమరావుని అని చెప్పుకుంటున్న వాడు పురుషో త్తమరావు కాదని, ఈ పురుషో త్తమరావు స్నేహితుడిని అని చెప్పుకుంటున్నవాడు, ఈ పురుషో త్తమరావుని అని చెప్పుకుంటున్నవాడు చెప్పినట్లు పిచ్చివాడు కాదని కించిత్తు అనుమానిస్తున్న రంగనాధరావు. తన కొడుకుని లుచ్ఛా, రౌడీ, వెధవా అని ఈ పురుషో త్తమరావు స్నేహితుడిని అని చెప్పుకుంటున్నవాడు తిట్టటంతో, ఈ పురుషో త్తమరావుని అని చెప్పుకుంటున్నవాడు చెపినట్లు ఈ పురుషో త్తమరావు స్నేహితుడిని అని చెప్పుకుంటున్న వీడు తప్పక పిచ్చివాడు అయివుంటాడు అనుకున్నాడు.

"....నువ్వు చేసిన పనికి నిన్ను...." అని జగన్నాధం మాటలు రాకకాని, రమేష్‌ని ఏం చెయ్యాలో తెలియకగాని, వాక్యాన్ని మధ్యలో ఆపు చెయ్యలేదు. ఆయన ఆ వాక్యం మధ్యలో వుండగా భానుమతి రమేష్ వెనకనించి ముందుకి వచ్చింది. ఇందాక మాయ భానుమతిని చూడగానే మాయను ఆకర్షించింది భానుమతి కట్టుకున్న చీర. ఎంతయినా మాయకు బంధువుకదా ఈ జగన్నాధం! అతన్ని ఆ చీర ఆకర్షించింది.

అంతవరకూ తన ఇంట్లో రమేష్ ఆడిన రాసక్రీడలు గుర్తుకు తెచ్చుకుంటున్న జగన్నాధం ఆ చీరను చూడగానే ఆ నాడు తనకు పరుపుకింద కనబడిన చీర ఇదే అని గుర్తుకు రాగా నిజంగా కబాడీ ఆడటం ప్రారంభించాడు. ఆయన రక్తనాళాలు అన్నీ వుబ్బిపోయాయి. ఇంకా బిపి ఒక్క అంగుళం పెరిగితే మనిషి పేలిపోతాడా అనుకున్నాడు రమేష్.

"ఇదుగో ఈ అమ్మాయినే మా ఇంటికి తీసుకువచ్చావు నువ్వు! మాది సంసారుల కొంప అనుకున్నావా, సాన్లకొంప అనుకున్నావా?" తను ఆ ఇంటికి ఎందుకు వచ్చాడో మరిచిపోయాడు. జగన్నాధం.

తను అనుకున్న విధంగా ఈ పురుషో త్తమరావుని అని చెప్పుకుంటున్నవాడు అని మననం చేసుకోబోయిన రంగనాధరావు తల వేడి ఎక్కటంతో అంత గందరగోళంగా వున్న స్టేటుమెంటుకన్నా ఈయన పురుషో త్తమరావే, వీడు పిచ్చివాడే అనుకోవటం తేలిగ్గా వుంటుందనుకుని అట్లాగే అనుకుని తృప్తిపడ్డాడు. కాని ఈ జగన్నాధాన్ని శాంతపరచకపోతే ఇంకా కొంచెం సేపు అయ్యాక తననుకూడా పుండాకోర్ అనో రౌడీ అనో అంటాడని భయం పట్టుకుంది. అందుకని జగన్నాధం దగ్గరకి వెళ్ళి "ఏమండీ శాంతించండి!" అన్నాడు. అని వెంకయ్యచేత మంచినీళ్ళు తెప్పించి జగన్నాథంచేత తాగించాడు. జగన్నాథం చల్లబడ్డాడు.

రంగనాథరావు మెల్లిగా అన్నాడు. "కోపపడకండి! ఆ అమ్మాయిని మీరు అదివరకే చూశారంటే ఒప్పుకుంటాను. ఎందుకంటే ఆ అమ్మాయి పురుషో త్తమరావుగారి అమ్మాయి. వీడిని–అదేమా అబ్బాయిడాక్టర్ రమేష్‌ని–మీరు అదివరకు చూసివుండరు. పైగా మీరు ఆ ఇద్దరికి ఏవో సంబంధాలు అంటగడుతున్నారు. ఆ అమ్మాయి పెళ్ళి కావలసిన పిల్ల. ఆమె భవిష్యత్తును చెడగొట్టకండి. ఇకపోతే ఈ ఇద్దర్నీ మీరు మీ ఇంట్లో ఎప్పుడు చూశారు?

రంగనాధరావు చెప్పినవన్నీ అబద్ధాలే అని చెప్పాలి అనుకున్న జగన్నాథం ఆ చివరి ప్రశ్నలో కొట్టుకుపోయాడు.

"ఎప్పుడా? మొన్న ఆదివారం సాయంకాలం" అన్నాడు, బుర్రగోక్కుంటూ.

"క్షమించాలి! ఆ అమ్మాయి ఆ పాటికి విశాఖపట్నంలో వుండి వుంటుంది." అన్నాడు రంగనాధరావు. అని గోపాలం వంక 'మీరు చెప్పింది నిజమే – ఈయనకు పిచ్చే' అన్నట్లు చూశాడు.

గోపాలంకి ఆ చూపు ప్రోత్సాహాన్ని యిచ్చింది. "వెంకయ్యా! టాక్సీ పట్టుకురా! పాపం ఈయన గురించి ఇంట్లో కంగారుపడుతుంటారు" అన్నాడు.

"టాక్సీ ఎందుకండి? మన కారులో తీసుకుపోదాం!" అన్నాడు రంగనాధరావు.

జగన్నాధానికి పదిమంది పిచ్చివాళ్ళలోకి వచ్చినట్లు అనిపించింది. లేకపోతే డ్రామాలవాడిని పురుషో త్తమరావు అని, రౌడివెధవని డాక్టరని అంటారే? వీళ్ళకి తను నచ్చచెప్పలేననుకున్నాడు. పైకి అనకపోయినా ఈ రంగనాధరావు తనని పిచ్చివాడిని చూసినట్టు జాలిగా చూస్తున్నాడు. ఈ మారువేషంలో వున్నవాడు ఈ ఇళ్ళు దోయకమానడు. తన కెందుకువచ్చిన గొడవ? మౌనంగా వెళ్ళిపోయాడు.

* * *

జగన్నాధంద్వారా జగన్నాధం ట్రిప్పు కూడా ఫెయిల్ అయిందని తెలుసుకున్న హనుమంతం ఆశ్చర్యపోయాడు. ఎట్లాగయినా వీళ్ళ అంతు చూడాలి అని ప్రతిజ్ఞ పట్టాడు. నిజం. పురుషో త్తమరావుని కలవటానికి విశాఖపట్నం దగ్గరవున్న పేరూ వూరూ లేని వూరికి బయలుదేరాడు.

* * *





ఆ మరునాడు....

గోపాలం, భానుమతి, రమేష్ సమావేశమయ్యారు.

"మన నాటకం ఇక బట్టబయలు చెయ్యటం మంచిది" అన్నాడు గోపాలం.

"సరే!" అంది భానుమతి.

"నాది ఒక్క సవరణ. ఈ నాటకం డైరెక్టుగా మా నాన్నగారికి చెప్పటంలో కొన్ని చిక్కులు వున్నాయి – ముఖ్యంగా నాకు. కాబట్టి ముందు మాయకు మనం ఏదీ దాచకుండా చెప్పాలి. ఆమెని కూడా మనతో కలుపుకుని ఈ నాటకానికి మంగళం పాడదాం. అప్పుడు అంత గొడవలు వుండవు" అన్నాడు రమేష్.

"ఇన్నాళ్ళకి బుర్ర వున్నవాడిలాగా మాట్లాడావు" అన్నాడు గోపాలం.

సరే అంటే సరే అనుకున్నారు. కాని ఆ మధ్యాహ్నం వరకు మాయ ఒంటరిగా దొరకలేదు.

"మాయగారూ! మీతో ఒక విషయం మాట్లాడాలి" అన్నాడు గోపాలం.

"ఏమిటి?"

"నిజాన్ని దాచిపెట్టటం. అబద్ధాన్ని నిజంగా చూపించటం యింక అనవసరం అనుకుంటాను. ఇక్కడ వున్న మేం ముగ్గురం మీకు దొంగల లాగానో, మోసగాళ్ళ లాగానో కనబడటం లేదు అనుకుంటున్నాను. మేము చేసింది తప్పే.... కాని తెలిసీ ఆ తప్పు ఎందుకు చేశామంటే.... క్షమించాలి. ఈ కథ ముందునించి చెప్పటం బాగుంటుంది."

మాయ ఏం మాట్లాడలేదు. రమేష్ బాగా చెబుతున్నావు అన్నట్లు గోపాలం వంక చూశాడు. భానుమతి మాయవంకే చూస్తున్నది. 'ఎంత నిబ్బరంగా వుంది. ఇంకా బయటపడలేదు' అని అనుకుంది.

"మొదట్లో రంగనాథరావు గారికి...."

గోపాలం మాటలు మొదట్లోనే ఆగిపోయాయి.

రంగనాథరావు చేతిలో ఎర్రకాయితంతో వచ్చాడు. ఆయన వెనకాల వెర్రి చూపులు చూస్తూ వెంకయ్య వచ్చాడు. (రంగనాథరావుకి ఈ సారి మతి పోవాలి అంటే ఎవరి నుంచో మతి అరువు తెచ్చుకోవాలి. అప్పుడు పోగొట్టుకోవాలి అని అనుకున్నాం! చూస్తుంటే అదే జరిగినట్లుంది!)

"రెండు రోజుల క్రితం హనుమంతానికి మతి పోయింది అని అనుకున్నాం. నిన్న జగన్నాధానికి చిత్త చాంచల్యం అనుకున్నాం. ఇప్పుడు ఈ తెలిగ్రాం చూస్తుంటే నాకు పిచ్చి ఎక్కేటట్లుంది" అన్నాడు రంగనాథరావు.

దీపావళి శుభాకాంక్షలతో

చవక ధరలకు
మరియు మన్నికకు

ఎల్లప్పుడూ

"వాల్టెక్స్"

ఫ్యాన్సీ దుస్తులపైనే
ఆధారపడండి.

★

లభించుచోటు :

మెస్సర్స్
విజయ్ ట్రేడర్స్
బీసెంట్ రోడ్,
విజయవాడ-2

★

తయారీదారులు :

మెస్సర్స్
వాల్టెక్స్ హొజైరీస్
తిరుప్పూర్ 63 } 604.

అందరూ అదేమిటా అన్నట్లు కుతూహలంగా ఆయన వంక చూశారు.

"ఇప్పుడు పురుషోత్తమరావుగారు వున్నారా ఇక్కడ "పురుషోత్తమరావు సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ అని రాధకు టెలిగ్రాం. ఇది ఎల్లా సాధ్యం?" తల గోక్కున్నాడు రంగనాధరావు!


"నాన్నా!" అని కేకలేసింది మాయ. మరునిముషం ఆమె చేతిలో టెలిగ్రాం నలిగిపోసాగింది.

అప్పుడే నిద్రలేచిన రిప్వాన్ వింకిల్ లా చూశాడు రంగనాధరావు. తేరుకుని రమేష్‌ని అడిగాడు. "ఏమిటది? పురుషోత్తమరావు సీరియస్ అంటే ఈ పిల్ల సంబంధం ఇష్టపడుతున్నావని ఈ నాటకం ఆడాము."

"ఏ నాటకం?"

గోపాలం మాయవంక చూశాడు. గోపాలం మనసు జాలితో కరిగిపోయింది. రాధ (పురుషోత్తమరావుకి నిజం తెలిసిపోయిందికదా! ఇంక అసలు పేర్లతో ముందుకుపోదాం)కు దగ్గరగా నడిచాడు.

"నిజంగా ఈ పరిస్థితులలో ఏమనాలో తెలియడం లేదు. ఇది మేము తెలిసి చేసిన తప్పుకాదు. తెలియక చేసిందీకాదు. తప్పు అని యిప్పటివరకు తెలియలేదు. సరదాగా ఆడిన నాటకం పర్యవసానం యింత




ఏడవట ఏమిటి! అసలు ఆయన యిక్కడే వున్నాడు కదా!"

అయిదు రూపాయలకు రెండు ప్రశ్నల జ్యోతిష్యుడిలా వెకిలి నవ్వు నవ్వాడు రమేష్. గోపాలాన్ని చూపిస్తు అన్నాడు. "ఈయన పురుషోత్తమరావు కాదు. అసలు ఈయన కూడా కాదు.... వీడు - వీడు నా స్నేహితుడు గోపాలం."

"క్షమించాలి!" అన్నాడు గోపాలం రంగనాధరావు తనవంక చూడగానే!

"ఈ అమ్మాయి రాధకాదు భానుమతి. భానుమతిని నేను ప్రేమించాను నాన్నా! భానుమతి మెడిసిన్ చదువుతోందని నువ్వు ఒప్పుకోవని. పురుషోత్తమరావుగారి చేదుగా వుంటుందనుకోలేదు" అన్నాడు గోపాలం.


రాధ తల ఎత్తి గోపాలంవంక చూసింది. గోపాలం మాటలలో వినిపించిన నిజాయితీ. అతని కళ్ళల్లో కనబడింది.

"..అట్లా వీడు ఆయన వేషంలో-భాను రాధ వేషంలో...."

గొంతు పెగుల్చుకుని అంది రాధ. "ఇందులో మీ తప్పు ఏంలేదు. నాదే తప్పు నాన్నని ఒంటరిగా వదిలి రావల్సింది కాదు."

"....ఈలోగా అసలు రాధగారికి ఎట్లాగో అనుమానం...."

"మీరు అట్లాగే అంటారు. ఇంకా కొద్ది



విష్ణు చక్రం

ఫొటో : వి. ఎస్. మోరపాకుల, మదిపాడు

సేపటిలో బొంబేకి ఫ్లయిట్ వున్నట్లుంది. మీరు ఒక్కరే వెళ్ళలేరు. నేనూ వస్తాను. అన్నట్లు మీ నాన్నగారు కళ్యాణ్‌లోనే కదూ వున్నది?" దీనంగా వున్న మాయని చూస్తుంటే తనని తాను నిగ్రహించుకోలేక గోపాలం ఆమె చెయ్యిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"....నీతో ఎప్పటినుండో ఈ సంగతి చెప్పాలనుకుని చెప్పలేకపోతున్నాం! రాధ పేరుతో నీకు వచ్చిన వుత్తరం అసలు రాధగారే...."

గోపాలం సముదాయింపులో కొంత వూరట పొందింది రాధ. "అవును. నాన్న కళ్యాణ్‌లోనే వున్నారు" అంది. రాధ చెయ్యి నిమురుతున్న గోపాలం చేతిః రాధ చేతిలోని టెలిగ్రాం చిక్కింది. అప్రయత్నంగా తీసి చదివాడు.

"....నిజంగా నాన్నా! ఇందులో మా తప్పు ఏం లేదు...."

"అరె! ఏమిటి?" ఆశ్చర్యంగా అన్నాడు గోపాలం.

"నీ తప్పు లేకపోవడం ఏమిటి? నాటకాలు ఆడతారా మీరు! చూడండి! ఇప్పుడు ఏం అయిందో! నాతో ముందే చెప్పక పోయావా నువ్వు భానుమతిని ప్రేమిస్తున్నానని?" రంగనాధరావుకి కోపం బాగా వచ్చింది. అరవసాగాడు.

"ఏమిటి?" అంది రాధ గోపాలాన్ని వుద్దేశించి.

"మీ నాన్నగారు కళ్యాణ్‌లో కదా వున్నది! ఇది విశాఖపట్నం నించి వచ్చిన టెలిగ్రాం. పైగా యిచ్చిన వారి పేరు సరిగ్గా లేదు.

"నిజమా?" అంది రాధ కుర్చీలోంచి లేస్తూ.

రంగనాధరావు, రమేష్ తమ సంభాషణ ఆపి అటు ప్రక్క చూశారు. భానుమతి వెళ్ళి రాధ ప్రక్కగా నిలబడింది.

రమేష్ గోపాలం చేతిలోని టెలిగ్రాం తీసుకుని "అవును. ఇది నిజం టెలిగ్రాం కాదు. ఎవరో రాస్కెల్ ఇచ్చివుంటాడు". అన్నాడు కోపంగా.

"ఇంకెవరూ? ఆ రాస్కెల్ హనుమంతం అయివుంటాడు" అంది భానుమతి.

"ఇదంతా నిజమేనంటారా? ఆ టెలిగ్రాం అబద్ధందా?" అంది రాధ.

"ఎందుకు? ఇంకో గంటలో తెలిసిపోతుంది. మీ నాన్నగారికి ట్రంకాల్ చేద్దాం!" అన్నాడు రంగనాధరావు.

కాల్ బుక్ చేశాక ఒక విధంగా అందరి మనసులు కుదుటపడ్డాయి.

"ఇందాక మీరు ఆడిన నాటకం మీద, మీ మీద నాకు చాలా కోపం వచ్చింది! కాని యిప్పుడు అంతా చాలా సరదాగా వుంది. నిజంగా నాకు తెలియకుండా నన్ను కలుపుకుని నా కళ్ళ ముందు ఇంత పెద్ద నాటకం ఆడటం - అదీ అనుమానం రాకుండా - చాలా గొప్ప విషయం" రంగనాధరావు పూర్తిగా అన్ని విషయాలు తెలుసుకోవడం మొదలుపెట్టాడు. ఎత్తులపై ఎత్తులు వింటూ మనస్ఫూర్తిగా నవ్వాడు. "ఇదంతా మావాడు లుంగీ అనుకుని చీరకట్టుకోవడంతో జరిగిందన్న మాట" అన్నాడు. (చీర సంగతి తెలుస్తే భానుమతి కొప్పడుతుందని అనుకున్నాడు రమేష్. ఈ చీరచూస్తే నేనే నిన్ను దొంగతనం చెయ్యమనేదాన్ని అంది భానుమతి తరువాత)

అంతలో ఫోన్ మోగింది.

* * *

ఆ రోజు సాయంకాలం....

భానుమతి. రమేష్. రాధ. గోపాలం వున్న కారు పబ్లిక్ గార్డెన్స్ దగ్గరగా ఆగింది.

రాధా. గోపాలం దిగారు. భానుమతి దిగబోతున్నది.

గోపాలం అన్నాడు కంగారుగా "భానుమతి! మీరు దిగవద్దు!" అని

"ఏం?"

"మీరు కట్టుకున్న చీర ఒరిజినల్ ఆసామి అదుగో అక్కడ వుంది" అన్నాడు జాంబవతిని చూపిస్తూ.

జాంబవతి దూరంగా ఎవరితోనో మాట్లాడుతున్నది. అందరి దృష్టి జాంబవతి మీదే వుంది. ఎప్పుడు వెళ్ళిపోతుందా అని చూస్తున్నారు.

ఇంతలో జాంబవతి గోపాలం, రాధలను చూసింది. వారివేపు రాసాగింది. అంతే. రమేష్ కారు ముందుకు వురికించాడు.

జాంబవతి వచ్చి చీర గురించి, జగన్నాధం గురించి కాసేపు మాట్లాడి వెళ్ళిపోయింది.

గోపాలం. రాధ లోపలికి వెళ్ళి కూర్చున్నారు.

"మిమ్మల్ని మొదటిసారి చూసినప్పుడు బాధపడ్డాను-మిమ్మల్ని మాయచేసి పంపేస్తున్నందుకు. మీరు మాయగా వచ్చినప్పుడు బెదిరిపోయాను - మా నాటకం అభాసుపాలు అవుతుందేమో అని. మా నాటకం అయిపోయాక ఇప్పుడు అనుకుంటున్నాను - నా అంత తెలివితక్కువవాడు వుండడని."

"అదేం?" అంది రాధ.

"మి మామయ్య జగన్నాథంగారి మీద కోపం వచ్చింది నాకు. కొంత కాలం క్రితం- నాకు ఆయన పెళ్ళి సంబంధాలు చూస్తున్నారని, ఇప్పుడు అది వేరెవ్వరో కాదు అని తెలిశాక యింకేం అనుకోమంటారు?"

మనోహరంగా సిగ్గుపడింది రాధ.

హేండ్ బాగ్‌లోంచి కొన్ని నలిగిపోయిన కాగితాలు తీసి గోపాలంకి ఇచ్చింది.

"ఏమిటివి?"

"నేను. భానుమతి విడివిడిగా రాసిన "ఏమిటో ఈ మాయ" పాట. రంగనాధరావు గారికి నేను రాసిన ఉత్తరం."

"ఎందుకు దాచారు?"

"ఒకవేళ రమేష్ భానుమతిని నిజంగా అపార్థం చేసుకుంటాడేమో అని!"వాళ్లను సరదాగా యేడిపించడమే నా వుద్దేశ్యం.

రంగనాధరావుకి రాధ, రాధ పేరుతో. రాధ వేషంలో వున్న భానుమతి రాసిందని పించేట్లు రాసిన వుత్తరం బిగ్గరగా చదివాడు గోపాలం.

శ్రీయుత రంగనాధరావుగారికి,

ఎట్లా రాయాలో, నా మనసులో వున్నది ఎట్లా చెప్పాలో అర్థం కావటంలేదు. నేను చేస్తున్న పనినే నమ్మకద్రోహం అంటారు కాబోలు! కాని నా మనసును చంపుకోలేను.

నేను మీ అబ్బాయి స్నేహితుడు గోపాలం గారిని ప్రేమిస్తున్నాను.

చివరి వాక్యాన్ని రెండుసార్లు చదివి అడిగాడు గోపాలం-"నిజంగానేనా?"

రాధ మళ్ళీ మనోహరంగా సిగ్గుపడింది.

(సమాప్తం)

## అంకితం

'ఓడ్ హవుస్ ఉచ్ఛిష్టం హాస్యం సర్వం' అని అనుకునే ఈ ఏకలవ్యుడు ఆ ఆచార్యుడికి యిస్తున్న కానుక- ఈ నవల.

—ప్రకాష్

